
మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - శుక్రవారం 13 నవంబర్ 2026 || సంపుటి: 10 || సంచిక: 307 || పేజీలు:12 || వెల రూ.5


HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

చంద్రుడిపై శాశ్వత స్థావరం



2

సాల్మన్ చేపలకు రక్షణగా 3,500 రోబోలు



2



చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

ఏకకాలంలో 4.5 లక్షల మందికి కొత్తగా పింఛన్లు మంజూరు

నవంబర్ 19న నూతన లబ్ధిదారులకు సొమ్ము చెల్లింపు

హైదరాబాద్, నవంబర్ 12, (మనం బ్యూరో): రాష్ట్రవ్యాప్తంగా నూతనంగా మంజూరైన చేయూత పింఛన్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం గురువారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఆయా నియోజకవర్గాల్లో పండుగ వాతావరణంలో

...మిగతా 2లో



మూడు టిమ్స్‌లకు ఒకే రిక్రూట్‌మెంట్

వైద్యులు పూర్తిగా వైద్యంపైనే దృష్టి సారించాలి

హౌస్ కీపింగ్ జాబ్ సోర్సింగ్‌కు ఇవ్వాలె

డిసెంబర్ నాటికి ఉస్మానియా నిర్మాణం పూర్తి చేయండి

వైద్య, ఆరోగ్య శాఖపై సమీక్షలో సీఎం

హైదరాబాద్, నవంబర్ 12 (మనం బ్యూరో): మూడు టిమ్స్‌లకు కలిపి ఒకే రిక్రూట్‌మెంట్ చేయాలనీ, వైద్యులు పూర్తిగా వైద్యంపైనే దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హౌస్ కీపింగ్ జాబ్ సోర్సింగ్‌కు ఇవ్వాలె నిమ్స్,టిమ్స్ మధ్య సమన్వయం ఉండాలని స్పష్టం చేశారు. గురువారం ఎంసీహెచ్ఆర్‌డీలో వైద్య, ఆరోగ్య శాఖపై సీఎం సమీక్షలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ డిసెంబర్ నాటికి ఉస్మానియా నిర్మాణం పూర్తి చేయాలని స్పష్టం చేశారు. నిమ్స్ లో బెడ్స్ ఖాళీ లేక పోతే రోగులను సనత్ నగర్ టిమ్స్ కు తరలించాలని సూచించారు. సనత్ నగర్ టిమ్స్ లో డాక్టర్స్ నియామకం అయ్యేంత వరకు బయట నుంచి డాక్టర్స్ ను నియమించుకోవాలన్నారు. టిమ్స్ లు,ప్రభుత్వ వైద్య కళాశాలలకు అదనంగా కావాల్సిన నిధులని మంజూరు చేయడానికి ప్రభుత్వం

...మిగతా 2లో



ప్రెస్ రిలీజ్‌లు పోయాయ్..

ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్‌దే హవా

ప్రధాని నరేంద్ర మోడీ



ఢిల్లీ, నవంబర్ 12: మీడియాతో తనకు సుదీర్ఘ కాలంగా అనుబంధం ఉందన్నారు ప్రధాని నరేంద్ర మోడీ. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదన్నారు. విపత్తులు, సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయిలో పనిచేసే రిపోర్టరులు కథనాల కోసం ఎంతదూరమైనా వెళ్తారని ప్రధాని ప్రశంసించారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టుల కోసం దీపావళి మిలన్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఇందులో

...మిగతా 2లో



అధికారంతో డీలిమిటేషన్‌కి ఆమోదం దొరకదు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్

ఢిల్లీ, నవంబర్ 12: డీలిమిటేషన్ బిల్లుని పార్లమెంటులో ఆమోదం చేయిస్తానని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పిన మాటలపై కాంగ్రెస్ స్పందించింది. అమిత్ షా నియోజక వర్గాల పునర్విభజన ప్రస్తావం మళ్లీ తీసుకొచ్చారని ఎద్దేవా చేసింది. గతంలో ఆయన లోక సభలో డీలిమిటేషన్ బిల్లు ఆమోదానికి ప్రయత్నించి ఓటమిని ఎదుర్కొన్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి

...మిగతా 2లో



ఆర్థిక ప్రగతికి జీసీసీలు చోదక శక్తులు


టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం

ఇతర పరిశ్రమలతో ఐటీ రంగం అనుకూలతల అనుసంధానం

మార్స్ జీసీసీ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్ నవంబర్ 12(మనం న్యూస్): తెలంగాణ ఆర్థిక ప్రగతికి గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను కీలక చోదక శక్తులుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని రాష్ట్ర ఐటీ,

...మిగతా 2లో



భారీగా ఐపీఎస్‌ల బదిలీ

హైదరాబాద్ సీపీగా ఎంఎం భగవత్

ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్,నవంబర్ 12, మనం ప్రతినిధి: తెలంగాణ రాష్ట్రంలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు జరిగాయి. ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 21 మంది సీనియర్ అధికారులను బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారంనాడు కీలక ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలాఉంటే, ఇక, లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్ విభాగాల్లో సీనీయర్‌లకు కీలకమైన పోస్టింగ్‌లను ఇచ్చారు. అత్యంత సౌమ్యుడిగా పేరున్న

...మిగతా 2లో

సోనియా గాంధీ ఆత్మకథపై విమర్శలు పట్టించుకోం

- **పీవీ, మన్మోహన్ ప్రధానులు అయ్యారంటే సోనియానే కారణం**
- **డిసెంబర్ 9న సోనియా గాంధీ సినిమా షూటింగ్ ప్రారంభిస్తా పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి**



హైదరాబాద్, నవంబర్ 12, (మనం బ్యూరో): ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ ఆదర్శాలను దృష్టిలో పెట్టుకుని అధికారిక పాలన, ప్రతిపక్షాన్ని నడిపించి ప్రజా సేవ చేసిన ఘనత సోనియా గాంధీదని పీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. తన జీవిత ప్రయాణం గురించి రాసిన పుస్తకంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు చేస్తున్న విమర్శలను పట్టించుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. గురువారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ తన జీవిత ప్రయాణం గురించి

...మిగతా 2లో

ప్రమాదం ఏ రూపంలో నైనా రావొచ్చు..

ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి



రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

ఢిల్లీ, నవంబర్ 12: యుద్ధాల తీరు మారుతున్న నేపథ్యంలో ఏ రూపంలోనైనా ముప్పు పొంచి ఉండొచ్చని రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్ అన్నారు. వాటిని ఎదుర్కొనేందుకు, ఆకస్మిక దాడులు నిర్వహించేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని సైన్యానికి పిలుపునిచ్చారు. ఢిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రక్షణ, ప్రతిదాడుల విషయంలో అధునాతన పద్ధతులను బలోపేతం చేసుకోవాల్సిన అవసరముందన్నారు. నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాలని, ముప్పును ముందే పసిగట్టి నష్టం సంభవించకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని దిశా నిర్దేశం చేశారు. ''శత్రువులు కోలుకోవడానికి సమయం ఇవ్వని సామర్థ్యాలను మన రక్షణ దళాలు పెంపొందించుకోవాలి. శత్రువులు ఉన్నపళంగా దాడి చేసినా.. వారి వ్యూహంలో చిక్కుకోకుండా ముందే అప్రమత్తమయ్యేలా బలంగా మారాలి. మన చర్యలు వారి ఊహకందని విధంగా ఉండాలి. గూఢచార, నిఘా యంత్రాంగాలను మరింత బలోపేతం చేసుకోవాలి. ఎలాంటి సవాలునైనా ఎదుర్కొనేందుకు ప్రతిక్షణం సిద్ధంగా ఉండాలి'' అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్- రష్యా, ఇజ్రాయెల్- హమాస్

...మిగతా 2లో

ఇప్పుడైనా నిజాలు తెలుసుకున్నారు.. థ్యాంక్స్

ఎంపీ ప్రియాంక గాంధీ



ఢిల్లీ, నవంబర్ 12: వయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ.. తన తల్లి సోనియా గాంధీ ఇటీవల విడుదల చేసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'ను గట్టిగా సమర్థించారు. తన గురించి తాను చెప్పుకొనే హక్కు ఆమెకు ఉందని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు గత కొన్నేళ్లుగా సోనియా గాంధీపై అబద్ధాల ప్రచారం చేస్తూ.. కల్పిత కథలు అల్లాయని మండిపడ్డారు. ఇప్పుడు వారంతా ఆ పుస్తకాన్ని చదువుతున్నందుకు

...మిగతా 2లో

అమెరికా ఆధిపత్యం చిప్‌లో చిక్కుకుందా?

అగ్రరాజ్యం ఆశలకు వివాహేతర సంబంధం గండి!

తీవ్ర చర్చనీయాంశంగా ఎన్‌విడియా జెన్సన్ వ్యవహారం



2

కరోనా కేసు.. కోర్టుకు హాజరైన సీఎం రేవంత్

హైదరాబాద్, నవంబర్ 12, (మనం బ్యూరో): కరోనా నిబంధనల ఉల్లంఘన కేసులో సీఎం రేవంత్ రెడ్డి కోర్టుకు హాజరయ్యారు. నాగార్జునసాగర్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో కరోనా నిబంధనలు ఉల్లంఘించారనే ఆరోపణలతో ఆయనపై కేసు నమోదైంది. ఆ కేసు విచారణలో భాగంగా గురువారం నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. అప్పట్లో టీపీసీసీ అధ్యక్షుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి.. 2021 ఏప్రిల్ 11న నల్గొండ జిల్లా

...మిగతా 2లో

ఎన్‌విడియా సీఈవో జెన్సన్ రాజీనామా

2

నిశ్శబ్దంగా ఉండండి

అమెరికా రక్షణ మంత్రిని మందలించిన గార్డ్

వాషింగ్టన్, నవంబర్ 12: అమరవీరుల గౌరవానికి భంగం కలిగిస్తే అమెరికా సైనికులు ఎంతటి వారినైనా ఉపేక్షించరనేందుకు నిదర్శనంగా తాజాగా ఓ ఘటన చోటు చేసుకొంది. ఆ దేశ రక్షణ మంత్రి, ఇతర అధికారులు ఓ గార్డ్ చేతిలో మందలింపునకు గురయ్యారు. అర్లింగ్టన్‌లోని నేషనల్ సెమిట్రీలో వెటరన్స్ డే కార్యక్రమం జరిగింది. దీనిలో అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, ఆయన సతీమణి జెన్నిఫర్, చీఫ్ ఆఫ్ స్టాఫ్ రికీబురియా,

...మిగతా 2లో



భారీ క్షిపణులు, సైనిక ట్రక్కులు..

ఇరాన్ భూగర్భంలో మరో మిసైల్ సిటీ



టెహ్రాన్, నవంబర్ 12: అమెరికా, ఇజ్రాయెల్‌లతో ముప్పు వేళ ఇరాన్ ఆయుధ సంపత్తికి సంబంధించి కీలక విషయం వెల్లడైంది. ఓ రహస్య ప్రాంతంలో నూతన భూగర్భ క్షిపణి కేంద్రాన్ని టెహ్రాన్ ప్రారంభించింది. ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కోర్ నిర్వహణలో ఉన్న ఈ కేంద్రంలో భారీ సంఖ్యలో బాలిస్టిక్, క్రూయిజ్ క్షిపణులు, ఆయుధ సామగ్రి,

...మిగతా 2లో



ఎల్‌నినో విపత్తును ఎదుర్కొనే దిశలో మనమంతా భాగస్వాములమవుదాం. సామాజిక బాధ్యతను నిర్వర్తిద్దాం. ఎల్ నినో ఎందుకు వచ్చింది..? ఇందుకు కారకులెవరు..?? లాంటివి ఇప్పుడు అప్రస్తుతం. మన ముంగిటికి ఎల్ నినో రక్కసి వచ్చి చేరింది. ఈ సమయంలో వ్యక్తిగతంగా ప్రతి పౌరుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి.. సామాజికంగా ఎలాంటి అడుగులు ముందుకు పడాలి ... ఇదే ఇప్పుడు అత్యవసరం. అలాగే ప్రభుత్వపరంగా తీసుకోవాల్సిన చర్యలు ఎలా ఉండాలి వంటి అంశాలు ఎంతో ముఖ్యం. ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇందుకు సన్నద్ధమయ్యాయి. పౌరులుగా మనమందరం కూడా ఇందుకు సిద్ధం కావాలి. తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి సబ్ కమిటీని సైతం ఏర్పాటు చేసింది. ఎల్ నినోలాంటి విపత్తులను దిగ్విజయంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ప్రజలు ఎవరి బాధ్యతలను వాళ్లు నిర్వర్తించాల్సిందే... ఎల్ నినో ప్రభావం ఇప్పుడిప్పుడే ప్రారంభమైనప్పటికీ సమీప భవిష్యత్తులో దాని విశ్వరూపాన్ని చూడాల్సిన పరిస్థితిలు రావచ్చు.. విపత్కర పరిస్థితులను ఎదుర్కోవడం మనకేం కొత్త కాకపోయినప్పటికీ పౌరులుగా మనం తీసుకోవాల్సిన జాగ్రత్తలు మనం తీసుకోవాల్సిందే... ప్రభుత్వాలు చేపట్టాల్సిన చర్యలు చేపట్టాల్సిందే. ఈ కోణంలోనే ఎలాంటి జాగ్రత్తలు ప్రజలు తీసుకోవాలి , ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు చేపట్టాలి అనే అంశాన్ని మీరు సూటిగా స్పష్టంగా తెలియజేయండి. ఈ విపత్కర పరిస్థితులకు కారకులు వీరంటూ, వారంటూ ఎవరిని నిందించాల్సిన అవసరం లేదు.. అసలు ఆ జోలికే వెళ్ళకూడదు.. నిర్మాణాత్మకంగా ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు, ప్రజలు పాటించాల్సిన జాగ్రత్తలు వీటిపైనే మీ సూచనలు సలహాలు పంపాలి.. మీడియా సంస్థగా మనం తెలుగు దినపత్రిక ఈ అంశాన్ని తన బాధ్యతగా గుర్తించి ఈ బహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈ మహా యజ్ఞంలో మీరూ పాలుపంచుకోండి. మీ ఆలోచనలను మాకు పంపించండి. వాటిని మీ పేరు, చిరునామా, ఫోటోతో పాటు ఈ శీర్షికలో రోజువారీగా ప్రచురిస్తాం. ఉత్తమ సూచనలకు గుర్తింపు కూడా ఇస్తాం మీ ఆలోచనలు, సలహాలు, సూచనలను పైన తెలిపిన వాట్సాప్ లేదా ఈ మెయిల్‌కు పంపించండి.

- ఎడిటర్

సాల్మన్ చేపలకు రక్షణగా 3,500 రోబోలు

ఓస్లో, నవంబర్ 12: నార్వేలో సాల్మన్ చేపలకు రక్షణగా వేల సంఖ్యలో అండర్ వాటర్ రోబోలను మోహరించారు. రసాయనాల బారి నుంచి చేపలను కాపాడేందుకు ఈ చర్యలు తీసుకొన్నారు. ఆ దేశంలో సాల్మన్ చేపలను సీలైస్ (సముద్రపు పేను) సమస్య తీవ్రంగా వేధిస్తోంది. దీంతో చేపలను వాటి నుంచి కాపాడేందుకు గతంలో రసాయనాల్లో ముంచి తీసేవారు. అయితే అలాంటి చేపలను తీసుకొనే మనుషులపై దుష్ప్రభావం పడుతుందన్న భయాలున్నాయి. ఈ నేపథ్యంలో ఓస్లో కేంద్రంగా పనిచేసే స్టింగరే మెరైన్ సొల్యూషన్స్ సంస్థ వినూత్న పరిష్కారం చూపించింది. దాదాపు 3,500 ప్రత్యేకమైన సబ్మెరైన్ రోబోలను రంగంలోకి దించింది. గతేడాదే 1,000 రోబోలను కొత్తగా తీసుకొచ్చింది. ఇవి సాల్మన్ చేపలను సీలైస్ నుంచి కాపాడుతున్నాయి. నార్వేలోని ఫామ్స్లో ఉన్న దాదాపు 112 మిలియన్ల చేపలకు రక్షణగా ఉన్నాయి. దేశంలోని 25 శాతం వరకు సాల్మన్ చేపలను పర్యవేక్షిస్తున్నాయి. ఈ రోబోలు చేపల శరీరాలపై, అలాగే సమీపంలోని సీలైస్ను గుర్తించి లేజర్ సాయంతో చంపేస్తాయి. ఇవి చేపలకు కూడా హానికారకం కాదు. దీనికి తోడు చేపలను ప్రతిక్షణం పర్యవేక్షించేలా రైతులు 15,000 కెమెరాలను వినియోగిస్తున్నారు. గతంలో ఈ రోబోలు లేని సమయంలో చేపలను రసాయనాలతో కడిగేవారు. ఫలితంగా ఆ విషాలు తినే ఆహారంలో కూడా చేరేవి. దీనికి తోడు కాలక్రమేణ సీలైస్ కూడా వీటిని తట్టుకొనే స్థాయికి చేరుకొన్నాయి. తాజా విధానంతో కెమికల్స్ అవసరం లేకుండాపోయింది.

చేయూత పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ

(మొదటి పేజీ తరువాయి)

జరుగుతున్న ఈ కార్యక్రమాలకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు హాజరై లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్నారు. కొత్తగా పింఛన్లు మంజూరు కావడంతో లబ్ధిదారులు, వారి కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎంపిణీ కార్యక్రమాలు సజావుగా జరిగేలా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, సెర్ప్ పకడ్బందీ ఏర్పాట్లు చేశాయి. రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో మరో 4.5 లక్షల మందికి కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసింది. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే 1,23,625 మందికి కొత్తగా పింఛన్లు మంజూరు చేయగా, తాజాగా మరో 4.5 లక్షల మందికి మంజూరు చేసింది. దీంతో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కొత్తగా పింఛన్లు పొందుతున్న వారి సంఖ్య మొత్తం 5,73,625కు చేరింది. ఈ నెల 18 వరకు అన్ని నియోజకవర్గాల్లో మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమాలు నిర్వహిస్తారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా నవంబర్ 19న నూతన లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును చెల్లించనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియను చేపట్టింది.

చంద్రుడిపై శాశ్వత స్థావరం

న్యూయార్క్ , నవంబర్ 12: జాబిల్లిపై పరిశోధనలు చేపట్టేందుకు అమెరికా పరిశోధనా సంస్థ నాసా సరికొత్త సన్నాహాలకు సిద్ధమైంది. ఆర్టెమిస్ ప్రోగ్రామ్ను తిరిగి ప్రారంభించనుంది. దీనిపై కొత్త వ్యోమగాముల కోసం దరఖాస్తులకు ఆహ్వానించింది. ఎవరైతే చంద్రుని ఉపరితలంపై ఉంటూ, పని చేయగలరో అలాంటి వారి కోసం ఈ నియామకాలు చేపట్టింది నాసా సంస్థ.

మానవుడు భూమిపైన ఎలా నివసిస్తున్నాడో అలానే చంద్రుడిపైన శాశ్వతంగా నివసించేలా చేయడమే ఈ ఆర్టెమిస్ ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం. వ్యోమగాములను చంద్రుని దక్షిణ ధ్రువంపైకి తీసుకెళ్లనున్నారు. ఎందుకంటే అక్కడ శాశ్వతంగా ఉండే నీడలో ఎక్కువ నీరు ఉంటుందని శాస్త్రవేత్తలు విశ్వసిస్తున్నారు. ఇక్కడ తాగునీరు, ఆక్సిజన్ దొరకడంతో భవిష్యత్తు పరిశోధనలకు సహాయపడనుంది. స్పేస్ ఎక్స్, బ్లూ ఆరిజన్ ప్రైవేటు కంపెనీలతో కలిసి ఈ ప్రోగ్రామ్ను చేయబోతున్నారు.

ఈ నియామకాలు కేవలం అమెరికా పౌరులకు మాత్రమే. సైన్స్ అండ్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ లేదా మ్యాథ్స్లో మాస్టర్స్ డిగ్రీతో పాటు మూడు సంవత్సరాలు సంబంధిత వృత్తిలో అనుభవం కలవారు అప్లై చేసుకోవచ్చని నాసా సంస్థ తెలిపింది. దరఖాస్తు చేసుకోవడానికి డిసెంబరు 4 చివరి తేదీగా ప్రకటించారు.

ఆర్థిక ప్రగతికి జీసీసీలు చోదక శక్తులు

(మొదటి పేజీ తరువాయి)

పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. కొత్త టెక్నాలజీ అభివృద్ధి, ఆర్ అండ్ డీ, డేటా అనలిటిక్స్, ప్రొడక్ట్ డిజైన్, ఇంజినీరింగ్, ఇన్నోవేషన్ తదితర విభాగాల్లోనూ కీలక పాత్ర పోషించేలా వాటికి మార్గనిర్దేశం చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. స్నికర్స్, పెడిగ్రీ, రాయల్ కానిన్ తదితర ప్రముఖ బ్రాండ్‌లతో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన మార్స్ సంస్థ గచ్చిబౌలి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ లో 60 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో అభివృద్ధి చేసిన జీసీసీని ఆయన గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... హైదరాబాద్‌ను సంప్రదాయ ఐటీ సేవల కేంద్రం నుంచి ప్రపంచస్థాయి టెక్నాలజీ, ఇన్నోవేషన్, నాలెడ్జ్ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా అభివృద్ధి చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. కొత్త రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించేందుకు, ఉద్యోగ అవకాశాలను పెంపొందించేందుకు ఐటీ,ఐటీఈఎస్ రంగంలో హైదరాబాద్‌కు ఉన్న అనుకూలతలను ఇతర పరిశ్రమలతో అనుసంధానించడంపై ప్రత్యేకంగా దృష్టి సారించామని ఆయన పేర్కొన్నారు. ఈ లక్ష్యాలకు అనుగుణంగానే 'తెలంగాణ రైజింగ్ 2047' విజన్‌లోనూ టెక్నాలజీ, పరిశ్రమలు, నైపుణ్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చామన్నారు. జెన్‌పాక్ట్ సహకారంతో ఏర్పాటైన ఈ కేంద్రంలో ప్రస్తుతం 400 మందికి పైగా ఉపాధి లభించనుందని, రాబోయే రోజుల్లో ఈ సంఖ్య వేయికి పెరుగుతుందని శ్రీధర్ బాబు ఆశాభావం వ్యక్తంచేశారు.

మార్స్ గ్లోబల్ ఆపరేషన్స్ కు అవసరమైన డిజిటల్, డేటా, ఏఐ సామర్థ్యాలను మరింత బలోపేతం చేస్తుందని మంత్రి వెల్లడించారు. కార్యక్రమంలో మార్స్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ క్లాస్ ఆగార్డ్, జెన్‌పాక్ట్ ప్రతినిధి తరుణ్ చోప్రా, అమెరికా కాన్సులేట్ జనరల్ హైదరాబాద్ ప్రతినిధి ఎమీలియా బి. స్మిత్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టుకు హాజరైన సీఎం రేవంత్

(మొదటి పేజీ తరువాయి)

పెద్దవూర మండలం చలకుర్తి గ్రామంలో నిర్వహించిన ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాస్కులు ధరించకుండా, తగిన జాగ్రత్తలు తీసుకోకుండా కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించినట్లు కేసు నమోదైంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ (సీఆర్పీసీ) 313 కింద నిందితుల వాంగ్మూలం నమోదు చేసేందుకు న్యాయస్థానం విచారణ చేపట్టింది.

అమెరికా ఆధిపత్యం చిప్‌లో చిక్కుకుందా?

వాషింగ్టన్, నవంబర్ 12: అమెరికా ప్రపంచ పెద్దన్న! ఆర్థిక, సైనిక, సాంకేతిక రంగాల్లో అగ్రగామి దేశం. అయితే కొన్ని దశాబ్దాలుగా దాదాపు అన్ని రంగాల్లోనూ దానికి చైనా గట్టి పోటీ ఇస్తోంది. వాటిలో అత్యంత ముఖ్యమైనది- సాంకేతిక రంగం. అందులోనూ.. ఇటీవలి కాలంలో ప్రపంచాన్ని కొత్త పుంతలు తొక్కిస్తున్న కృత్రిమ మేధ విషయంలో పైచేయి సాధించేందుకు రెండు దేశాలూ హోరాహోరీగా పోటీ పడుతున్నాయి.

ఇలాంటి తరుణంలో ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ వివాహేతర సంబంధం వ్యవహారం.. ఏఐ రంగంలో అమెరికా ఆధిపత్య ఆరాటానికి గండి కొట్టొచ్చన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. సాధారణంగా వివాహేతర సంబంధాలు వ్యక్తిగత వ్యవహారాలు. కానీ జెన్సన్ వ్యవహారం అందుకు చాలా భిన్నం. ఇది ప్రస్తుతం ప్రపంచవ్యాప్త చర్చనీయాంశం. ఏఐ రంగంలో ఆధిపత్యం కోసం వాషింగ్టన్, బీజింగ్ మధ్య ఆధిపత్య పోరులో ఎన్విడియా కీలకం కావడం ఇందుకు ఓ ప్రధాన కారణం! ''కృత్రిమ మేధ పరుగు పందెంలో ఎవరు గెలిస్తే వాళ్లదే అంతిమ విజయం'' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పలుమార్లు వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఏఐకి ఉండబోయే ప్రాముఖ్యతను.. దానిపై పట్టు కోసం అమెరికా పడుతున్న ఆరాటాన్ని ఆయన వ్యాఖ్యను బట్టి అర్థం చేసుకోవచ్చు. ట్రంప్ రెండోసారి అధికార పీఠమెక్కాక ఏఐ రంగంలో తమ దేశాన్ని పరుగులు పెట్టించేందుకు కృషి మొదలుపెట్టారు.

ఏఐ ఆధారిత అత్యాధునిక చిప్లను తయారుచేసే ఎన్విడియాపై ఈ విషయంలో ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. చైనాపై తాము ఆధిపత్యం సాధించేందుకు ఆ సంస్థ దోహదపడుతుందని అనుకున్నారు. గత నెలలోనే జెన్సన్కు ట్రంప్ 'నేషనల్ మెడల్ ఆఫ్ సైన్స్' కూడా అందజేశారు.

హైదరాబాద్ సీపీగా ఎంఎం భగవత్

(మొదటి పేజీ తరువాయి)

అకున్ సబర్వాల్‌ను రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీతో పాటు ఆయనకు కీలకమైన కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ విభాగాల బాధ్యతలను కూడా ప్రభుత్వం కేటాయించింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో గతంలో ఎన్నడు లేనంతగా పెద్ద ఎత్తున భారీ స్థాయిలో బదిలీలు చేపట్టారు. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్‌ను తప్పించి, ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ సీపీ(కొత్వాల్)గా ప్రభుత్వం నియమించింది. అయితే, సీపీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డైరెక్టర్ జనరల్‌గా (డీజీ) బదిలీ చేశారు. వీటితో పాటు ఆయనకు అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డీజీ బాధ్యతలను కూడా అప్పగించారు.

బదిలీ అయిన 21 మంది ఐపీఎస్ అధికారులు వీరే... చేపట్టనున్న కొత్త బాధ్యతలు..

1. డాక్టర్ సౌమ్య మిశ్రా (1994 బ్యాచ్): డీజీపీ (మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా), ఏడీజీపీ (ఆర్గనైజేషన్ లీగల్)గా అదనపు బాధ్యతలు
2. మహేశ్ మురళీధర్ భగవత్ (1995 బ్యాచ్): హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్
3. వీసీ సజ్జనార్: డీజీ (తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ సివిల్ డిఫెన్స్), ఎస్‌పీఎఫ్ డీజీగా అదనపు బాధ్యతలు
4. స్వాతి లక్రా (1995 బ్యాచ్): జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు
5. చారు సిన్హా (1996 బ్యాచ్): ఏసీబీ డైరెక్టర్ జనరల్, సీఐడీ డీజీపీగా అదనపు బాధ్యతలు
6. డాక్టర్ అనిల్ కుమార్ (1996 బ్యాచ్): టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్
7. వై. నాగిరెడ్డి (1997 బ్యాచ్): పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎక్స్-అఫీషియో ప్రిన్సిపల్ సెక్రటరీ (లీగల్ మెట్రాలజీ)
8. విక్రమ్ సింగ్ మాన్ (1998 బ్యాచ్): గ్రేహౌండ్స్ ఆక్టోపస్ డీజీపీ (ఆపరేషన్స్), పోలీస్ హౌసింగ్ విభాగం
9. ఎం. స్టీఫెన్ రవీంద్ర (1999 బ్యాచ్): టీజీ-టీఎంఎఆర్ఎస్ డైరెక్టర్
10. అకున్ సబర్వాల్ (2001 బ్యాచ్): అదనపు డీజీపీ (లా అండ్ ఆర్డర్), కోఆర్డినేషన్ టెక్నికల్ సర్వీసెస్
11. సంజయ్ కుమార్ జైన్: అదనపు డీజీపీ (ట్రైనింగ్)-అదనపు బాధ్యతలు
12. ఎస్. చంద్రశేఖర్ రెడ్డి (2004 బ్యాచ్): డైరెక్టర్, అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)
13. కార్తికేయ (2006 బ్యాచ్): ఐజీ (మల్టీ జోన్-1), ఐసీసీసీ డైరెక్టర్
14. కె. రమేష్ నాయుడు (2006 బ్యాచ్): రైల్వేస్ ఐజీ
15. కె. నారాయణ నాయక్ (2009 బ్యాచ్): జోన్-2 (బాసర) డీఐజీగా అదనపు బాధ్యతలు
16. ఎల్.ఎస్. చౌహాన్ (2009 బ్యాచ్): డీఐజీ (కోఆర్డినేషన్), జోన్-6 డీఐజీగా అదనపు బాధ్యతలు
17. డి. జోయల్ డేవిస్ (2010 బ్యాచ్): టీజీ-టీఎంఎఆర్ఎస్ రోడ్ సేఫ్టీ ట్రాఫిక్ జాయింట్ డైరెక్టర్, హైదరాబాద్ ట్రాఫిక్ జాయింట్ సీపీగా అదనపు బాధ్యతలు
18. జి. చందన దీప్తి (2012 బ్యాచ్): జోన్-7 (జోగులాంబ/గద్వాల) డీఐజీగా అదనపు బాధ్యతలు
19. ఆర్. భాస్కరన్ (2012 బ్యాచ్): డీఐజీ (ఇంటెలిజెన్స్)
20. శ్రీ బాలాదేవి: టీజీ-టీఎంఎఆర్ఎస్ డిప్యూటీ డైరెక్టర్ (అడ్మిన్)
21. వి. అరవింద బాబు: హైదరాబాద్ సిటీ డీసీపీ (ఎస్ఎం ఐటీ)లకు శాఖలకు వీరిని బదిలీ చేశారు. వీరంతా త్వరలోనే తమకు అప్పగించిన శాఖల్లో బాధ్యతలు చేపట్టనున్నట్లు ఓ సీనియర్ ఐపీఎస్ అధికారి తెలిపారు.

ఎన్‌విడియా సీఈవో జెన్సన్ రాజీనామా

వాషింగ్టన్, నవంబర్ 12: ఎన్‌విడియా సీఈవో జెన్సన్ హువాంగ్ తన పదవికి రాజీనామా చేశారు. చైనా గూఢచారిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న అలిస్ హువాంగ్‌తో వివాహేతర సంబంధమున్నట్లు ఆయన ఇటీవల వెల్లడించడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఇదే సమయంలో సంస్థకు చెందిన మహిళతోనూ సంబంధాలున్నాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. దీంతో జెన్సన్ పదవి నుంచి వైదొలగాలనే డిమాండ్లు మొదలయ్యాయి. తాజా పరిణామాలు జాతీయ భద్రతపై ఆందోళనలు రేకెత్తించడంతో రాజీనామా చేస్తున్నట్లు జెన్సన్ ప్రకటించారు.

ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్‌దే హవా

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. ''విలేకరులతో నాకు సుదీర్ఘకాల అనుబంధం ఉంది. బీజేపీలో చేరిన తొలినాళ్లలో మీడియా ఈవెంట్ల కోసం కుర్చీలు వేసే బాధ్యత నాదే. గడిచిన కొన్నేళ్లలో జర్నలిజంలో ఎన్నో మార్పులు వచ్చాయి. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి జరిగింది. ఒకప్పుడు మీడియా సమావేశాల ప్రసారం కోసం అవుట్ సైడ్ బ్రాడ్‌కాస్ట్ వ్యాన్లను ఉపయోగించేవారు. ఇప్పుడు మొబైల్ ఫోనే ఈ వాహనంగా మారిపోయింది. గతంలో పత్రికా ప్రకటనలు (ప్రెస్ రిలీజ్‌లు) ఇచ్చేవారు. ఇప్పుడు సామాజిక మాధ్యమాల విస్తృతితో అన్నీ ఇన్‌స్టా రీల్స్‌లోనే తెలిసిపోతున్నాయి'' అని నరేంద్ర మోడీ వివరించారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రధాని వివరించారు. పేదరిక నిర్మూలన కోసం కృషి చేసినట్లు పేర్కొన్నారు. ''ఒకప్పుడు గరీబీ హఠావో వంటి నినాదాలు వినిపించేవి. కానీ, మా ప్రభుత్వం గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని దారిద్ర్య రేఖ నుంచి బయటపడేసింది'' అని మోడీ వెల్లడించారు. దేశంలో అసాధారణ విజయాలు సాధించినవారు ఎంతోమంది ఉన్నారని.. వారి విజయ గాథలను ప్రపంచానికి తెలియజేయాలని విలేకరులను కోరారు.

నిశ్శబ్దంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

డిప్యూటీ చీఫ్ ఆఫ్ స్టాఫ్ ప్యాట్రిక్ వీవర్ తదితరులు పాల్గొన్నారు. వీరంతా కలిసి అమర వీరుడి సమాధి వద్ద నివాళి అర్పించి గ్రూప్ ఫొటో దిగారు. ఆ తర్వాత వారు ఏదో మాట్లాడుకొంటూ బిగ్గరగా నవ్వారు. దీంతో అక్కడ గార్డ్‌గా ఉన్న సైనికుడు స్పందించాడు. ''సందర్శకులు అందరూ నిశ్శబ్దాన్ని, గౌరవప్రదమైన వాతావరణాన్ని కొనసాగించాలి'' అని చాలా బిగ్గరగా చెప్పాడు. దీంతో ఒక్కసారిగా పీట్ హెగ్సెత్ బృందం నివ్వెరపోయింది. ఆ తరువాత సైలెంట్‌గా అక్కడి నుంచి నిష్క్రమించింది.

సైనికుడు సరైన పనే చేశాడు: పెంటగాన్

ఈ ఘటనపై పెంటగాన్ ప్రతినిధి సియాన్ పార్నెల్ స్పందించారు. ''ఈ పవిత్రమైన రోజును గుర్తు చేస్తూ.. ఆ సైనికుడు అక్కడి గౌరవాన్ని కొనసాగించాలని సరిగ్గా.. బాధ్యతాయుతంగా చెప్పాడు'' అని పేర్కొన్నారు.

పీట్ హెగ్సెత్ సందర్శించిన సమాధి మొదటి, రెండో ప్రపంచ యుద్ధాలు, కొరియన్ వార్‌లో పాల్గొని ప్రాణాలు కోల్పోయిన గుర్తు తెలియని సైనికులది. దీనిని అమెరికాలో అత్యంత పవిత్రమైన యుద్ధ స్మారకాల్లో ఒకటిగా భావిస్తారు. దీనికి 1948 నుంచి అమెరికా ఆర్మీలోని 3వ ఇన్‌ఫాంట్రీ రెజిమెంట్లోని గార్డ్‌లు ఎల్లవేళలా పహారా కాస్తుంటారు. ఈ రెజిమెంట్‌ను అమెరికాలో 'ది ఓల్ గార్డ్' అని వ్యవహరిస్తారు. వాస్తవానికి ఈ ఘటనకు ఒక రోజు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ కూడా ఈ సమాధిని సందర్శించారు.

సోనియా గాంధీ ఆత్మకథపై విమర్శలు పట్టించుకోం

(మొదటి పేజీ తరువాయి)

పుస్తక రూపంలో ఆవిష్కరించారనీ, ఆమె రాసిన ఆత్మకథ ఆధారంగా సినిమా తీస్తానని ప్రకటించారు. ఈ ఏడాది డిసెంబర్ 9కి సినిమా షూటింగ్ ప్రారంభం అవుతుందనీ, వచ్చే ఏడాదికి సినిమా విడుదల చేస్తానని తెలిపారు. సోనియా గాంధీపై తీసే సినిమాలో నిజమైన పాత్ర తనది కూడా ఉంటుందని తెలిపారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్, తాను సన్నిహితంగా ఉన్న మంత్రులతో సినిమాపై మాట్లాడతామని స్పష్టం చేశారు. కంగనా రనౌత్ సోనియా ఆత్మకథపై చేసిన విమర్శలపై స్పందిస్తూ కంగనా రనౌత్ లీడర్ కాదు...యాక్టర్ చరిత్ర తెలియని పిల్ల ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ ఆధారంగా విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. పిల్లలు చిన్నగా ఉన్నప్పుడు భర్త చనిపోతే పిల్లల్ని ఎలా పెంచాలనేది మా అమ్మ నుంచి నేర్చుకున్నా...ఆ తల్లి కష్టాలు ఎలా ఉంటాయో తెలుసు అందుకే సోనియా గాంధీ గురించి మాట్లాడుతున్నానని వ్యాఖ్యానించారు. ప్రతి మహిళను తల్లిగా భావించాలని ప్రసంగాలు చేసే ఆర్ఎస్ఎస్ రాజకీయ కారణాలు చూపి సోనియా గాంధీని విమర్శిస్తున్నదనీ, ఇదేనా మీ సిద్ధాంతం అని ప్రశ్నించారు.

బీజేపీ, ఎంఐఎంది పాలి పంచాయతీ అనీ, ఉదయం తన్నుకుంటారు, చీకట్లో కలిసి పోతారని ఎద్దేవా చేశారు. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ తన పుస్తకంలో రాసుకోవాలా ? తెలంగాణ తీసుకున్న మనం సోనియా గాంధీ గురించి రాయాలని స్పష్టం చేశారు. ఆ ఆలోచన కూడా బీఆర్ఎస్ నేతలకు లేదనీ, మంచి కుటుంబం నుంచి వచ్చిన వినోద్ కుమార్ చీప్ పాలిటిక్స్ చేయవద్దని హితవు పలికారు. దేశానికి పీవీ, మన్మోహన్ సింగ్ ప్రధాని అయ్యారంటే అందుకు సోనియా గాంధీనే కారణమనీ, రాష్ట్రం విడిపోయినా...వైఎస్ రాజశేఖర్ రెడ్డి, రోశయ్య, కిరణ్ కుమార్ రెడ్డి, కేసీఆర్, రేవంత్ రెడ్డి సీఎంలు అయ్యింది సోనియా గాంధీ వల్లనే ఇది నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రజల కోసం సోనియా గాంధీలాగా నిలబడిన చరిత్ర మరో రాజకీయ కుటుంబానికి లేదని ఈ సందర్భంగా జగ్గారెడ్డి పేర్కొన్నారు.

అధికారంతో డీలిమిటేషన్‌కి ఆమోదం దొరకదు

(మొదటి పేజీ తరువాయి)

జైరాం రమేశ్ గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు.కేంద్ర ప్రభుత్వం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అంశాలకు పార్లమెంటు ఆమోదం పొందడానికి ఈ ఏడాది ఏప్రిల్ 16, 17 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక సమావేశాల్లో రాజ్యాంగ సవరణ బిల్లుని తీసుకొచ్చింది. పార్లమెంటులో ప్రస్తుతం ఉన్న నిష్పత్తిని ఇలాగే కొనసాగిస్తూ సీట్లు పెంచుతామని ప్రధాని మోడీ, హోం మంత్రి అమిత్ షా సభాముఖంగా అన్ని పక్షాలకూ హామీ ఇచ్చారు.అయితే, ఆ సీట్ల పెంపును ఏ ప్రాతిపదికన పెంచేదీ బిల్లులో స్పష్టం చెప్పకపోవడం వల్ల ప్రతిపక్షాలు వ్యతిరేకించాయి. దాంతో రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది.



మూడు టిమ్స్‌లకు ఒకే రిక్రూట్‌మెంట్

(మొదటి పేజీ తరువాయి)

సిద్ధం గా ఉందని స్పష్టం చేశారు. జూన్ 2 నాటికి అన్ని టిమ్స్ లు అందుబాటులోకి రావాల్సిందే..డిసెంబర్ నాటికి ఉస్మానియా హాస్పిటల్ నిర్మాణం పూర్తి కావాలి.. వైద్యులు, సిబ్బంది హాజరు విషయం లో సాంకేతికత ను వినియోగించాలని పేర్కొన్నారు. హాస్పిటల్ నిర్వహణ అత్యంత కీలకమనీ, ఆ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రోగులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశానికి ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, వైద్య శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్. చోంగ్తు, సీఎంవో కార్యదర్శి మాణిక్ రాజ్, ఆర్థిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ , రవాణా, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి ఇలంబర్తి ,ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ముషర్రఫ్ అలీ ఫారూఖీ , జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్. వి. కర్ణన్ , రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ ఇఒ హనుమంత్ కొండిబా, వైద్య విద్య సంచాలకులు డాక్టర్ ఎన్. వాణి , నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్, ఖీఐఖి సనత్నగర్ డైరెక్టర్ డాక్టర్ నరేందర్, తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఇప్పుడైనా నిజాలు తెలుసుకున్నారు.. థ్యాంక్స్

(మొదటి పేజీ తరువాయి)

సంతోషంగా ఉందన్నారు. వయనాడ్ పర్యటనకు వెళ్లిన ప్రియాంక గాంధీ.. అక్కడ మీడియాతో మాట్లాడారు. విదేశీ మహిళ అంటూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు నిరంతరం విమర్శిస్తున్నా సోనియా మాత్రం ఇప్పటి వరకూ నోరెత్తలేదన్న అంశాన్ని గుర్తుచేశారు.''భారత్‌లో నా తల్లి జీవితం గురించి బీజేపీ, ఆర్ఎస్ఎస్ నోటికొచ్చినట్లు మాట్లాడాయి. అబద్ధాలు ప్రచారం చేస్తూ.. కల్పిత కథనాలు రాశారు. అయినా, ఆమె ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయారు. ఇప్పుడు వాస్తవాలను పుస్తకం రూపంలో ఆమే స్వయంగా చెప్పారు. అందులో తప్పేముంది. అది ఆమె హక్కు. ఇన్నాళ్లూ బీజేపీ అబద్ధాలు చెబితే.. ఇప్పుడు నిజమేంటో ప్రజల ముందుకు నా తల్లి తీసుకొచ్చారు.'' అని ప్రియాంక గాంధీ అన్నారు.



ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

యుద్ధాల గురించి ఆయన ప్రస్తావించారు. ఆధునిక యుద్ధాల్లో రైఫిళ్ల కంటే.. డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌కు ప్రాధాన్యత ఏర్పడిందన్నారు. ఆత్మాహుతి డ్రోన్లు (కామికాజి), నిఘా డ్రోన్ల వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. సైబర్ యుద్ధాలు, అంతరిక్షంలోనే ఆయుధాలను మోహరించి శత్రువులపై దాడి చేయడం లాంటి అత్యాధునిక యుద్ధ రీతుల కోసం ప్రత్యేక విధానాలను అభివృద్ధి చేయాలని వైమానిక దళానికి పిలుపునిచ్చారు.

ఇరాన్ భూగర్భంలో మరో మిసైల్ సిటీ

(మొదటి పేజీ తరువాయి)

సైనిక వాహనాలున్నాయి. ఇటీవల కొందరు సీనియర్ సైనిక కమాండర్లు ఇందులో పర్యటిస్తూ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. వీటికి సంబంధించిన దృశ్యాలను ఇరాన్ అధికారిక మీడియా ఇటీవల విడుదల చేసింది. ఇరాన్ సాయుధ బలగాల చీఫ్ ఆఫ్ స్టాఫ్ అలీ అబ్దుల్లాహీ, ఐఆర్జీసీ ఏరోస్పేస్ ఫోర్స్ కమాండర్ మాజిద్ మౌసావీలు ఈ రహస్య సొరంగంలో పర్యటిస్తున్న దృశ్యాలు కనిపించాయి. అయితే, ఆ కేంద్రం ఎక్కడుంది? ఎప్పుడు పర్యటించారనే విషయాలు మాత్రం వెల్లడించలేదు. ఈ సందర్భంగా అబ్దుల్లాహీ మాట్లాడుతూ.. శత్రువు తమపై దాడికి పాల్పడితే ప్రతిస్పందన ఈ ప్రాంతం దాటి ఉంటుందని హెచ్చరించారు. తమవద్ద ఉన్న అత్యాధునిక క్షిపణులు శత్రువులను ఆశ్చర్యానికి గురిచేస్తాయని అన్నారు.

చైనాకు కోపమొస్తుందేమోనని.. అమెరికా మంత్రుల మధ్య అభిప్రాయభేదాలు..!

వాషింగ్టన్, నవంబర్ 12: ఓ కంపెనీపై చర్యలు చేపడితే చైనాకు కోపమొస్తుందేమోనన్న ఆందోళన ట్రంప్ కార్యవర్గంలోని ఇద్దరు మంత్రుల మధ్య అభిప్రాయభేదాలకు కారణమైంది. అత్యాధునిక కంప్యూటర్ చిప్స్ స్మగ్లింగ్‌పై ఓ మంత్రి చైనాకు వ్యతిరేకంగా గళం విప్పగా.. మరో మంత్రి ఆ దేశానికి కాస్త అనుకూలంగా మాట్లాడినట్లు అమెరికా మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ట్రంప్‌నకు అత్యంత ప్రీతిపాత్రులైన ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్, వాణిజ్య మంత్రి హువార్డ్ లుట్నిక్ మధ్య ఈ ఘటన చోటు చేసుకొంది.

సింగపూర్‌లోని చైనా గూఢచారి అలిస్ కనుసన్నల్లో పనిచేసే మెగాస్పీడ్ కంపెనీని జాతీయభద్రతకు ముప్పుల జాబితాలో (ఎంటిటీ లిస్ట్) చేర్చాలన్న అంశంపై గత వారం శ్వేత సౌధం సిట్యుయేషన్ రూమ్‌లో చర్చ జరిగింది. ఇందులో అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ మాట్లాడుతూ.. మెగాస్పీడ్ను ఎంటిటీ జాబితాలో ఎందుకు చేర్చలేదని అక్కడే ఉన్న వాణిజ్య మంత్రి లుట్నిక్‌ను ప్రశ్నించారు. ఆ సంస్థకు కంప్యూటర్ చిప్ల విక్రయాలను ఎందుకు నిలిపేయలేదని అడిగారు. దీనికి లుట్నిక్ స్పందిస్తూ.. వాణిజ్య శాఖ ఇక నుంచి కఠిన ఆంక్షలు విధించే అవకాశం ఉంటుందని వ్యాఖ్యానించినట్లు మీడియా పేర్కొంది. అయితే అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయం తెలుసుకొని ముందుకు వెళ్లాలని ఆయన మెలిక పెట్టినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్, వాణిజ్య ప్రతినిధి జెమిసన్ గ్రీర్, విదేశాంగ మంత్రి మార్కో రూబియో కూడా ఉన్నట్లు అమెరికా మీడియా పేర్కొంది.

ఇక లుట్నిక్ స్పందన తర్వాత ఈ వ్యవహారంపై మాట్లాడేందుకు వీరంతా ఓవల్ ఆఫీస్‌లోని ట్రంప్ వద్దకు వెళ్లగా.. ఆయన స్పేస్ఎక్స్ సీఈవో ఎలాన్ మస్కుకు కాల్ చేసి ఈ అంశంపై చర్చించారు. అయితే.. వాణిజ్య మంత్రి లుట్నిక్ మాత్రం ఈ చర్యతో మళ్లీ చైనాతో వాణిజ్య యుద్ధం మొదలవుతుందని హెచ్చరించారు. మస్క్ కూడా ఆంక్షలకు సానుకూలంగా స్పందించడంతో ట్రంప్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.



గతంలోనూ చర్యలను అడ్డుకొన్నట్లు లుట్నీ ఆరోపణలు

అమెరికా నుంచి ఎన్విడియా ఏఐ చిప్పుల్ని దొంగచాటుగా చైనాకు చేరవేస్తున్న కంపెనీలపై చర్యలు తీసుకోవాలన్న ప్రతిపాదనకు ఏడాది వ్యవధిలో ట్రంప్ మూడు సార్లు ఆమోదం తెలిపారు. చివరిసారిగా గురువారం కూడా ఈ ప్రతిపాదనకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అయితే గతంలో ట్రంప్ ఆదేశాలు అమలుకాకపోవడానికి వాణిజ్యశాఖ మంత్రి వైఖరే కారణమని తెలుస్తోంది. గతంలోనే మెగాస్పీడ్ను బ్లాక్లిస్టో చేర్చాలన్న ప్రతిపాదన రాగా.. కామర్స్ డిపార్ట్‌మెంట్ అండర్ సెక్రటరీ జెఫ్రీ కెస్లర్ దీనిని అడ్డుకొని.. ఇది మంత్రి లుట్నిక్ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

చైనాకు టెక్నాలజీ వెళ్లకుండా అడ్డుకోవడంపై అమెరికాలోని వివిధ శాఖలు కామర్స్ డిపార్ట్‌మెంట్‌తో దాదాపు పోరాటమే చేస్తున్నాయి. మరోవైపు ఇదే సమయంలో మెగా స్పీడ్ సంస్థ 4 బిలియన్ డాలర్ల విలువైన అత్యాధునిక చిప్స్‌ను కొనుగోలు చేసింది.

వాస్తవానికి వాణిజ్యశాఖ చేతిలో అత్యంత శక్తిమంతమైన ఎంటిటీ లిస్ట్ ఉంటుంది. దీనిలో చేర్చిన కంపెనీలకు అమెరికా టెక్నాలజీ అందే అవకాశమే ఉండదు. ట్రంప్ మొదటి విడత పాలన, బైడెన్ హయాంలో చాలా చైనా కంపెనీలను దీనిలో చేర్చారు. కానీ, ఇటీవల చైనాతో వాణిజ్య యుద్ధంపై తాత్కాలిక విరమణ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఏడాది నుంచి ఈ జాబితాలో ఏ కంపెనీనీ చేర్చలేదు. గత 18 ఏళ్లలో ఇలా జరగడం ఇదే తొలిసారి. చైనాపై అమెరికా వైఖరిని ఇది తెలియజేస్తోంది.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ...

ఎన్నికల బరిలో ఉద్యోగ సంఘాల నేత శ్యాంసుందర్

ఉమ్మడి ఏపీ ప్రభుత్వం నుండి ''శ్రమశక్తి'' అవార్డు విజేత

ఏ పార్టీ టికెట్ కేటాయించినా గెలుస్తా : శ్యాంసుందర్

హైదరాబాద్, నవంబర్ 12, (మనం బ్యూరో) : రాష్ట్రంలో త్వరలో జరుగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలోకి దిగేందుకు ఉన్నత విద్యావంతుడు, రాష్ట్ర ఉద్యోగ సంఘాల నేత నారపరాజు శ్యాంసుందర్ సిద్ధమవుతున్నారు. రాష్ట్రంలోని అతి పెద్దదైన ఉస్మానియా హాస్పిటల్‌లో సుదీర్ఘ కాలం ఉద్యోగం చేసి అతి పెద్ద ఉద్యోగుల సంఘంలో కీలకమైన నాయకత్వం చేసిన శ్యాంసుందర్ గత ఏడాది పదవీ విరమణ చేసిన అనంతరం పలు సామాజిక, స్వచ్ఛంద కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. న్యాయశాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేట్ పట్టా పొంది ఉద్యోగులకు న్యాయస్థానం కేసులలో ఊరట కల్పిస్తూ ఎన్నో కేసులు వేయించి ఎన్నో కేసులలో విజయం సాధించారు. టెండర్ విషయాలు, ఇతర విషయాలలో మంచి నైపుణ్యం కలిగి న్యాయస్థానాలలో విజయాలు సాధించడంలో కీలక పాత్ర పోషించారు. వీరి కృషికి ఫలితంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావించే ''శ్రమశక్తి'' అవార్డుతో సత్కరించింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఉద్యోగులు వారి బంధువులను, రిటైర్డ్ ఉద్యోగులను కలుస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం పూర్తి కాలం నిస్వార్థంగా పోరాడుతూ ధైర్యం చెప్తూ మానసిక స్థైర్యం కల్పిస్తున్నారు. ఉమ్మడి రాష్ట్రం, ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయాలను శాసించి కాంగ్రెస్ పార్టీలో ఒక వెలుగు వెలిగిన సర్దార్ చకిలం శ్రీనివాసరావుకు స్వయానా మేనల్లుడు శ్యాంసుందర్ కావడంతో చిన్నప్పటి నుంచే రాజకీయాలపై అవగాహన ఏర్పడింది. అందరి ప్రోద్బలంతో త్వరలో జరుగనున్న హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచేందుకు అన్ని రకాల రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్ మాట్లాడుతూ తనకు ఏ పార్టీ ఎమ్మెల్సీ టికెట్ కేటాయించినా ప్రత్యర్థి

పార్టీల అభ్యర్థులను చిత్తు చేసి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేస్తున్నారు. శ్యాంసుందర్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగితే ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు విజయం సాధించడం అంత తేలిక కాదనీ, శ్యాంసుందర్ సునాయాసంగా గెలుస్తాడని ఉద్యోగులు, మేధావులు, విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

హైదరాబాద్‌లో ఐవీఎఫ్ అక్రమ దందా..

తండ్రి చికిత్స కోసమని వచ్చి బాధితురాలిగా మారిన యువతి

దేశవ్యాప్తంగా పేద మహిళలను లక్ష్యంగా చేసుకున్న ముఠా

రూ.30,000 నుంచి రూ.50,000 ఆశ చూపి అండాల సేకరణ

8 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు, 43 మంది మహిళలకు విముక్తి

ఇంటికి వెళ్లలేక సంరక్షణ కేంద్రంలో బాధితుల ఆవేదన

హైదరాబాద్,నవంబర్12(మనం న్యూస్): తండ్రి ప్రాణాలు కాపాడుకునేందుకు ఆపసోపాలు పడుతున్న ఆ యువతికి డబ్బు అత్యవసరమైంది. అదే ఆమె పాలిట శాపంగా మారింది. అక్రమార్కుల చేతిలో చిక్కి, ఆరోగ్యాన్ని పణంగా పెట్టాల్సిన దుస్థితికి చేరింది. హైదరాబాద్ మహానగరం కేంద్రంగా గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న అక్రమ అండాల విక్రయ దందాలో ఇది ఒక కన్నీటి గాథ మాత్రమే. పేదరికాన్ని పెట్టుబడిగా, నిస్సహాయతను ఆసరాగా చేసుకుని వందలాది మంది యువతుల జీవితాలతో చెలగాటమాడుతున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును మల్కాజిగిరి ఎస్‌వోటీ పోలీసులు రట్టు చేశారు. ఈ దందా వెనుక విస్తుపోయే నిజాలు, హృదయవిదారక గాథలు వెలుగులోకి వచ్చాయి. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు.. హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లోని పలు ప్రాంతాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. బేగంపేట, ఎర్రగడ్డ, సరూర్‌నగర్ వంటి ప్రాంతాల్లోని హాస్టళ్లు, విల్లాలపై మెరుపుదాడులు చేసి, వివిధ రాష్ట్రాలకు చెందిన 43 మంది బాధితులకు విముక్తి కల్పించారు. ఈ రాకెట్ వెనుక కీలక సూత్రధారులుగా భావిస్తున్న 8 మందిని అరెస్టు చేశారు. రెండేళ్లుగా ఈ దందా యథేచ్ఛగా సాగుతున్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

ఢిల్లీ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లోని నిరుపేద కుటుంబాలే ఈ ముఠా లక్ష్యం. ఏజెంట్ల ద్వారా అప్పుల ఊబిలో కూరుకుపోయిన, కుటుంబ పోషణ భారమైన యువతులను గుర్తిస్తారు. రూ.30,000 నుంచి రూ.50,000 వరకు డబ్బు ఆశ చూపి, హైదరాబాద్ రు రప్పిస్తారు. ఇక్కడ వారిని రహస్యంగా ఏర్పాటు చేసిన వసతి గృహాల్లో ఉంచి, బలవంత ంగా హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చి అండాల సంఖ్య పెరిగాక, వాటిని సేకరించి నగరంలోని పలు ఐవీఎఫ్ కేంద్రాలకు అక్రమంగా విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ వ్యవహారంలో నగరానికి చెందిన 23 ఐవీఎఫ్ కేంద్రాలపై పోలీసులు నిఘా పెట్టారు.

పోలీసులు రక్షించిన బాధితుల కథలు వింటే ఎవరికైనా కన్నీళ్లు ఆగవు. కోల్‌కతాకు చెందిన 25 ఏళ్ల యువతి కథ అందరినీ కలచివేస్తోంది. 'మా నాన్నకు కిడ్నీ మార్పిడి కోసం రూ.3.5 లక్షలు అప్పు చేశాం. అప్పు ఇచ్చిన వాళ్లు ఇంటి మీదకు వస్తుండటంతో తట్టుకోలేకపోయాం. ఆ సమయంలో ఒక ఏజెంట్ పరిచయమై, రూ.50,000 ఇస్తానని, హైదరాబాద్ వస్తే చాలని చెప్పాడు. అండాలు అమ్మడం చట్టవిరుద్ధమని నాకు తెలియదు. నాన్నను బతికించుకోవడానికే ఈ నరకానికి వచ్చాను' అంటూ ఆమె కన్నీటిపర్యంతమైంది. మరో మహిళ.. భర్త ప్రమాదంలో మంచాన పడటంతో, అతడి చికిత్స ఖర్చుల కోసం ఈ దారి తొక్కింది. క్యాటరింగ్ ఉద్యోగం అని చెప్పి మరికొందరిని మోసగించి ఇక్కడికి తీసుకొచ్చారు. బాధితుల ఆధార్ కార్డులు, బ్యాంకు పాస్‌క్‌లను కూడా ఏజెంట్లు తమ ఆధీనంలో ఉంచుకుని వారిని కట్టుబానిసలుగా మార్చారు.

ప్రస్తుతం బాధితులందరినీ ఉజ్వల రెస్క్యూ హోంలో ఉంచి కౌన్సెలింగ్ ఇస్తున్నారు. అయితే, పండగ వేళ కూడా కుటుంబానికి దూరంగా ఉండాల్సి రావడం వారిని మరింత కుంగదీస్తోంది. 'దసరా ఇక్కడే గడిచిపోయింది. కనీసం ఛఠ్ పూజకైనా మమ్మల్ని మా ఇళ్లకు పంపించండి' అని వారు అధికారులను వేడుకుంటున్నారు. ఈ కేసులో కీలక సాక్షులైన ఈ బాధితులకు రక్షణ కల్పిస్తూనే, వారిని సురక్షితంగా ఇళ్లకు పంపించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కేసులో ప్రధాన సూత్రధారి అమిత్ శర్మతో పాటు మిగతా నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తే మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు.

కాలుష్య కారక సంస్థలపై పీసీబీ కొరడా

నిబంధనలు పాటించని భవన నిర్మాణ సంస్థలకు నోటీసు

ఒక ఆర్ఎంసీ ప్లాంట్ మూసివేతకు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, నవంబర్ 12, (మనం బ్యూరో) : కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టకుండా కొనసాగుతున్న నిర్మాణ ప్రాజెక్టు, ఆర్ఎంసీ ప్లాంట్లపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కఠిన చర్యలకు సన్నద్ధమైంది. ఒక నిర్మాణ ప్రాజెక్టుకు అనుబంధంగా పనిచేస్తున్న ఆర్ఎంసీ (రెడీమిక్స్ కాంక్రీట్) ప్లాంట్‌కు మూసివేత ఉత్తర్వులు జారీ చేసిన పీసీబీ ఉన్నతాధికారులు, మరో నిర్మాణ ప్రాజెక్టుకు పనుల నిలిపివేత ఉత్తర్వులు జారీ చేయాలని బుధవారం జరిగిన టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో నిర్ణయించారు... ప్రధానంగా గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో నిర్మాణ ప్రాజెక్టుల వల్ల వాయు కాలుష్యం ఏర్పడుతున్నదని స్థానికుల నుంచి ఫిర్యాదులు అందిన నేపథ్యంలో టీజీపీసీబీ రూలింగ్ టాస్కోర్స్ బృందాలు ఆయా నిర్మాణ ప్రాజెక్టులను తనిఖీ చేశాయి.

నిర్మాణ ప్రాజెక్టుల చుట్టూ కనీసం 10 మీటర్ల ఎత్తులో విండ్ బ్రేకింగ్ వాల్స్ ఏర్పాటు చేయకపోవడం వల్ల దుమ్ము, ధూళి పరిసర ప్రాంతాలకు వ్యాపిస్తున్నదని గుర్తించాయి. ప్రాజెక్టుల అంతర్గత రహదారులు, పాదచారుల మార్గాలు, ప్రధాన రహదారులపై దుమ్ము పేరుకుపోవడం వల్ల వాయు కాలుష్యం ఏర్పడటంతో పాటు పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత క్షీణిస్తున్నదని నివేదికలో పేర్కొన్నారు. నిర్మాణ ప్రాజెక్టుల వద్ద నమోదైన శబ్ద స్థాయిలు వాణిజ్య ప్రాంతాలకు నిర్దేశించిన పరిమితి (పగటిపూట 65 డెసిబెల్స్) కంటే అధికంగా ఉన్నట్లు పీసీబీ అధికారులు గుర్తించారు. నిబంధనల ప్రకారం వ్యర్థాలను తొలగించకపోవడం, వాటి నిర్వహణకు సంబంధించిన రికార్డులను ఎప్పటికప్పుడు పీసీబీకి సమర్పించకపోవడం వంటి అంశాలను అధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. తనిఖీలు నిర్వహించిన మొత్తం 18 నిర్మాణ ప్రాజెక్టుల నిబంధనల అమలు తీరును సమీక్షించిన టాస్క్ ఫోర్స్ కమిటీ.. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన ప్రాజెక్టులకు పర్యావరణ పరిహారం విధించాలని నిర్ణయించింది.

దా.. భోజనం చేద్దాం

- **నా ధాన్యం కొంటే నేనే 10 మందికి పెడతా**
- **ఆలేరు వ్యవసాయ మార్కెట్‌లో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకి రైతు కౌంటర్**

హైదరాబాద్, నవంబర్ 12, మనం ప్రతినిధి : ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు రైతుల నుంచి గురువారం నిరసన తెగ తగిలింది. ఆలేరు వ్యవసాయ మార్కెట్ యార్డులో గత ప్రభుత్వం నిర్మించిన గోదామును ప్రారంభించేందుకు వచ్చిన బీర్ల ఐలయ్యను 20 రోజులుగా వడ్లు తడుస్తూ, ఎండుతూ ఉన్నా ఎందుకు కొనుగోలు చేయడం లేదని ఓ రైతు ఎమ్మెల్యేను నిలదీశారు. దీంతో రైతును బుజ్జగించేందుకు ఎమ్మెల్యే భోజనం చేద్దామని పిలవగా, నేనే 10 మందికి అన్నం పెడతానని బీర్ల ఐలయ్యకు రైతు సమాధానమిచ్చాడు. మాకు కావాల్సింది తిండి కాదని వడ్లు కొనుగోలు చేస్తే మేమే దేశానికి తిండిపెడతామన్న రైతు మాటలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. నెటిజన్లు కాంగ్రెస్ పాలనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాడు జియో.. నేడు గ్రీన్ ఎస్ఎమ్..



- **వారి వ్యూహం కబలించడమే**
- **ప్రమాదంలో 6 లక్షల మంది తెలంగాణ డ్రైవర్ల జీవనోపాధి**
- **వియత్నం కార్స్.. గ్రీన్ ఎస్ఎమ్ క్యాబ్ సర్వీసులపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఫైర్**

హైదరాబాద్, నవంబర్ 12, మనం ప్రతినిధి: హైదరాబాద్‌లో ఇటీవల కొత్తగా ప్రారంభించిన వియత్నం కార్స్ 'గ్రీన్ ఎస్ఎమ్' ఎలక్ట్రిక్ క్యాబ్ సంస్థ తీరుపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ మేరకు గురువారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఒక కంపెనీ, తన వ్యాపార విస్తరణ కోసం స్థానిక ఆటో, క్యాబ్ డ్రైవర్ల పొట్ట కొట్టాలని చూస్తోందని ఆయన ఆరోపించారు.

అయితే, గ్రీన్ ఎస్ఎమ్ వ్యాపార వ్యూహాన్ని, గతంలో టెలికాం రంగంలో జియో ప్రవేశంతో పోల్చారు. '2016లో జియో అనే కంపెనీ.. ఫ్రీ డేటా, ఫ్రీ కాల్స్ ఆఫర్ పేరుతో ప్రజల ముందుకొచ్చిందని, అది వచ్చి రాగానే ఎయిర్‌టెల్, టాటా డొకోమో, రిలయన్స్ టెలికమ్యూనికేషన్స్ వంటి దిగ్గజ కంపెనీలన్ని కనుమరుగయ్యాయని, వొడాఫోన్, ఐడియా కలిసిపోయాయని ఆయన చెప్పారు. తన దెబ్బకు పోటీదారులంతా లేకుండా పోయాక, లక్షల మంది కస్టమర్లు రావడంతో జియో రేట్లు పెంచిన తీరును ఆయన గుర్తు చేశారు. అయితే, ఇప్పుడు గ్రీన్ ఎస్ఎమ్ అనే కంపెనీ కూడా సరిగ్గా అదే చేయబోతోంది' అని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.అయితే, ప్రస్తుతం ఈ కంపెనీ కిలోమీటరుకు రూ.8 అంటూ తక్కువ ధరలతో కస్టమర్లను ఆకర్షిస్తున్నారని ఆయన చెప్పారు. 'ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు అంత మీ ఆటోలు, క్యాబ్‌లు బంద్ చేసుకోవాలని, మీ ర్యాపిడోలు ఆపేసి మా దగ్గరకు వచ్చి జీతానికి డ్రైవర్లుగా చేరండి అని గ్రీన్ ఎస్ఎమ్ పరోక్షంగా చెబుతోంది' అని ఆయన విమర్శించారు. ఈ పరిణామాల వల్ల రాష్ట్రంలోని సుమారు 6 లక్షల మంది డ్రైవర్ల జీవనోపాధి ప్రమాదంలో పడే అవకాశం ఉందని ప్రవీణ్ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక డ్రైవర్ల ఉపాధి దెబ్బతింటుంటే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఏమీ పట్టనట్లు చోద్యం చూస్తోందని ఆయన తనదైన శైలిలో ధ్వజమెత్తారు.

ఈఎస్ఐ ఆసుపత్రుల్లో నెలకొన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలి

- **లేదంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన చేపడతాం**
- **ప్రభుత్వానికి ఈఎస్ఐ జేఏసీ హెచ్చరిక**



హైదరాబాద్, నవంబర్ 12, (మనం బ్యూరో) : రాష్ట్రంలోని ఈఎస్ఐ ఆసుపత్రులు, వైద్య విభాగాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఈఎస్ఐ జేఏసీ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించింది. ఈమేరకు గురువారం రాష్ట్ర సచివాలయంలో ఈఎస్ఐ జేఏసీ చైర్మన్ డా.చీమ శ్రీనివాస్ నేతృత్వంలో నేతలు శీనయ్య, వీరన్న గౌడ్, కల్యాణ్, రవి, మెహ్రద్, విక్టోరియా, వాసు, వెంకటేశ్, వెంకట్‌రెడ్డి ప్రిన్సిపల్ సెక్రటరీ హరిచందనకు వినతిపత్రం అందజేశారు. ఈఎస్ఐ డైరెక్టర్‌గా వెంటనే వైద్యుడిని నియమించాలనీ, ఆసుపత్రుల నిర్వహణకు సంబంధించి సొసైటీ ఏర్పాటు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న రామచంద్రాపురం, నాచారం ఈఎస్ఐ ఆసుపత్రులను కేంద్ర ప్రభుత్వం తమ ఆధీనంలోకి తీసుకునే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. అలాగే, అన్ని విభాగాల్లో పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల ప్రమోషన్లను వెంటనే చేపట్టాలనీ, కార్మికులకు నాణ్యమైన వైద్యం అందించాలని కోరారు. అర్హత, సీనియార్టీ ఆధారంగా సీనియర్ వైద్యులకు జాయింట్ డైరెక్టర్ హోదా కల్పించాలనీ, ఈఎస్ఐ ఆసుపత్రులలో పని చేస్తున్న కార్మికులు, ఉద్యోగుల సమస్యలు, వైద్య సేవల ఇబ్బందులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా ఈఎస్ఐ జేఏసి హరిచందనకు అందజేసిన వినతిపత్రంలో స్పష్టం చేసింది.

నాగర్‌కర్నూల్ ఇరిగేషన్ డీఈఈకి రూ.కోట్లలో అక్రమాస్తులు



హైదరాబాద్, నవంబర్ 12 : నాగర్ కర్నూల్ జిల్లా నీటిపారుదలశాఖ డీఈఈ సత్యనారాయణ వద్ద భారీగా ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్టు ఏసీబీ అధికారులు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన ఏసీబీ అధికారులు.. నాగర్ కర్నూల్, హైదరాబాద్ కర్మన్‌ఘాట్ సహా మొత్తం 10 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తనిఖీల్లో భారీగా భారీగా స్థిర, చరాస్తులతో పాటు బంగారం ఉన్నట్టు ఏసీబీ గుర్తించింది.

డీఈఈ ఆస్తులివే..

వనపర్తిలో 25 ఎకరాల వ్యవసాయ భూమి, ఫామ్హౌస్, సత్యనారాయణ పేరిట 9 ఓపెన్ ప్లాట్లు, రూ.కోట్ల విలువైన విల్లాలు, కర్మన్‌ఘాట్‌లో 3బీహెచ్‌కే ఫ్లాట్, నాగోల్‌లో 2బీహెచ్‌కే ఫ్లాట్లు ఉన్నాయి. అరకిలో బంగారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మూడు కార్లు, బ్యాంకు డిపాజిట్లతో పాటు ఇతర రూపాల్లో రూ.20 లక్షలు, ఎల్ఐసీ పాలసీలు కూడా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది. మొత్తంగా ప్రభుత్వ లెక్కల ప్రకారం సత్యనారాయణ ఆస్తుల విలువ రూ.5 నుంచి 6 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. అయితే బహిరంగ మార్కెట్లో మాత్రం వాటి విలువ రూ.50 కోట్లకు పైగానే ఉంటుందని ఏసీబీ భావిస్తోంది. డీఈఈని అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్చాగా.. న్యాయమూర్తి రిమాండ్ విధించినట్టు ఏసీబీ డీఎస్పీ చలపతి తెలిపారు.

అన్ని వదిలి ఆధ్యాత్మిక వైపు..

- **భగవతి దీక్షతో 25 ఏళ్లకే జైన సాధ్విగా బలమైన నిర్ణయం**
- **ఈ నెల 14, 15న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దీక్షా మహోత్సవం**
- **మరో రెండు రోజుల్లో జైన సాధ్విగా మారనున్న సంజన**
- **ఉన్నత విద్య, కోట్ల వ్యాపారం వదిలి ఎవి వద్దంటూ భిన్నమైన దారిలో పయనం**



హైదరాబాద్, నవంబర్ 12, మనం ప్రతినిధి : ఓ యువతి అత్యంత చిన్న వయసులోనే ఉన్నత చదువులు పూర్తి చేసింది. ఎంబీఏ పూర్తి చేసిన ఆమె, ఫ్యాషన్ డిజైనర్‌గా, బొటిక్ ఓనర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. బిజినెస్ రంగంలో సక్సెస్ కూడా అయ్యారు. వ్యాపార రంగంలో అడుగుపెట్టి విజయవంతమైన పారిశ్రామికవేత్తగా గుర్తింపు తెచ్చుకుంది. ఫ్యాషన్ డిజైనర్‌గా, కోట్ల రూపాయల ఆస్తులు, విలాసవంతమైన జీవితం అందుబాటులో ఉన్నప్పటికీ, తాను కోరుకున్న ప్రశాంతత లభించడం లేదని భావించి, అవేమి వద్దు?.. ఇవేవీ తనకు ఆత్మసంతృప్తిని ఇవ్వలేకపోయాయని ఆమె తనలో తానూ కుమిలిపోయింది. 12 ఏళ్ల వయసు నుంచే జైన సిద్ధాంతాలపై ఆసక్తి పెంచుకున్న సంజన.. చివరకు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని నిర్ణయించుకుంది. జైన భగవతి దీక్ష స్వీకరించి సాధ్విగా మారేందుకు రెడీ అయ్యారు. మహారాష్ట్రకు చెందిన 25 ఏళ్ల సంజనా జీ లూనావత్ హైదరాబాద్‌లో నివసిస్తోంది. ఇప్పుడు ఈ నవంబర్ 14, 15న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరగనున్న దీక్షా మహోత్సవంలో ఆమె జైన సాధ్విగా మారేందుకు సిద్ధమైంది. అయితే, మొదట ఆమె కుటుంబ సభ్యులు ఎంతగా వారించి బ్రతిమిలాడి మరి వద్దని చెప్పినప్పటికీ, ఆమె తన నిర్ణయాన్ని మార్చుకోలేదు?. వెనక్కి కూడా తగ్గలేదు? దీంతో చేసేదేం లేక తల్లిదండ్రులు సైతం చివరికి ఒప్పుకోక తప్పలేదు?. అంగీకరించారు. యుక్త వయస్సులో ఉన్న 25 ఏళ్ల సంజన అనే ఓ టీనేజ్ అమ్మాయి ఆధ్యాత్మిక జీవితాన్ని ఎంచుకొన్న అత్యంత కీలక నిర్ణయం అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తుతోంది. ఇప్పుడు ఆ యువతి తీసుకున్న నిర్ణయం పలువురు వృద్ధులు, యుక్త వయస్సు వారిని ఆధ్యాత్మిక ఆలోచనల్లోకి మళ్లించింది.

మహారాష్ట్ర జల్గావ్ జిల్లా భడ్గావ్‌కు చెందిన సంజనా జీ లూనావత్.. చిన్నప్పటి నుంచే జైన కుటుంబ వాతావరణంలో పెరిగింది. ఆమె తండ్రి కవర్‌లాల్ ఆటోమొబైల్ వ్యాపారంలో ఉండగా.. సోదరుడు శుభం కూడా సొంత వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారు. ముంబైలో ఎంబీఏ అయ్యాక ఫ్యాషన్ డిజైనింగ్‌తో వ్యాపారాన్ని విజయవంతంగా నడుపుతూ ఆర్థికంగా స్థిరపడింది. అయితే.. సంజన ఆలోచనలు తనకు 12 ఏళ్ల వయసు నుంచే జైన తత్వశాస్త్రం, మత బోధనలపై ఆసక్తి ఏర్పడిందని సంజనా వెల్లడించింది. ఏళ్లు గడిచేకొద్దీ ఆ ఆసక్తి కాస్తా మరింత పెరిగి చివరికి సాధ్వి జీవితాన్ని స్వీకరించాలనే బలమైన నిర్ణయాన్ని తీసుకునేందుకు దారితీసిందని ఆమె తెలిపింది.

ఏఐ టెక్నాలజీ పేరుతో పరుగిడుతున్న కాలం ఇది..నేటి బీజీ లైఫ్‌లో ప్రతి ఒక్కరూ సాధారణంగా చదువు పూర్తయ్యాక, మంచి ఉద్యోగం, బిజినెస్, ఆర్థికంగా పటిష్ఠంగా మారడం, లగ్జరీ లైఫ్ కోసం చాలామంది యువత ప్రయత్నాలు చేస్తుంటారు. కానీ, సంజనా మాత్రం అందరి కంటే భిన్నమైన మార్గాన్ని ఎంచుకుంది. కోట్ల రూపాయల ఆస్తులు, ఆధునిక సౌకర్యాలున్నప్పటికీ తాను కోరుకునే మానసిక ప్రశాంతత, ఆనందం వాటిలో లభించడం లేదని ఆమె గుర్తించింది. భౌతిక సుఖాల కంటే జైన ధర్మానికి అంకితమైన జీవితంలోనే నిజమైన శాంతి లభిస్తుందని తాను పూర్తిగా నమ్ముతున్నట్లు సంజన ఈ సందర్భంగా తెలిపింది. ఈ క్రమంలో జైన సంప్రదాయంలోని భగవతి దీక్ష స్వీకరించి సాధ్విగా మారాలనే బలమైన నిర్ణయాన్ని తీసుకున్నట్లు ఆమె వెల్లడించింది.

పేదల కోసమా? పెద్దల కోసమా?

- **అప్పుడు రైతుల నుంచి తక్కువ ధరకే భూములు**
- **ఇప్పుడెమో రియల్టర్లకు వేలం**
- **తెలంగాణ హౌసింగ్ బోర్డుపై విమర్శలు**



హైదరాబాద్, నవంబర్ 12, మనం ప్రతినిధి : తెలంగాణ హౌసింగ్ బోర్డు భూముల విక్రయాలపై వివాదం ముదురుతోంది. ఒకప్పుడు పేద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో అప్పటి సర్కార్ సూచన మేరకు రైతుల నుంచి తక్కువ ధరలకు భూములు సేకరించిన బోర్డు.. ఇప్పుడు మిగిలిన ఖాళీ స్థలాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులకు కట్టబెట్టేందుకే వేలం వేస్తోందన్న తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అయితే, గత వేలాల్లో ప్లాట్లు దక్కించుకున్నవారికి రిజిస్ట్రేషన్లు పూర్తికాలేదన్న ఆరోపణలు ఉన్నాయి. లే అవుట్ ఆమోదం, రహదారుల వెడల్పుపైనా సందిగ్ధత నెలకొంది.

మరోవైపు 3వ ఫేజ్‌లోని 2,696 చదరపు గజాల స్థలం వేలాన్ని కోర్టు రెండు వారాల పాటు నిలిపివేయడంతో స్థానికులకు తాత్కాలిక ఊరట లభించింది. గత ఏడాది కాలంలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు 7వ ఫేజ్‌లో పలు ఖాళీ ప్లాట్లను రెండు విడతల్లో వేలం వేశారు. జూన్ 11న నిర్వహించిన వేలంలో ఓ ప్లాట్ చదరపు గజం రూ.2.88 లక్షల ధర పలికింది. నో ప్రాఫిట్.. నో లాస్ విధానంతో భూములు సేకరించి, ప్లాట్లు కేటాయించడంతో పాటు ఇళ్లు నిర్మించి ఇచ్చిన సంస్థ.. ప్రస్తుతం ఆదాయం కోసం మిగిలిన స్థలాలను విక్రయించడంతో వేలంలో ప్లాట్లు దక్కించుకున్నవారు బిడ్ మొత్తంలో 25 శాతం చెల్లించినప్పటికీ ఇప్పటివరకు రిజిస్ట్రేషన్లు పూర్తికాలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కోట్ల రూపాయలు చెల్లించిన కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ల కోసం హౌసింగ్ బోర్డు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని అవేదన వ్యక్తం చేయగా.., పలువురు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ముఖ్యంగా ప్రజా అవసరాల కోసం కేటాయించిన స్థలాలను సైతం అమ్మేందుకు ప్రయత్నించడంపై స్థానికుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి.

వాణిజ్య అవసరాల కోసం విక్రయించే ప్లాట్లకు రిజిస్ట్రేషన్, భవన నిర్మాణ అనుమతులు పొందాలంటే ఆమోదిత లేఅవుట్ అవసరమనే నిబంధనలపై బోర్డు ముందుగానే స్పష్టత తీసుకుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తాజాగా వేలానికి ఉంచిన ప్లాట్ల విషయంలోనూ ఆమోదిత లేఅవుట్ లేదనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లో విక్రయానికి సిద్ధం చేసిన ఎల్ఐజీ, ఎంఐజీ ఓపెన్ ప్లాట్ల విషయంలోనూ కొనుగోలుదారులకు స్పష్టత కొరవడింది. గతంలో ఓ నోటిఫికేషన్లో 80 అడుగుల రహదారిని ప్రస్తావించిన బోర్డు.. ఏడాది తర్వాత మరో వేలం నోటిఫికేషన్‌లో 100 అడుగుల రహదారి గురించి పేర్కొన్నట్లు సమాచారం. రహదారుల వెడల్పు, లేఅవుట్ ఆమోదం, భవన నిర్మాణ అనుమతుల విషయంలో స్పష్టమైన వివరాలు ఇవ్వాలని కొనుగోలుదారులు కోరుతున్నారు. హెచ్ఎండీఏ ఆమోదిత లే అవుట్ ఉందా? ఏమైనా సవరణలు చేశారా? అన్న అంశాలపై అధికారుల నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదని వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్లాట్లు కొనుగోలు చేసినా నిర్మాణ అనుమతుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందేమోనన్న ఆందోళన వారిలో నెలకొంది. అయితే,

కేపీహెచ్‌బీ 3వ ఫేజ్‌లో 2696 చదరపు గజాల ఖాళీ స్థలాన్ని వేలం వేయాలన్న ప్రతిపాదన మొదటి నుంచీ వివాదాస్పదంగా మారింది. భువన విజయ్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో పాటు కేపీహెచ్‌బీ 3, 5, 6 ఫేజ్‌ల నివాస సంఘాల ప్రతినిధులు కూడా ఆ స్థలాన్ని ప్రజా అవసరాలకే వినియోగించాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో వివాదాస్పద స్థలం వేలాన్ని రెండు వారాల పాటు నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది. మరోవైపు ఈ స్థలాన్ని మినహాయించి మిగిలిన ఎల్ఐజీ, ఎంఐజీ ప్లాట్‌ల వేలం యథావిధిగా నిర్వహిస్తామని హౌసింగ్ బోర్డు పశ్చిమ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిరణ్ బాబు తెలిపారు.

నీ పేరు రైతు..నీ పైరు కవాతు..!

మహమ్మారి గళానికి అమరిన అరదండమై
ఉరి తాడును హత్తుకునే మొండెమై
కాలం కొయ్యకు వేళ్లాడుతూ
చిరుగుతున్న వస్త్రమై మిన్నంటి
రెప రెప లాడుతున్న వ్యవసాయ కార్మికులారా...
కళ్లనీ ఒళ్లుని భగ భగ మండించే
పంటనై మంటనై మండిన నేను
ఆరుగాలం స్వేదాన్ని ముద్దాడినా..
ఆర్చి పేర్చిన పంటకు గిట్టుబాటు లేక బ్రతుకుల్ని
కాటేసిన దృశ్యం మనసును పంటకు కంచెగా కట్టి
దిష్టిబొమ్మలా వేళ్లాడే దేహం
మీ దుస్థితి కావచ్చు చక్రమోలే గిర గిరా తిరిగినా
సమస్యల గాయాల బోనులో చిక్కి
వున్న దగ్గరే కూలబడి ఏడ్వటం
మీ స్థితి కావచ్చు ఉరితాడుకు వేళ్లాడే
తల నీదే కావచ్చు.... కానీ
ఏపుగా పెంచి సున్నితంగా తుంచి
ఎండబెట్టి గల గలా గంపకెత్తి
బస్తాల్లో బానెడు ఆశల్తో కుక్కి
మార్కెట్ యార్డుల్లో కెల్తే
తల వేళ్లాడదీసిన పంట ధర
నీ భరోసాను ముక్కలు చేసింది
ఎండిన ఎర్రని డొల్లను తుంపితే
రాలిపడ్డ మిరప గింజల్లెక్క
నీ మొఖం చిన్న బోయింది
నెత్తిన సూరీడు సూదిమొనతో గుచ్చినట్టు
సురుక్కు సురుక్కున పొడుస్తున్నా
నీ మదిలో తొలుస్తున్న దొక్కటే
పంటంతా నీ చెమట తూకానికైనా అమ్మాలి
చిల్లుపడ్డ కుండలో నీళ్లాగ నట్లే
మీ బతుకెప్పుడూ నీరుగారుతూనే వుంది
విపణి శక్తులూ ప్రకృతి విపత్తులూ
మాయదారి కలుపు చట్టాలు
తల తాకట్టు పెట్టుకోమ్మన్నై
అన్నీ మిమ్మల్ని అమ్ముడు పొమ్మన్నై
అన్నీ మిమ్మల్ని అవమానించినై
పంటను మీ గుండే మంటనూ
నిలువునా తగల బెట్టుకొమ్మన్నై
వ్యవసాయానికి వెన్నుముకవై
అన్న పూర్ణదేశంలో రాజువై రారాజువై
అక్షర పుటల్లో వర్ధిల్లిన నువ్వు
ఇప్పుడు చేతుల్ని నెత్తిమీద
చరుచుకుంటూ ఏకరువు పెడుతుంటివి
మిరప పండ్లను కస పిస
రోట్లో నూరిన కారం లెక్క
నిఖార్సుగా భగ భగ మండుతుంటివి
ఏ పాపం చేయకున్నా..
మీ బతుకులు బజారున పడుతున్నాయ్
ఎంత చెమట చిమ్మినా మీ దోసిళ్లు
పంట మూల్యాన్ని ఎత్తుకోక పడావుబడ్డయ్
కమ్ముకొచ్చిన కసాయి రక్కసిపై
ఉద్యమ మందును పూట పూటకూ
పిచికారీ చేస్తున్నా
బ్రతుకు పంట ఎందుకు
పచ్చగా పండదో వేచి చూస్తుంత్రి
ఇప్పటివరకూ
బలిపీఠంపై మోకరిల్లిన తల మీదే కావచ్చు
కానీ...ఇప్పుడిక సమస్యలను
ఉరితీసే తలారీ నీవే..!
నీ పేరు రైతు..నీ పైరు కవాతు..!

- డా.కటుకోఝ్వల రమేష్
9949083327

తెలంగాణ విప్లవ తేజం కాళోజీ



'ఏ భాష నీది ఏమి వేషమురా,
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా,
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకు రా,
తెలుగు వాడివై తెలుగు రాదనుచు,
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా,
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు,
సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా'!

...పర భాషలపై మోజుతో మాతృ భాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరనేది వాస్తవం. అందుకే ఆయన జయంతి 'తెలంగాణ భాషా దినోత్సవం' అయింది. ఎక్కడో మరాఠాల కుటుంబంలో పుట్టి, వరంగల్‌కు వచ్చి స్థిరపడి 'నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు' అని ఎలుగెత్తిన పోరాట యోధుడు. భయం అనేది ఎరుగని కలం వీరుడు కాళోజీ. ఆయన తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచాడు. ఎన్నో సార్లు నిజాం ప్రభుత్వం కాళోజీని వరంగల్లు నుంచి బహిష్కరించింది.

'నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తు వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో ఉన్న స్టేటుమెంట్లే. అలాంటి కలం వీరుడిని జ్ఞాపకం చేసుకుని నివాళులు అర్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914-నవంబరు13,2002)'కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న' గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసినా, హక్కులడిగినా, ఉద్యమం నడిపినా, ప్రజా వాణికి ప్రతిధ్వనిగా నిలిచాయన. మొత్తంగా తెలంగాణ జీవిత చలనశీలి కాళోజీ.

ఆజన్మాంతం తెలంగాణ ప్రజల అన్యాయాల గురించే తపించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజీ. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమ కారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మవిభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. వరంగల్‌లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరుతో గౌరవించారు.

'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి...అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ఆయన 1914, సెప్టెంబరు 9 న (కర్ణాటక) రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమాబాయమ్మ, కన్నడిగుల ఆడ పడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయితగా ప్రఖ్యాతి గాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మోహ మాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తి గడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపు కడతాయి. నిజాం దమననీతికి, నిరంకు శత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం, గళం ఎత్తిన ఈ శతాబ్దపు మేటి కవి కాళన్న.

బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్ న్యాయ పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండలోని కాలేజియేట్ ఉన్నత పాఠశాలలోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తి చేశాడు. 1939 లో హైదరాబాదు లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25 సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయరానిది. 1940లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణా రావు, పి.వి.నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షర జ్యోతిని వ్యాపింప జేయా లన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రము ఖుల్లో కాళోజీ ఒకడు.

రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహా సభలను దిగ్విజయంగా నిర్వహిం చడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసు కుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వవిద్యాల యంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై, 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన 'ఆంధ్ర సారస్వత పరిషత్' వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడమీలో సభ్యుడు. ఆయన తెలంగాణ రచయితల సంఘం అధ్యకునిగా, 1957-61 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యునిగా ఉన్నారు. 1977లో సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పై పోటీ చేశాడు. కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ 'సామాన్యుడే నా దేవుడు' అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు.

ఆయన మరణానంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంద జేసారు. 1972 లో తామ్రపత్ర పురస్కారం.. 1968లో 'జీవన గీత' రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారం.. బూర్గుల రామకృష్ణా రావు మెమోరియల్ మొదటి పురస్కారం.. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే 1981లో సత్కారం.. 'ప్రజాకవి' బిరుదు.. ఆంధ్రప్రదేశ్ లో అనేక సాహితీ సంఘాలచే సన్మానాలు.. రామినేని ఫౌండేషన్ అవార్డు.. గాడిచర్ల ఫౌండేషన్ అవార్డు.. కాకతీయ విశ్వ విద్యాలయంవరంగల్ వారు 1992 లో డాక్టరేట్.. 1996లో సహృదయ సాహితీ విశాఖ వారి గురజాడ అవార్డు.. 1996లో కళాసాగర్ మద్రాస్ వారి విశిష్ట పురస్కారం పొందారు. ఆయన మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులో అనువదించాడు. 1943 లోనే ఆయన కథల్ని 'కాళోజీ కథలు' పేరుతో అప్పట్లో హైదరాబాదులో ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీకి చెందిన అణా గ్రంథమాల సంస్థ తన పద్నాలుగో ప్రచురణగా ప్రచురించింది.

ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది. పాములపర్తి నరసింహారావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు. విశాలాంధ్ర సమస్యలు గమనించి ఆయన 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు.

అన్ని సందర్భాలలో అసలుసిసలైన తెలంగాణ వాదిగా జీవించాడు. పర భాషా జ్ఞానాన్ని సంపాదించు కోవడం అవ సరమే. కానీ, ఆ సాకుతో అమ్మ లాంటి మన భాషను నిర్లక్ష్యం చేయడం ఎంత తప్పు. నేటి తరం తెలుగు పదాలనే మర్చి పోతోంది. ఈ పరిస్థితి పోవాలి. మన తేట తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి అని పరితపించాడు. తెలంగాణ పలుకు బడితో ప్రజల మాట, వ్యథలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శ ప్రాయం.

నవంబర్ 13... కాళోజీ వర్ధంతి

- రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



నేను వచ్చేదాకా బయటే నిరీక్షిస్తాయి

హై లెవల్ కాదు కానీ,
నా లేవల్ కు సరిపోయాయి
షోకులు, టీక్ టాక్ లు ఏమీ లేవు
నాకు బాగానే నచ్చాయి
నేను ఎటు వెళ్లినా నాతోనే వస్తాయి
బంధువుల ఇంటికి వెళ్లి నపుడు
నేను వచ్చేదాకా బయటే
నిరీక్షిస్తాయి
కూర్చున్నప్పుడు హత్తుక్కొనే
వుంటాయి వర్షానికి విసుక్కోలేదు
ఎండకు జడసుకోలేదు
చలికి ముడుచుకోలేదు
ప్రయాణం ఎక్కడైనా తోడు
వదల్లేదు
దూరమైనా మైళ్లు చూడలేదు
నిలుచుంటే అలిసి పోలేదు
పరుగెడితే ఆపలేదు
అనుబంధాన్ని అర్థం
చేసుకున్నాయి
నాకు చాలా ఇష్టమైనవి
బాటా కాకపోయినా, బ్రాండెడ్
లాగేవున్నాయి
పెళ్లి సందడిలో, ఎవరెత్తుక
పోయారో మంచి చెప్పులు
పోయాయి

- ఆశారాజు
9392302245

నషా ముక్త భారత్ కోసం నడుద్దాం

మాదకద్రవ్యాల మహమ్మారి ఒక సమాజపు పునాదులనే పెకిలించివేస్తుంది. ముఖ్యంగా దేశానికి వెన్నెముక వంటి యువతను నిర్వీర్యం చేసి, కుటుంబాలను ఛిన్నాభిన్నం చేస్తుంది. నేరాల పెరుగుదల, ఆర్థిక నష్టం, అంతర్గత భద్రతా ముప్పులకు డ్రగ్స్ ప్రధాన కారణంగా మారుతున్నాయి. ఈ నేపథ్యంలో భారతదేశాన్ని పూర్తి స్థాయిలో డ్రగ్స్ రహిత దేశంగా మార్చడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, న్యాయవ్యవస్థ, పౌర సమాజం సమన్వయంతో బహుముఖ వ్యూహాన్ని అమలు చేయాలి. ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద అక్రమ నల్లమందు ఉత్పత్తి ప్రాంతాలైన గోల్డెన్ క్రెసెంట్ (ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్), గోల్డెన్ ట్రయాంగిల్ (మయన్మార్, థాయిలాండ్, లావోస్) మధ్య మన దేశం ఉంది. ఈ భౌగోళిక స్థితి వల్ల సరిహద్దుల గుండా హెరాయిన్, సింథటిక్ డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా నిరంతరం జరుగుతుంటుంది.

ఇటీవల కాలంలో సముద్ర మార్గాలు, డార్క్ వెబ్, కొరియర్ సర్వీసులు మరియు క్రిప్టోకరెన్సీల ద్వారా సైబర్ ఆధారిత డ్రగ్స్ విక్రయాలు కొత్త సవాలుగా మారాయి. డ్రగ్స్ నిర్మూలనకు భారతదేశం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అనుసరిస్తూ సంస్థాగత, చట్టపరమైన మరియు సామాజిక స్థాయిల్లో చర్యలు చేపట్టింది. నషా ముక్త్ భారత్ అభియాన్ ను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా డ్రగ్స్ తీవ్రత ఎక్కువగా ఉన్న జిల్లాల్లో విస్తృతంగా అమలవుతోంది. విద్యాసంస్థలు, యువజన సంఘాలు, మహిళా గ్రూపులను కలుపుకొని ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం, కౌన్సెలింగ్ కేంద్రాలు నడపడం దీని ప్రధాన ఉద్దేశం. నార్కో కోఆర్డినేషన్ సెంటర్ డ్రగ్స్ అక్రమ రవాణాను అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర స్థాయి నిఘా మరియు భద్రతా సంస్థల మధ్య సమన్వయం సాధించడానికి నాలుగు అంచెల విధానంలో పనిచేస్తోంది. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో, రాష్ట్రాల ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌లు (ఉదాహరణకు తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో/ఈగల్ టీమ్), బీఎస్ఎఫ్, తీరప్రాంత రక్షక దళం సంయుక్తంగా తనిఖీలు చేపడుతున్నాయి.



సాంకేతిక ఆధారిత నిఘా వ్యవస్థలు కూడా డ్రగ్స్ నిర్మూలనలో ప్రధాన పాత్రను పోషిస్తున్నాయి. నిధాన్,మానస్ వంటి నిఘా వ్యవస్థల పనితీరు మెరుగని చెప్పుకోవచ్చు. నిధాన్ అనేది దేశవ్యాప్తంగా డ్రగ్స్ నేరస్థుల వివరాలు, వారి రికార్డులను భద్రపరిచే ఒక కేంద్రీకృత డేటాబేస్. ఇది నేరగాళ్ల కదలికలను ట్రాక్ చేయడంలో సహాయపడుతుంది. 1985 నాటి నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోపిక్ సబ్స్టెన్సెస్ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు.డ్రగ్స్ ద్వారా సంపాదించిన అక్రమ ఆస్తులను మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద సీజ్ చేయడం ద్వారా మాఫియా ఆర్థిక మూలాలను దెబ్బతీస్తున్నారు.జువెనైల్ జస్టిస్ చట్టం ప్రకారం మైనర్లకు డ్రగ్స్ ఇవ్వడంపై శిక్షలు కఠినతరంగా ఉన్నాయి. ఎవరైనా మైనర్లకు/పిల్లలకు మద్యం లేదా మత్తు పదార్థాలు విక్రయించినా, బలవంతంగా ఇచ్చినా లేదా పిల్లలను డ్రగ్స్ రవాణాకు ఉపయోగించుకున్నా సెక్షన్ 77 78 ప్రకారం 7 సంవత్సరాల వరకు కఠిన జైలు శిక్ష మరియు 1 లక్ష వరకు జరిమానా విధిస్తారు.

రసాయనాల ఆధారంగా స్థానికంగానే రహస్యంగా తయారుచేసే ఎండీఎంఏ(ఖుఖు), మెథాంఫెటమిన్ వంటి సింథటిక్ డ్రగ్స్ గుర్తింపు కష్టంగా మారుతోంది. ఆన్లైన్ ద్వారా ఆర్డర్లు ఇవ్వడం, రవాణా సంస్థల ద్వారా పార్సిల్స్ పంపడం వల్ల మూలాలను పట్టుకోవడం కష్టసాధ్యమవుతోంది. వ్యసనపరులను సమాజం చులకనగా చూడడం వల్ల చాలామంది కుటుంబాలు విషయాన్ని దాచిపెడుతున్నాయి, ఫలితంగా వారు సరైన సమయంలో వైద్యచికిత్స పొందలేకపోతున్నారు.

పంజాబ్, జమ్మూ-కశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల సరిహద్దుల్లో డ్రోన్ల ద్వారా జరిగే డ్రగ్స్ రవాణాను ఆపడానికి అధునాతన యాంటీ-డ్రోన్ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. పాఠ్యాంశాల్లో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన సదస్సులు నిర్వహించాలి. విద్యాసంస్థల్లో నిరంతర కౌన్సెలింగ్ సెల్స్ ఏర్పాటు చేయడం అవసరం.

తల్లిదండ్రులు పిల్లలతో ప్రతిరోజూ నాణ్యమైన సమయం గడపడం, వారి ఆలోచనలు మరియు స్నేహితుల గురించిన అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యం. చదువులో వెనుకబడటం, ఒంటరిగా గడపడం, అకస్మాత్తుగా కోపం రావడం, డబ్బులు ఎక్కువగా ఖర్చు చేయడం వంటి ప్రవర్తనా మార్పులను తల్లిదండ్రులు గమనించి వెంటనే సహాయం అందించాలి.కుటుంబంలో సఖ్యత, నైతిక విలువలు మరియు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చాలి.

క్రీడలు, సృజనాత్మక రంగాల వైపు యువతను ప్రోత్సహించడం ద్వారా వారిని వ్యసనాలకు దూరంగా ఉంచవచ్చు.డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదు,ఇది ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత. నషా ముక్త భారత్ అభియాన్ వంటి ప్రభుత్వ కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లి యువత, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాల ద్వారా వీధి నాటకాలు, సదస్సులు నిర్వహించాలి.

యువత తమ శక్తిని సానుకూల మార్గంలో మళ్లించేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆటస్థలాలు, వ్యాయామశాలలు మరియు లైబ్రరీలను ప్రోత్సహించాలి. సోషల్ మీడియా, షార్ట్ ఫిలిమ్స్ మరియు ప్రముఖుల ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలపై విస్తృత ప్రచారం కల్పించాలి. చట్టపరమైన కఠినచర్యలు,నిరంతర అవగాహన మరియు సమగ్ర పునరావాస ప్రయత్నాలు ఏకకాలంలో సాగినప్పుడే ఆరోగ్యకరమైన, బలమైన నవభారతాన్ని సాకారం చేసుకోవడం సాధ్యమవుతుంది.

-సాకి
9949394688

ధరల స్థిరత్వంతో రైతులకు అండ

రైతులకు ధరలపై భరోసా కల్పించ డంతోపాటు వ్యవసాయ ప్రణాళికలు, పెట్టుబడు లపై అవగాహనతో నిర్ణయాలు తీసుకునేందుకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ముఖ్యమైన సాధనంగా పనిచేస్తుంది. 2027-28 రబీ మార్కెటింగ్ సీజన్కు (ఆర్ఎంఎస్) నిర్దేశిత రబీ పంటలన్నింటికీ కనీస మద్దతు ధరల పెంపును ప్రభుత్వం 2026 సెప్టెంబర్ 30న ఆమోదిం చింది. ఈ సీజన్లో 324 లక్షల మెట్రిక్ టన్నుల పంట ఉత్పత్తులకుగాను రైతులకు సుమారు ₹90,962 కోట్లు చెల్లిస్తారని అంచనా. ఆరు రబీ పంటల కొనుగోళ్లు 2004-05 నుంచి 2013-14 మధ్య కాలంలో 2,302 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 2014-15 నుంచి 2025-26 మధ్య కాలంలో 3,921 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగాయి. అదే విధంగా కనీస మద్దతు ధర చెల్లింపుల్లు 2.65 లక్షల కోట్ల నుంచ్చి 8.36 లక్షల కోట్లకు పెరిగాయి. మరోవైపు, కొనుగోళ్లు, చెల్లిం పుల ప్రక్రియలను రైతులకు మరింత అందుబాటులోకి తీసుకురావడంతోపాటు పారదర్శకతను పెంచేందుకు డిజిటల్ వేదికలు తోడ్పడుతున్నాయి. ధర భరోసా, విస్తరించిన కొనుగోళ్లు, సాంకేతికత ఆధారిత సేవలు కలిసి రైతులకు మార్కెట్లను చేరువ చేస్తున్నాయి. వ్యవ సాయ నిర్ణయాల్లో మరింత విశ్వాసాన్ని కల్పిస్తున్నాయి.



రైతుకు వచ్చే ఆర్థిక రాబడిని వ్యవసాయ ఉత్పత్తి మాత్రమే కాకుండా పండించిన పంటకు లభించే ధర కూడా నిర్ణయిస్తుంది. ముందుగా నిర్ణయించిన ధరలకు అర్హత కలిగిన వ్యవసాయ ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసే ధర భరోసా వ్యవస్థను ఇది అందిస్తుంది. వ్యవసాయ పెట్టుబడులు, ఉత్పత్తిని ప్రోత్సహిస్తూ రైతులకు గిట్టుబాటు రాబడిని కల్పిస్తుంది. ధర విషయంలో కొంత భరోసా అందించడం ద్వారా ప్రతికూల మార్కెట్ హెచ్చుతగ్గుల ప్రభావాన్ని తగ్గించుకునేం దుకు కనీస మద్దతు ధర రైతులకు సహాయ పడుతుంది. మార్కెట్ ధరలు తక్కువగా ఉన్న పుడు అర్హత కలిగిన పంట ఉత్పత్తులను ప్రకటించిన ధరకు విక్రయించేందుకు ఎంఎస్పీ కొనుగోళ్లు అవకాశం కల్పిస్తాయి. ధరల అనిశ్చితిని తగ్గించడం, వ్యవసాయ ఆదాయ స్థిర త్వానికి తోడ్పడటం, తదుపరి వ్యవసాయ సీజన్లకు ప్రణాళికలు రూపొందించుకోవడాన్ని సులభతరం చేయడం ఈ వ్యవస్థ ప్రయోజనాలు. ఆశించే రాబడిపై విశ్వాసాన్ని పెంచడం ద్వారా మెరుగైన విత్తనాలు, వ్యవసాయ సాంకేతికత, ఉత్పాదకతను పెంచే ఇతర ఉత్పాదకాలపై పెట్టుబడులకు సంబంధించిన రైతుల నిర్ణయాలకు కూడా ఎంఎస్పీ తోడ్పడుతుంది.

నిర్దేశిత 22 వ్యవసాయ పంటలకు ప్రభుత్వం ఏటా కనీస మద్దతు ధరలను ప్రకటిస్తుంది. వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ (సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా ఈ ధరలను నిర్ణయిస్తారు. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాల అభిప్రాయాలను ఈ సిఫా ర్సుల్లో పరిగణనలోకి తీసుకుంటారు. అదనంగా తోరియా కనీస మద్దతు ధరను రేప్సీడ్, ఆవాలకు ప్రకటించిన ధర ఆధారంగా, పీచు తొలగించిన కొబ్బరికాయల కనీస మద్దతు ధరను ఎండు కొబ్బరికి ప్రకటించిన ధర ఆధారంగా నిర్ణయిస్తారు.

కనీస మద్దతు ధర ప్రయోజనాలు రైతులకు మరింత నేరుగా, పారదర్శకంగా, సులభంగా అందేలా కొనుగోలు ప్రక్రియ అభివృద్ధి చెందింది. ధాన్యాలు, ముతక ధాన్యాలను ప్రభుత్వం ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్సీఐ), నియమిత రాష్ట్ర సంస్థల ద్వారా కొనుగోలు చేస్తుంది. ప్రకటించిన కనీస మద్దతు ధర వద్ద రైతులకు ఇది ధరల మద్దతు అందిస్తుంది. పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఎండు కొబ్బరిని ప్రధానమంత్రి అన్నదాత ఆయ్ సంరక్షణ్ అభియాన్ (పీఎం-ఆశా)లోని ప్రైస్ సపోర్ట్ స్కీమ్ (పీఎస్ఎస్) కింద కొనుగోలు చేస్తారు. ఈ పథకం కింద కొనుగోళ్లు చేపట్టే ప్రధాన సంస్థలు నేషనల్ అగ్రికల్చరల్ కోఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (నాఫెడ్), నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్సీసీఎఫ్). దేశీయ పప్పు ధాన్యాల ఉత్పత్తిని ప్రోత్సహించి, స్వావలంబనను బలోపేతం చేసేందుకు మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్ కింద 2030-31 వరకు ముందుగా నమోదు చేసుకున్న రైతుల నుంచి కేంద్ర నోడల్ సంస్థల ద్వారా కందులు, మినుములు, మసూర్ను కొనుగోలు చేస్తారు. కొనుగోలు సదుపాయాలు రైతులకు మరింత అందుబాటులో ఉండేలా తగిన సంఖ్యలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. రాష్ట్ర ప్రభుత్వాలు, కొనుగోలు సంస్థలు కొనుగోలు షెడ్యూళ్లు, కేంద్రాల చిరునామాలు, అర్హత కలిగిన పంట ఉత్పత్తులకు వర్తించే ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ (ఎఫ్ఏక్యూ) ప్రమాణాల వివరాలను ప్రచారం చేస్తాయి.

ఏళ్లుగా పంటల కొనుగోలు పరిమాణాలు, రైతులకు చెల్లింపులు గణనీయంగా పెరగడం వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లకు మద్దతుగా ఎంఎస్పీ పోషిస్తున్న పాత్రను తెలియజేస్తోంది. 2014-15 నుంచి 2025-26 మధ్య కాలంలో మొత్తం గోధుమ కొనుగోళ్లు 3,715 లక్షల మెట్రిక్ టన్నులకు చేరాయి. 2004-05 నుంచి 2013-14 మధ్య కాలంలో ఇవి 2,254 లక్షల మెట్రిక్ టన్నులుగా ఉన్నాయి. అదే విధంగా ఆయా కాల వ్యవధుల్లో ఆరు రబీ పంటల మొత్తం కొనుగోళ్లు 2,302 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 3,921 లక్షల మెట్రిక్ టన్నులకు పెరిగాయి.

రైతులకు అండ, వ్యవసాయానికి బలం : మార్కెట్ ధరల హెచ్చుతగ్గుల నుంచి రైతులకు అండగా నిలవడం, వ్యవసాయ ప్రణాళికలు, పెట్టుబడుల్లో మరింత భరోసా కల్పించడంలో కనీస మద్దతు ధర ముఖ్యమైన సాధనంగా కొనసాగుతోంది. 2027-28 రబీ మార్కెటింగ్ సీజన్‌కు తీసుకున్న ఎంఎస్పీ నిర్ణయాలు ఉత్పత్తి వ్యయంపై కనీసం 50 శాతం అదనపు రాబడిని కొనసాగిస్తున్నాయి. కొనుగోలు పరిమాణాలు, కనీస మద్దతు ధర చెల్లింపుల్లో నిరంతర పెరుగుదల రైతులకు ప్రభుత్వ మద్దతు విస్తరిస్తున్న తీరును ప్రతిబింబిస్తోంది. మరోవైపు, డిజిటల్ నమోదు, బయోమెట్రిక్ ధ్రువీకరణ, నేరుగా బ్యాంకు ఖాతాలకు చెల్లింపులు కొనుగోలు ప్రక్రియల అందుబాటును, పారదర్శకతను బలోపేతం చేస్తున్నాయి. మొత్తంగా ఈ చర్యలు ధర భరోసా, మార్కెట్ అందుబాటు, గిట్టుబాటు రాబడి మధ్య సంబంధాన్ని బలపరుస్తున్నాయి.

- ఇస్కా రాజేష్ బాబు
93973 99298

హుస్నాబాద్‌లో అభివృద్ధి జోరు

- మొదటి విడత 180 కోట్లతో సుందరగిరి హుస్నాబాద్ వన్ వే రోడ్డు ప్రారంభం





చిగురుమామిడి, నవంబర్ 12 (మనం న్యూస్): హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. ఫోర్ వే రోడ్డులో భాగంగా సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు వన్ వే రోడ్డును గురువారం కాంగ్రెస్ నాయకులు పచ్చ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు.

హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి మాట్లాడుతూ...

హుస్నాబాద్ ప్రజల చిరకాల కోరిక అయిన ఫోర్ వే రోడ్డు కల నెరవేరబోతోంది. మన బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ గౌడ్ కృషితో, వారి చొరవతో ఫోర్ వే రోడ్డులో భాగంగా మొదటి విడతగా 180 కోట్ల రూపాయలను కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయడం జరిగింది. మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ ఈ నిధులు పట్టుకొచ్చినందుకు వారికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఈ మొదటి విడత 180 కోట్లతో సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు వన్ వే రోడ్డును ఈరోజు పూర్తి చేసి ప్రారంభించారు. ఇది ఆరంభం మాత్రమే, మంత్రి సహకారంతో త్వరలోనే మిగతా నిధులు కూడా విడుదల చేసి పూర్తి ఫోర్ వేను పూర్తి చేస్తాం అని అన్నారు సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు ఈ వన్ వే రోడ్డు పూర్తి కావడం వల్ల మా రైతులకు రవాణా కష్టాలు తీరాయి. ఇరుకు రోడ్డు వల్ల గతంలో పంటను మార్కెట్ కు తీసుకురావడానికి నానా ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు ఈ విశాలమైన రోడ్డు వల్ల తక్కువ ఖర్చుతో, తక్కువ సమయంలో మార్కెట్ కు చేరుకోవచ్చు. ఇది రైతుల పాలిట వరం అని అన్నారు.

మున్సిపల్ చైర్మన్ దండి లక్ష్మీ మాట్లాడుతూ... సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు ఈ రోడ్డు ప్రారంభం కావడం హుస్నాబాద్ పట్టణ చరిత్రలో మర్చిపోలేని రోజు. ఈ రోడ్డు వల్ల పట్టణానికి వచ్చే మహిళలకు, స్కూల్స్, కాలేజీలకు వెళ్లే విద్యార్థినులకు ప్రయాణం చాలా సురక్షితంగా, వేగంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉంది అని అన్నారు.

హుస్నాబాద్ పట్టణ అధ్యక్షులు వి.వి. రమణ మాట్లాడుతూ... కాంగ్రెస్ అంటే మాటలు కాదు, చేతల పార్టీ అని మరోసారి రుజువైంది. సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు వన్ వే రోడ్డును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడం మా నిబద్ధతకు నిదర్శనం. హుస్నాబాద్ అభివృద్ధి ఇక జెట్ స్పీడ్ తో సాగుతుంది. కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి సాధ్యం అని అన్నారు.

సింగిల్ విండో చైర్మన్ చిట్టిమల్ల రవీందర్ మాట్లాడుతూ... సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు వేస్తున్న ఈ విశాలమైన రోడ్డు వల్ల ఇక ప్రమాదాలకు పూర్తిగా చెక్ పడుతుంది. గతంలో సింగిల్ రోడ్డు వల్ల ఎన్నో రోడ్డు ప్రమాదాలు జరిగి ఎంతో మంది విలువైన ప్రాణాలు కోల్పోయాం. ఇప్పుడు ఈ వన్ వే రోడ్డు వల్ల ప్రజల ప్రాణాలకు పూర్తి భరోసా లభించింది అని తెలిపారు.

సుందరగిరి సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి మాట్లాడుతూ... సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు రోడ్డు ప్రారంభం కావడం మా గ్రామ చరిత్రలో గర్వకారణం. మా గ్రామం పేరు ఇప్పుడు రాష్ట్రమంతా మారుమోగుతోంది. మా గ్రామానికి ఇంత ప్రాధాన్యత ఇచ్చిన కాంగ్రెస్ నాయకులకు, ప్రభుత్వానికి మా గ్రామం తరపున హృదయపూర్వక కృతజ్ఞతలు అని భావోద్వేగంగా అన్నారు. అలాగే ఫోర్ వే రోడ్డు పనుల్లో భాగంగా ఇల్లు కోల్పోతున్న వారికి ఇల్లు త్వరగా నిర్మించాలని వారు కోరారు.

ముస్తాబాద్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు మాట్లాడుతూ... సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు ఈ వన్ వే రోడ్డు ప్రారంభం కావడం చాలా సంతోషంగా ఉంది. ఈ రోడ్డు వల్ల రైతులు, వ్యాపారులు, సామాన్య ప్రజలందరికీ ఎంతో మేలు జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి పనుల్లో దూసుకుపోతోంది అని అన్నారు.

చిగురుమామిడి మండల కాంగ్రెస్ అధ్యక్షులు అందే సురేష్ మాట్లాడుతూ... సుందరగిరి నుండి హుస్నాబాద్ వరకు వన్ వే పూర్తి చేశాం. ఇది ఆరంభం మాత్రమే, త్వరలోనే పూర్తి ఫోర్ వేను పూర్తి చేసి హుస్నాబాద్ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ గా నిలబెడతాం. కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోంది అని ధీమా వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షులు మార్క రాజ్ కుమార్ గౌడ్, బొమ్మల పెళ్లి సర్పంచ్ కొంకట మౌనిక, నవాపేట సర్పంచి గుల్ల రాజు రజిత, ఉల్లంపల్లి సర్పంచ్ అల్వాల శంకర్, చిగురుమామిడి సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్, వివిధ గ్రామాల ఉపసర్పంచులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కేంద్ర మంత్రి



చిగురుమామిడి, నవంబర్ 12 (మనం న్యూస్): చిగురుమామిడి మండలంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం,పలువురిని పరామర్శించారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన తండ్రి, కూతురు పైడిపల్లి శ్రీకాంత్, మహాన్వీత కుటుంబ సభ్యులను కేంద్ర మంత్రి పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే గత కొద్ది రోజుల క్రితం మరణించిన దళిత మోర్చా మండల అధ్యక్షుడు దొంత కర్ణాకర్ తండ్రి దొంత మల్లయ్య కుటుంబాన్ని కూడా పరామర్శించారు. చిగురుమామిడి మండల కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి కర్ణాకర్ ను కలిసి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ పరామర్శ కార్యక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తో పాటు బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుజ్జు శ్రీనివాస్, కమ్మం వెంకటేశం, జిల్లా ఉపాధ్యక్షులు దుర్శెట్టి సంపత్, మాచెర్ల కుమార్, జిల్లా కార్యదర్శి పైడిపల్లి పృథ్వీరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు అచ్చ రవీందర్, మండల ప్రధాన కార్యదర్శులు గుణుకుల మధుసూదన్ రెడ్డి, బుద్దరి మహేందర్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కంది శంకర్, మాజీ మండల అధ్యక్షులు పైడిపల్లి శ్రీనివాస్, పెసరి హరీష్, కిరణ్, సంపత్, పెండ్యాల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

జగిత్యాల పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుదాం



- మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్

జగిత్యాల నవంబర్ 12 (మనం న్యూస్): పట్టణంలోని 39 వార్డు బ్రాహ్మణ వీధిలో వార్డ్ కౌన్సిలర్ బొలసాని శ్రీనివాస్ తో కలిసి వార్డు ను మున్సిపల్ కమిషనర్ సత్యప్రణవ్ సందర్శించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలోని 39 వ వార్డులో మెడికల్ షాప్ వారు బహిరంగ ప్రదేశంలో చెత్త వేయడం గమనించి షాపు యజమానికి మున్సిపల్ కమిషనర్ జరిమానా విధించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగంగా ఎవరు కూడా రోడ్లపై చిత్తవేరాదని మున్సిపల్ ఆటో వచ్చినప్పుడు ఆటోలో మాత్రమే వేయాలని., దీనికి పట్టణ ప్రజలు అందరూ సహకరించి రోడ్లపై చెత్త వేయరాదని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది వార్డ్ ఆఫీసర్ ఉన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు జ్యోతి హైస్కూల్ విద్యార్థినుల ఎంపిక



జగిత్యాల నవంబర్ 12(మనం న్యూస్): అండర్-14 హాకీ విభాగంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు జ్యోతి హైస్కూల్ విద్యార్థినులు ఎంపికయ్యారు. జ్యోతి పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు ఎం. నిత్యశ్రీ, బి. సురక్షిత ఉమ్మడి జిల్లా స్థాయి హాకి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈ నెల 13వ తేదీ కామారెడ్డి జిల్లాలోని బీబీపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జరగనున్న రాష్ట్రస్థాయి హాకీ పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ శ్రీ బియ్యాల హరిచరణ్ రావు , శ్రీధర్ రావు, మౌనిక రావు, అజిత రావు, విద్యార్థినులను ప్రత్యేకంగా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా విజయాన్ని సాధించి పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.


నిబంధనలు పాటించని ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం

- అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ

జగిత్యాల, నవంబర్ 12 (మనం న్యూస్): గురువారం జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ అధ్యక్షతన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ (క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్) సమావేశం అదనపు కలెక్టర్ ఛాంబర్లో నిర్వహించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) నిబంధనలు-2022 ప్రకారం, క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2010 అమలుపై ఈ సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం-2010 ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ సమయంలో నమోదు చేసిన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది మాత్రమే ఆయా ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందించాలని స్పష్టం చేశారు. సిబ్బంది ఎవరైనా విధుల నుంచి వెళ్లిపోయినా, కొత్తగా వైద్యులు లేదా సిబ్బంది చేరినా సంబంధిత వివరాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లో అప్డేట్ చేయించుకోవాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో సాధారణ వైద్యం, శస్త్రచికిత్సలు, ప్రసవాలు తదితర వైద్య సేవలకు వసూలు చేసే ఫీజుల వివరాలను ప్రజలకు కనిపించే విధంగా స్పష్టమైన బోర్డులపై ప్రదర్శించాలని సూచించారు. వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు ప్రైవేట్ ఆసుపత్రుల యాజమాన్యాలు మానవతా దృక్పథంతో తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రుల్లో బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ పకడ్బందీగా చేపట్టడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి. సుజాత మాట్లాడుతూ జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం అమలవుతున్న తీరును, నిబంధనలు పాటించని ఆసుపత్రులపై ఇప్పటివరకు తీసుకున్న చర్యలను సమావేశానికి వివరించారు. ఈ సమావేశంలో ఐఎంఏ అధ్యక్షులు డాక్టర్ జి. శశికాంత్ రెడ్డి, సీసీఎస్ ఇన్స్పెక్టర్ ఎం. శ్రీనివాస్, ఇన్చార్జి డెమో ఏనుగంటి రాజేశం, హెల్త్ ఎడ్యుకేటర్ రవీందర్ రాథోడ్, జూనియర్ అసిస్టెంట్ వి. సాగర్ పాల్గొన్నారు.



మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట



- జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్

జగిత్యాల నవంబర్ 12(మనం న్యూస్): జగిత్యాల పట్టణానికి చెందిన పలువురు ఆడబిడ్డలకు కల్యాణ లక్ష్మి పథకం ద్వారా మంజూరైన చెక్కులను ఈరోజు జగిత్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ అందజేశారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ మహిళల సంక్షేమం, అభివృద్ధి కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. జగిత్యాల పట్టణంలోని చింతకుంట చెరువు, మోతె చెరువు అభివృద్ధికి ప్రభుత్వం ఒక్కో చెరువుకు రూ.3 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఏడాది క్రితమే నిధులు మంజూరైనప్పటికీ వర్షాలు, మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో పనుల ప్రారంభంలో కొంత జాప్యం జరిగిందని వివరించారు.జగిత్యాల నియోజకవర్గ అభివృద్ధికి, పట్టణ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని, ప్రజలందరికీ ఈ విషయం తెలుసునని అన్నారు. కొందరు నాయకులు కావాలనే ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. చెరువుల పునరుజ్జీవన పనులు ప్రారంభం కానున్నాయని తెలిసి, పనులు ఇంకా ప్రారంభించలేదంటూ విమర్శలు చేయడం, తాము ప్రశ్నించడం వల్లే పనులు జరుగుతున్నాయని భావించడం వారి అపోహ మాత్రమేనని పేర్కొన్నారు.

చెరువుల పునరుజ్జీవన పథకంలో 67 శాతం రాష్ట్ర ప్రభుత్వం, 33 శాతం కేంద్ర ప్రభుత్వం వాటా ఉంటుందని, కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ రూపంలో 18 శాతం వసూలు చేస్తోందని అన్నారు. జగిత్యాల నియోజకవర్గానికి నూతన పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారీగా పెన్షన్లు అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అన్నారు.

గత ప్రభుత్వంలో అమలైన సంక్షేమ పథకాలతో పాటు ప్రజలకు అవసరమైన నూతన పథకాలను కూడా ప్రజాప్రభుత్వం అందిస్తోందని, మహిళల ఆర్థిక స్వావలంబన, సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ సమీండ్ల వాణి శ్రీనివాస్ డీసీసీ అధ్యక్షుడు గజంగి నందయ్య ఏఎంసి చైర్మెన్ గడ్డం నారాయణ రెడ్డి ఎమ్మార్వో రామ్మోహన్ టీపీసీసీ సెక్రటరీ బండ శంకర్, అడువాల లక్ష్మణ్, జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ దుమాల రాజ్ కుమార్, జిల్లా యూత్ అధ్యక్షులు బీరం రాజేష్, , డిసిసి ఉపాధ్యక్షులు రవీందర్ కౌన్సిలర్ లు కో ఆప్షన్ సభ్యులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలి

- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి, వీలైనంత త్వరగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, నవంబర్ 12 (మనం ప్రతినిధి): జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం జగదేవ్‌పేట లో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహిస్తున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే చేపడుతున్న విధానాన్ని, భూ రికార్డులకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే ప్రక్రియను ఎలాంటి తప్పులు, పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. రీ సర్వే ప్రక్రియలో రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భూముల హద్దులు, విస్తీర్ణం, ఇతర రెవెన్యూ రికార్డుల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి ఖచ్చితమైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు. సర్వే నిర్వహణ సమయంలో రైతుల నుంచి వచ్చే అభ్యంతరాలు, సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిశీలించి పరిష్కరించేలా రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్దేశించిన మార్గదర్శకాలు, లక్ష్యాలకు అనుగుణంగా రీ సర్వే పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి

అనంతరం అదే గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులను, పనుల పురోగతిని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎలాంటి జాప్యం లేకుండా వీలైనంత త్వరగా పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి ఇంటి నిర్మాణ పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన సహాయ సహకారాలు సకాలంలో అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఇళ్ల నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, అర్హులైన లబ్ధిదారులు త్వరగా తమ సొంత ఇళ్లలో నివసించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, హౌసింగ్ అధికారి భాస్కర్, ల్యాండ్ సర్వే ఏడీ, ఎంపీఓ, మండల తహసీల్దార్, సంబంధిత అధికారులు మరియు సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీని నంబర్ వన్‌గా నిలబెడతాం

- పెట్టుబడులకు 'ఎస్క్రో' రక్షణ...
- సి.ఐ.ఐ. భాగస్వామ్య సదస్సులో ఏపీ సీఎం

(అమరావతి, మనం బ్యూరో చీఫ్): ఆంధ్రప్రదేశ్ లో గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వం దాదాపు రూ. 32.5 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులను ఆకర్షించగలిగిందని సీఎం చంద్రబాబు వెల్లడించారు. విశాఖలో సి.ఐ.ఐ. భాగస్వామ్య సదస్సులో సీఎం మాట్లాడుతూ, విశాఖ సదస్సు ద్వారా రూ.9.89 లక్షల కోట్ల విలువైన 303 ఒప్పందాలు కుదుర్చుకోబోతున్నట్లు తెలిపారు. పెట్టుబడిదారులకు పూర్తి భరోసా కల్పిస్తామని, రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించే వారి నిధులకు భద్రత కల్పించేందుకు ఎస్క్రో ఖాతా విధానాన్ని అమలు చేస్తామన్నారు. వ్యాపార అనుమతుల్లో జాప్యాన్ని నివారించి 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'కు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేస్తామని ప్రకటించారు. దక్షిణ భారతదేశంలో నీటి ఎద్దడిని నివారించేందుకు నదుల అనుసంధానం అత్యంత కీలకమని పేర్కొన్నారు. రాజధాని అమరావతిలో అత్యాధునిక క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటు కాబోతోందని తెలిపారు. గూగుల్ డేటా సెంటర్, ఎల్జీ వంటి దిగ్గజ సంస్థల రాకతో ఏపీ టెక్నాలజీ హబ్‌గా మారుతోందని వివరించారు. మరో 12 వేల ఉద్యోగాలు: గతంలో అనంతపురానికి కియా పరిశ్రమ వస్తుందని ఎవరూ ఊహించలేదని, నేడు అదే సంస్థ అదనంగా 2 బిలియన్ డాలర్ల పెట్టుబడితో ముందుకు వచ్చిందని చెప్పారు. దీనివల్ల కొత్తగా 12,000 ఉద్యోగాలు లభించనున్నాయని పేర్కొన్నారు. లిక సదుపాయాల విప్లవం: రాష్ట్రంలో ప్రస్తుతం 6 పోర్టులు పనిచేస్తుం డగా, మరో 4 గ్రీన్‌ఫీల్ పోర్టులు, 7 ఫిషింగ్ హార్బర్లు, 3 షిప్ బిల్డింగ్ క్లస్టర్లు నిర్మిస్తున్నామన్నారు. అలాగే 6 విమానాశ్రయాలకు అదనంగా మరో 9 కొత్త విమానాశ్రయాలు రాబోతున్నాయని, హైదరాబాద్- బెంగళూరు, హైదరాబాద్-అమరావతి-చెన్నై మధ్య హైస్పీడ్ రైలు కారిడార్ల నిర్మాణం జరగనుందని వివరించారు.

స్వచ్ఛ విశాఖ.. అరకు కాఫీ

0స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో విశాఖపట్నం అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని పీఎం చంద్రబాబు అన్నారు. అరకు కాఫీకి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభిస్తోందని ప్రశంసించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తనకు అత్యంత నమ్మకమైన మిత్రుడని, ఎన్డీయే కూటమి సమష్టి కృషితో రాష్ట్రం వేగంగా అభివృద్ధి చెందుతోందని చంద్రబాబు పేర్కొన్నారు. మహిళల భద్రతపై రాజీపడే ప్రసక్తే లేదని, ఇండస్ట్రియల్ కారిడార్లలో మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచుతామని స్పష్టం చేశారు.

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా కర్రసత్య ప్రసన్న రెడ్డి

కరీంనగర్ నవంబర్ 12(మనం బ్యూరో): హైదరాబాద్ గాంధీ భవన్ లో మూడవ సారి కర్ర సత్యప్రసన్న రెడ్డి కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గా నియామక పత్రాన్ని అల్ ఇండి యా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కా లాంబా,తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మహేష్ కుమార్ ,వెల్ఫేర్ రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ ,కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చొప్పదండి శాసన సభ్యులు మేడిపల్లి సత్యం ,తెలంగాణ రాష్ట్ర ఎస్సీ , ఎస్టీ సెల్ అధ్యక్షులు మానకొండూరు శాసన సభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణ కు,ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు మరియు గోపాల్ రావుపేట గ్రామ ప్రజలకు ప్రత్యకంగా పేరు పేరున కృతజ్ఞతలు తెలియ జేశారు. ఈ సందర్భంగా సత్యప్రసన్న మాట్లాడుతూ 2002 లో యూత్ కాంగ్రెస్ సభ్యురాలుగా,2006 లో కాంగ్రెస్ పార్టీ గోపాల్ రావుపేట్ మహిళా ఎంపీటీసీ 1 గా పోటీ లో ఉండడం,2013 లో జనరల్ లో ఎంపీటీసీ 1 గా గెలుపొంది కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షురాలుగా,కరీంనగర్ జిల్లా రాజీవ్ గాంధీ పంచాయిత్ రాజ్ సంఘటన అధ్యక్షురాలుగా, 5000 ఓటర్లు గల గోపాల్ రావుపేట గ్రామంలో 2019 సర్పంచ్ జనరల్ లో బారి మెజారిటీ తో గెలిచి గోపాల్ రావుపేట్ లో ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేసినందున కలెక్టర్ చే అవార్డు లభించింది,2021 సంవత్సరము నుండి కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలుగా మహిళా కాంగ్రెస్ ను బలోపేతం చేస్తూ వచ్చానన్నారు . మూడవ సారి కూడా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు గా నియమించినందున మరింత బాధ్యత యుతంగా పని చేస్తానని తెలిపారు.



పిఆర్సి వెంటనే ప్రకటించాలి

- టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్ సుందర్ డిమాండ్



జగిత్యాల, నవంబర్ 12 (మనం న్యూస్): పియర్సి వెంటనే ప్రకటించాలని టీఎస్యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుకోవెల శ్యామ్ సుందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జగిత్యాల రూరల్ మండలంలోని ఆయా పాఠశాలల్లో టీఎస్ యుటిఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు పిఆర్సి కాలపరిమితి ముగిసినందున నివేదిక వెంటనే తెప్పించుకొని అమలు చేయాలన్నారు.

ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే క్లియర్ చేయడంతోపాటు, బదిలీలు ప్రమోషన్లు చేపట్టి పాఠశాల విద్యను బలోపేతం చేయాలనీ కోరారు. ఆదర్శ పాఠశాలలను 317 జీఓ ను అమలు చేయడంతో పాటు 010 ద్వారా వేతనాలు ఇవ్వాలని కోరారు.

కస్తూర్బా పాఠశాల ఉపాధ్యాయులకు సర్వ శిక్ష ఉద్యోగులకు మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో టిఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఒజ్జశ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శి తిరునగరి ప్రభాకర్, తేలు చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

కరువు ప్రభావిత రైతులకు రుణ ఉపశమనం

- కరువు ప్రాంత అర్హులైన రైతులందరికీ బ్యాంకుల సహకారం అందించాలి
- రుణ ప్రణాళిక అమలులో బ్యాంకుల పురోగతి
- అదనపు కలెక్టర్ రెవెన్యూ లక్ష్మి కిరణ్



సిద్దిపేట, నవంబర్ 12 (మనం ప్రతినిధి): కరువు ప్రభావానికి గురైన రైతులకు ప్రభుత్వ మార్గదర్శకాలు, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా రుణ ఉపశమన చర్యలు అందించేందుకు చేపట్టాలని బ్యాంకులకు అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ సూచించారు. ఐడిఓసి సమావేశ మందిరంలో సిద్దిపేట జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని బ్యాంకుల ప్రాంతీయ అధికారులు, జిల్లా సమన్వయకర్తలు, బ్యాంకు శాఖల ప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన సిద్దిపేట జిల్లాలో కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించిన 8 మండలాలకు సంబంధించిన వివరాలను సమావేశంలో వివరించారు. వీటిలో ఒక మండలం తీవ్ర కరువు ప్రభావిత మండలంగా, ఏడు మండలాలు మధ్యస్థ కరువు ప్రభావిత మండలాలుగా గుర్తించడం తెల్సిందే. కరువు ప్రభావిత రైతులకు అందించాల్సిన రుణ ఉపశమన చర్యలు, పంట రుణాల పునర్వ్యవస్థీకరణ, రుణ చెల్లింపులపై మారటోరియం, రుణ చెల్లింపు గడువు పొడిగింపు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన రుణాలు మరియు అవసరాన్ని బట్టి అదనపు రుణ సదుపాయాల కల్పన వంటి అంశాలపై బ్యాంకర్లకు లీడ్ బ్యాంక్ కార్యాలయం ద్వారా సమగ్రంగా వివరించారు.

అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్ మాట్లాడుతూ, కరువు ప్రభావిత రైతులకు బ్యాంకులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, అర్హులైన రైతులను గుర్తించి ఆర్.బి.ఐ మార్గదర్శకాలు మరియు ఆయా బ్యాంకుల నిబంధనల ప్రకారం రుణ ఉపశమన చర్యలు అందించాలని సూచించారు. వ్యవసాయ రంగంతో పాటు పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పరిశ్రమ, చేపల పెంపకం వంటి అనుబంధ రంగాలపై ఆధారపడిన అర్హులైన లబ్ధిదారులకు కూడా బ్యాంకులు అవసరమైన రుణ సహకారం అందించాలని కోరారు.

కరువు ప్రభావిత రైతులకు ఇప్పటికే ఉన్న రుణాల పునర్వ్యవస్థీకరణతో పాటు, వారి వ్యవసాయ కార్యకలాపాలను తిరిగి కొనసాగించేందుకు అవసరమైన అదనపు రుణాలను కూడా అర్హత, ఆర్థిక సాధ్యత ఆధారంగా పరిశీలించాలని బ్యాంకర్లను ఆదేశించారు. వ్యవసాయ శాఖతో పాటు సంబంధిత అనుబంధ శాఖల అధికారులు కరువు ప్రభావిత రైతుల వివరాలను బ్యాంకులకు అందించి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో బ్యాంకర్లందరూ కరువు సహాయక చర్యలను ప్రాధాన్యతగా తీసుకుని, అర్హులైన రైతులకు సకాలంలో రుణ ఉపశమన ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

రుణ ప్రణాళిక అమలులో బ్యాంకుల పురోగతి

రూ.5,507.38 కోట్ల రుణాల సాధన జిల్లాలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లా క్రెడిట్ ప్లాన్ అమలులో భాగంగా బ్యాంకులు ఇప్పటివరకు మొత్తం రూ.5,507.38 కోట్ల రుణాలను మంజూరు చేసి, నిర్దేశించిన వార్షిక లక్ష్యంలో 46.56 శాతం పురోగతి సాధించాయని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు

ఈరోజు నిర్వహించిన జిల్లా స్థాయి సంప్రదింపుల కమిటీ సమావేశంలో బ్యాంకుల రుణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. ప్రాపర్టీ సెక్టార్లో నిర్దేశించిన లక్ష్యంలో రూ.3,905.08 కోట్ల రుణాలు మంజూరు చేసి 40.36 శాతం సాధించగా నాన్ ప్రాపర్టీ సెక్టరులో రూ.1,602.30 కోట్ల రుణాలను మంజూరు చేసి 74.37 శాతం లక్ష్యాన్ని సాధించినట్లు పేర్కొన్నారు.

మొత్తం జిల్లా రుణ ప్రణాళిక ప్రాధాన్యతా మరియు ప్రాధాన్యతేతర రంగాలు కలిపి మొత్తం రూ.5,507.38 కోట్ల రుణాల పంపిణీతో 46.56 శాతం పురోగతి సాధించినట్లు వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం, సూక్ష్మ మరియు చిన్న తరహా పరిశ్రమలు, స్వయం సహాయక సంఘాలు, విద్య, గృహ నిర్మాణం మరియు ఇతర ప్రాధాన్యతా రంగాలకు రుణాల మంజూరులో మరింత వేగం పెంచాలని సూచించారు.

ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించడంతో పాటు, జిల్లాలోని రైతులు, మహిళా సంఘాలు, యువ పారిశ్రామికవేత్తలు మరియు చిన్న వ్యాపారులకు బ్యాంకులు మరింత సహకారం అందించాలని కోరారు.

సీఎం సభకు ఏర్పాట్లు ముమ్మరం



సిద్దిపేట, నవంబర్ 12 (మనం ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 19న సిద్దిపేట పర్యటన సందర్భంగా సభాస్థలి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. నాగదేవత గుడి నుండి సిరిసిల్ల వెళ్ళే బైపాస్ రోడ్ పక్కన 15 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగ సభ నిర్వహణ పనులు జరుగుతున్నాయి. జిల్లా కలెక్టర్ హైమావతి శుక్రవారం పనుల ను క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బహిరంగ సభ ప్రాంగణం వేదిక, వివిఐపి లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రజలు, మీడియా కోసం ఏర్పాటు చేయవలసిన ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా వీఐపీలు, అధికారుల వాహనాల పార్కింగ్, బందోబస్తు నిర్వహణ ప్రక్రియ ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రత్యేక గ్యాలరీల భారీ కేడింగ్, విద్యుత్ సౌకర్యానికి ఇబ్బంది కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీవో సదానందం, తహసిల్దార్ కిరణ్, పోలీస్ శాఖ అధికారులు, రెవెన్యూ, ఆర్అండ్ బి, విద్యుత్, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యం



- చిగురుమామిడి మండల అధ్యక్షుడు అందే స్వామి

చిగురుమామిడి, నవంబర్ 12 (మనం న్యూస్): భారత రాజ్యాంగ విలువల పరిరక్షణ, ప్రజల్లో చైతన్యం కలిగించే లక్ష్యంతో ఏర్పాటు చేసిన రాజ్యాంగ పరిరక్షణ చైతన్య వేదిక చిగురుమామిడి మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల కార్యక్రమానికి పరిశీలకులుగా కవ్వ లక్ష్మారెడ్డి, చికోటి రమణయ్య, మేకల వీరన్న యాదవ్, హుస్నాబాద్ కౌన్సిలర్ గాదెపాక రవీందర్ లు హాజరై కమిటీ ఎన్నికను పర్యవేక్షించారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీ అధ్యక్షుడిగా మాజీ జెడ్పిటిసి అందె స్వామి, ప్రధాన కార్యదర్శిగా బడుకోలు దేవేందర్ రెడ్డి, కోఆర్డినేటర్గా రామోజు కృష్ణమాచారిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా అందె సురేష్, మామిడి అంజయ్య, నాగేల్లి లక్ష్మారెడ్డి, ఎనగందుల శ్రావణ్ కుమార్, గడ్డం తిరుపతి రెడ్డిలు నియమితులయ్యారు. అలాగే, కమిటీ కార్యదర్శులుగా బుర్ర పర్శరాములు గౌడ్, పూల లచ్చిరెడ్డి, అనుపోజు జనార్దన్, పింగళి సంపత్ రెడ్డి, ఎనగందుల రాజు, వంతడుపుల దిలీప్ కుమార్, సిరవేని సంపత్ కుమార్, దొబ్బల బాబులు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా గడ్డం అనిల్, గుడిసె మల్లిఖార్జున్, కత్తుల ప్రవీణ్, మంద ఎల్లయ్య, ఎ. బాలకృష్ణ చారిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు అందె స్వామి, ప్రధాన కార్యదర్శి బడుకోలు దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ... మండలంలో రాజ్యాంగ హక్కుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి, సామాజిక న్యాయం కోసం వేదిక తరఫున నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పరిశీలకులకు, సభ్యులకు వారు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సర్పంచులు ఆకవరం భవాని శివప్రసాద్, కాటం సంపత్ రెడ్డి, సాంబారి భారతమ్మ కొమురయ్య, గుళ్ళ రజిత రాజు, ఉపసర్పంచ్ ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, నాయకులు సాంబారి బాబు, బొమ్మగాని పరశురాములు, ముద్రకోల రాజయ్య, అందే చిన్నస్వామి, గజ్జెల రాములు, జగన్, సిరవేణి సంపత్, దొబ్బల బాబు, పింగిలి సంపత్ రెడ్డి, కూరెళ్ళ కిషోర్, గట్టు శ్రీనివాస్, కొమురయ్య, గంద్రె ప్రశాంత్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుమారస్వామికి నివాళులు అర్పించిన రవిచందర్

ములుగు, నవంబర్ 12, మనం ప్రతినిధి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ జన్మదినం సందర్భంగా దివంగత కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా అధ్యక్షుడు నల్లెల్ల కుమారస్వామి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా సూర్యతో కలిసి ఆయన నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి రవిచందర్కు సూర్య జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటాన్‌చెలోనే కార్మికులకు పీఎఫ్ సేవలు

- పీఎఫ్ కార్యాలయం తరలింపుపై కార్మికుల్లో ఆందోళనకు తెర
- ఎంపీ రఘునందన్ రావు ఆదేశాలతో తాత్కాలిక కార్యాలయం ఏర్పాటుకు చర్యలు
- బస్టాండ్‌లో నూతన కార్యాలయ పనుల పరిశీలన
- జనవరి నాటికి పూర్తి చేయాలని ఆదేశం
- శాశ్వత భవనం కోసం కర్దనూరులో స్థలం కేటాయింపునకు ప్రతిపాదన



పటాన్‌చెరు, నవంబర్ 12 (మనం న్యూస్): పటాన్చెరు ప్రాంత కార్మికులకు పీఎఫ్ (ప్రావిడెంట్ ఫండ్) సేవలు స్థానికంగానే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు స్పష్టం చేశారు. పీఎఫ్ కార్యాలయాన్ని హైదరాబాద్కు తరలిస్తున్నారనే ప్రచారం నేపథ్యంలో గురువారం ఆయన పీఎఫ్ అధికారులతో సమావేశమై పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న భవనం నుంచి పటాన్చెరు బస్టాండ్లోని మొదటి, రెండో అంతస్తుల్లో నూతన కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అక్కడ విద్యుత్, ఇంటర్నెట్, పార్టిషన్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అప్పటివరకు ఆన్లైన్ సేవలకు సంబంధించి కొత్తగూడలో తాత్కాలిక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బస్టాండ్లో నూతన కార్యాలయ పనులు పూర్తయిన వెంటనే కొత్తగూడలోని కార్యాలయాన్ని కూడా పటాన్చెరుకు తరలిస్తామని స్పష్టం చేశారు. అయితే, అప్పటివరకు కార్మికులు ఇబ్బందులు పడకుండా పటాన్చెరు బస్టాండ్లోనే తాత్కాలిక కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు వెంటనే అవసరమైన ఏర్పాట్లపై దృష్టి సారించారు. అనంతరం ఎంపీ అధికారులతో కలిసి బస్టాండ్లో ఏర్పాటు చేయనున్న నూతన పీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించి పనులను పరిశీలించారు. జనవరి నాటికి పనులు పూర్తి చేసి కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ.. పీఎఫ్ కార్యాలయం నగరానికి తరలిపోతుందనే ప్రచారంతో కార్మికుల్లో నెలకొన్న ఆందోళనను తొలగించేందుకే స్వయంగా అధికారులతో సమావేశమయ్యానని తెలిపారు. పటాన్చెరు ప్రాంత కార్మికులకు పీఎఫ్ సేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో పీఎఫ్ కార్యాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేసే దిశగా జిల్లా కలెక్టర్తో చర్చించి కర్దనూరులో స్థలం కేటాయించాలని ప్రతిపాదించినట్లు తెలిపారు.

చిల్లర రాజకీయాలు మానుకోకుంటే తగిన బుద్ధి చెప్తాం



- కోవర్టు రాజకీయాలు,పార్టీ పెద్దలతో ఫోటోలతో తప్పుదారి పట్టిస్తున్న అనిల్ రెడ్డి
- తగిన ఆధారాలతో పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేస్తాం

వర్గల్, నవంబర్12(మనం న్యూస్): మండలంలోని మల్లారెడ్డి పల్లికి చెందిన అనిల్ రెడ్డి గత ఐదేళ్లుగా కోవర్టు రాజకీయాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీని బ్రష్టు పట్టిస్తున్నట్లు జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి డాక్టర్ యాదగిరి, యువజన కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షులు పంజాల సాయి గౌడ్, సీనియర్ నాయకులు అంజిరెడ్డి, మల్లారెడ్డి, పిట్ల రాజు, మధుసూదన్ రెడ్డి ఆరోపించారు. వర్గల్ శివారులోని టీజీఆర్ గార్డెన్ లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నేతలతో కలిసి తిరుగుతూ స్థానిక కాంగ్రెస్ నేతలపై దుష్ప్రచారం చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో ఆయన ఏక లింగం కాగా, ఆయనకు గ్రూపులు, వర్గాలు అంటూ ఏమీ లేవని స్పష్టం చేశారు. గత రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీకి తాము అంకిత భావంతో పనిచేస్తుండగా, అన్ని పార్టీలు తిరిగి కాంగ్రెస్ గూటికి చేరిన అనిల్ రెడ్డి పార్టీ పెద్దలతో కలసి దిగిన ఫోటోలతో ఇక్కడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నట్లు విమర్శించారు. మల్లారెడ్డి పల్లి లో జరిగిన ఫ్లెక్సీ సంఘటనలో తమకు ఎలాంటి సంబంధం లేదని, అయితే మల్లారెడ్డిపల్లి చౌరస్తాలోని గుడి వద్ద తాము ప్రమాణం చేసేందుకు సిద్ధమని స్పష్టం చేస్తూ ఆయన అందుకు సిద్ధం కావాలని డిమాండ్ చేశారు. నీ వెనక ఎవరు ఉండి మాట్లాడిస్తున్నారో...? తమకు తెలుసని, తప్పుడు ఆరోపణలతో చిల్లర రాజకీయాలు చేస్తున్న అనిల్ రెడ్డి భరతం పడతామని హెచ్చరించారు. తులసి మొక్కలా ఉన్న వర్గల్ మండల కాంగ్రెస్ పార్టీలో గంజాయి మొక్కగా అనిల్ రెడ్డి మారినట్లు ఎద్దేవా చేశారు. సర్పంచ్ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థికి మద్దతు తెలిపి కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిని ఓడించే ప్రయత్నం విఫలం కావడంతో కక్షకట్టి గ్రూపు రాజకీయాలకుతెర లేపుతున్నాడు అన్నారు. అనిల్ రెడ్డి చేస్తున్న రాజకీయం, ఆయన ఎవరెవరితో కలిసి తిరుగుతున్నారో? ఏఏ పార్టీలతో కలిసి పనిచేస్తున్నారో? తగిన ఆధారాలతో పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో నేతలు బాలేష్, శ్రీకాంత్, శ్రీహరి, వెంకటేష్, స్వామి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామి దేవస్థాన అభివృద్ధికి రూ.7 లక్షల విరాళం

బీఆర్ఎస్ యువ నేత, ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ దాతృత్వం

ద్వారపాలకుల మండపం నిర్మాణానికి రూ.7,00,116 అందజేత

పృథ్వీరాజ్ను శాలువాతో సత్కరించిన ఆలయ కమిటీ సభ్యులు



అమీన్ పూర్, నవంబర్ 12 (మనం న్యూస్): ఆధ్యాత్మిక కార్యక్రమాలకు, దేవాలయాల అభివృద్ధికి తనవంతు సహకారం అందించడంలో ముందుండే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎండిఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ పరిధిలోని బీరంగూడలో నిర్మాణంలో ఉన్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి దేవస్థాన అభివృద్ధికి రూ.7,00,116 (ఏడు లక్షల నూట పదహారు రూపాయలు) విరాళంగా అందజేశారు. దేవస్థానంలో ద్వారపాలకుల మండపం నిర్మాణం కోసం ఈ మొత్తాన్ని సమర్పించారు. ఈ నెల 22న నిర్వహించనున్న శ్రీశ్రీశ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని పురస్కరించుకుని మాద్రి పృథ్వీరాజ్ దేవస్థానాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులతో సమావేశమై ప్రతిష్ఠా మహోత్సవ ఏర్పాట్లు, దేవస్థాన నిర్మాణం, అభివృద్ధి పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ద్వారపాలకుల మండపం నిర్మాణానికి తనవంతు సహకారంగా రూ.7,00,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక విలువలకు దేవాలయాలు ప్రతీకలని పేర్కొన్నారు. దేవాలయాలు కేవలం ప్రార్థనా మందిరాలే కాకుండా భక్తి, ఐక్యత, సేవాభావం, సామాజిక సమైక్యతను పెంపొందించే పవిత్ర కేంద్రాలని అన్నారు. దేవాలయాల పరిరక్షణ, అభివృద్ధి ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించాలని, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు భక్తులు, దాతలు తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ దేవాలయాల అభివృద్ధికి, ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలకు తన సహకారం కొనసాగిస్తానని తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి భారీ విరాళం అందించిన మాద్రి పృథ్వీరాజ్ను ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు శాలువాతో ఘనంగా సత్కరించి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, ప్రముఖులు, అయ్యప్ప స్వామి భక్తులు, ఎంపీఆర్ యువసేన సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

జెకె ఫెన్నార్ కార్మిక సంఘం ఎన్నికల్లో బిఆర్టియు విజయం

- 13 ఓట్ల మెజార్టీతో సమీప ప్రత్యర్థి హెచ్ఎంఎస్పై గెలుపు
- విజయం సాధించిన బిఆర్టియు నాయకులకు ఎమ్మెల్యే జిఎంఆర్ అభినందనలు
- కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం.. ప్రతి హామీని అమలు చేస్తాం



పటాన్చెరు, నవంబర్ 12 (మనం న్యూస్): పటాన్చెరు డివిజన్ పరిధిలోని జెకె ఫెన్నార్ పరిశ్రమలో గురువారం నిర్వహించిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బిఆర్టియు ఘన విజయం సాధించింది. సమీప ప్రత్యర్థి హెచ్ఎంఎస్ యూనియ్పు 13 ఓట్ల మెజార్టీతో గెలుపొందింది. మొత్తం 247 ఓట్లు పోలవగా, బిఆర్టియుకు 103, హెచ్ఎంఎస్కు 93, సిఐటియుకు 48 ఓట్లు లభించాయి. మరో మూడు ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్, రాష్ట్ర కార్యదర్శి యాదగిరి యాదవ్ మాట్లాడుతూ.. కార్మికుల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్న బిఆర్టియుపై నమ్మకంతో విజయం అందించిన ప్రతి ఒక్క కార్మికుడికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటామని తెలిపారు. ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, రాష్ట్ర నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డిల సహకారం, మార్గదర్శకత్వంలో కార్మికులకు మెరుగైన వేతన ఒప్పందం, ఉద్యోగ భద్రత కల్పించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, అధ్యక్షుడిగా రాంబాబు యాదవ్, ప్రధాన కార్యనిర్వాహక అధ్యక్షుడిగా యాదగిరి యాదవ్ ఎన్నికయ్యారు.

ఎన్నికల్లో విజయం సాధించిన అనంతరం బిఆర్టియు నాయకులు, కార్మికులు పటాన్చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గూడెం మహిపాల్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. జెకె ఫెన్నార్ ఎన్నికల్లో బిఆర్టియుకు విజయాన్ని అందించిన కార్మికులకు, నాయకులకు అభినందనలు తెలిపారు. ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన ప్రతి హామీని చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన బాధ్యత నూతన కార్యవర్గంపై ఉందని సూచించారు. పరిశ్రమ అభివృద్ధిలో కార్మికుల భాగస్వామ్యం ఎంతో కీలకమని, వారి సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ పని చేయాలని పేర్కొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియలో వేగం పెంచాలి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల, నవంబర్ 12 (మనం ప్రతినిధి) జిల్లాలో చేపట్టిన భూముల రీసర్వే ప్రక్రియను మరింత వేగవంతము గా, పకడ్బందీగా పూర్తి పారదర్శకతతో,నిర్దేశిత గడువులోగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టరేట్లో అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు, భూ సర్వే శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ రీసర్వే పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా రీసర్వే చేపట్టాల్సిన మొత్తం భూమి విస్తీర్ణం ఎన్ని ఎకరాలు ఉంది, ఇప్పటివరకు ఎన్ని ఎకరాల్లో రీసర్వే ప్రక్రియ పూర్తి చేశారు, ఇంకా ఎన్ని ఎకరాల్లో సర్వే నిర్వహించాల్సి ఉందనే వివరాలను మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి మండలంలో ఇప్పటివరకు సాధించిన పురోగతి, మిగిలి ఉన్న సర్వే పనులు, వాటిని పూర్తి చేసేందుకు తీసుకుంటున్న చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,

భూముల రీసర్వే ప్రక్రియను ప్రాధాన్యతగా తీసుకొని క్షేత్రస్థాయిలో పనుల వేగం పెంచాలని సూచించారు. రీసర్వేకు సంబంధించి ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. సర్వే పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని తెలిపారు.

జిల్లాలో నిర్వహించే భూరి సర్వే ప్రక్రియలో కచ్చితంగా కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పనులను త్వరితగతిన డిసెంబర్ మొదటి వారంలోగా ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పూర్తిచేయాలని ఆదేశించారు.

రీసర్వే ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని, అదనపు కలెక్టర్ (రెవెన్యూ), ఆర్డీవోలు, మండల తహశీల్దార్లు, భూ సర్వే శాఖ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. మండలాల వారీగా సర్వే పూర్తయిన విస్తీర్ణం, ఇంకా పెండింగ్లో ఉన్న భూముల వివరాలను ప్రతి రోజు ఎప్పటికప్పుడు సమీక్షించాలని, క్షేత్రస్థాయిలో ఏవైనా సమస్యలు ఎదురైతే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా జిల్లాలో రీసర్వే ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, లేనియెడల కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. ప్రసూనాంబ, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, మెట్పల్లి ఆర్డీవో నరసింహారావు, భూ సర్వే శాఖ ఏడీ, మండల తహశీల్దార్లు (ఎంఆర్ఓలు), సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక: కలెక్టర్ అంకిత్

భక్తులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనకు సిద్ధం

ఘాట్ల అభివృద్ధి, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, రహదారులు, వైద్య సదుపాయాల ఏర్పాట్లకు ప్రాధాన్యత ఇవ్వాలి



భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 12 (మనంప్రతినిధి): గోదావరి పుష్కరాలు-2027ను దృష్టిలో ఉంచుకొని భద్రాచలం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ప్రణాళిక రూపొందించి, అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఐ డి ఓ సి కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, భక్తులకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, ఘాట్ల అభివృద్ధి తదితర అంశాలపై జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పుష్కరాలకు వచ్చే భక్తుల సంఖ్యను దృష్టిలో ఉంచుకొని ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు. భక్తులకు వసతి, భోజనం, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం వంటి సౌకర్యాలను అందుబాటులో ఉంచేందుకు అవసరమైన ప్రదేశాలను ముందుగానే గుర్తించాలన్నారు. సిబ్బందికి వసతి, భోజన ఏర్పాట్లపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైన చోట ఐటీసీ వంటి సంస్థల కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల సహకారాన్ని పరిశీలించాలని సూచించారు. భద్రాచలం ఆలయానికి చేరుకునే రహదారుల అభివృద్ధికి సంబంధించి వంతెన నుంచి ఆలయం వరకు సుమారు రూ.14 కోట్లతో, బండ్ నుంచి ఆలయం వైపు సుమారు రూ.2.60 కోట్లతో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. రహదారుల అభివృద్ధి పనుల విషయంలో రోడ్లు, భవనాల శాఖ, దేవాదాయ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అవసరమైన అంచనాలను సిద్ధం చేసి పనులు నిర్ణీత సమయంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హామ్ రహదారుల మరమ్మతులు, ఒప్పందాలకు సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించి రహదారులపై ప్రయాణం సాఫీగా జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ భద్రాచలం పరిధిలో గోదావరి పుష్కర ఘాట్ల అభివృద్ధి పనులు, ప్రస్తుతం ఉన్న ఘాట్ల మరమ్మతులు, భక్తులకు కల్పించాల్సిన సదుపాయాలు, సురక్షితంగా స్నానాలు ఆచరించేందుకు చేపట్టాల్సిన ఏర్పాట్ల గురించి వివరించారు. ఘాట్ల వద్ద తాగునీరు, పారిశుధ్యం, మరుగుదొడ్లు, భక్తుల రాకపోకలకు అనువైన మార్గాలు, రద్దీ నియంత్రణకు అవసరమైన చర్యలను వివరించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ కొత్త ఘాట్ల నిర్మాణంతో పాటు ఇప్పటికే ఉన్న ఘాట్ల మరమ్మతులకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. దుమ్ముగూడెం ఘాట్ మరమ్మతులకు సంబంధించి ప్రతిపాదించిన పనులను వేగవంతం చేయాలని, బూర్గంపాడు మండలం మోతే వద్ద వీఐపీ ఘాట్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీకి అనుగుణంగా భద్రాచలం, బూర్గంపాడు, మణుగూరు, దుమ్ముగూడెం ప్రాంతాల్లో పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. సారపాకలోని పుష్కరవనం పరిధిలో ఉన్న సుమారు 75 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, అక్కడి చెట్లకు నష్టం కలగకుండా పార్కింగ్ ఏర్పాట్లకు అనువైన ప్రణాళిక రూపొందించాలన్నారు. అవసరమైతే సమీపంలోని అటవీ శాఖకు చెందిన యూకలిప్టస్ ప్లాంటేషన్, ఇతర ప్రభుత్వ భూములు, ప్రైవేటు వ్యవసాయ భూములను కూడా పరిశీలించాలని సూచించారు. గుర్తించిన స్థలాలు సరిపోకపోతే అదనంగా మరో 30 ఎకరాల వరకు అనువైన భూమిని గుర్తించడంతో పాటు సుమారు 10 ఎకరాలను ప్రత్యామ్నాయంగా సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రైవేటు భూములను పార్కింగ్ లేదా ఇతర అవసరాలకు వినియోగించాల్సి వస్తే రైతులతో ముందుగానే చర్చించి, పంట నష్టం, భూమి వినియోగానికి సంబంధించిన పరిహారంపై స్పష్టత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. చివరి నిమిషంలో భూ వివాదాలు తలెత్తకుండా కనీసం ఆరు నెలల ముందుగానే రైతులతో సంప్రదింపులు జరపాలన్నారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పార్కింగ్, హోల్డింగ్ ఏరియాలకు అనువైన స్థలాలను పరిశీలించాలని ఆదేశించారు.

జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ..

పుష్కరాల సందర్భంగా భద్రాచలం వచ్చే భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. వాహనాల ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా నిర్ధారించడంతో పాటు పార్కింగ్ స్థలాలు, హోల్డింగ్ ఏరియాలను గుర్తించి ట్రాఫిక్ నిర్వహణ చేపడతామన్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, పార్కింగ్ ప్రాంతాల్లో సూచిక బోర్డులు, రేడియం, ఎల్ఈడీ బోర్డులు ఏర్పాటు చేయాలని, రాత్రి వేళల్లోనూ రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల భద్రత, రద్దీ నియంత్రణకు అవసరమైన పోలీసు బందోబస్తు కల్పిస్తూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటామని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థవంతంగా నిర్వహించేందుకు కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. శ్రీరామనవమి ఉత్సవాల సమయంలో అనుసరించిన విధానాన్ని పరిగణనలోకి తీసుకొని క్యూలైన్ల నిర్వహణ, భక్తులకు తాగునీటి సరఫరా, రద్దీ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఘాట్ల వద్ద, క్యూలైన్లలో తాగునీటి పాయింట్లు ఏర్పాటు చేయాలని, ప్రసాదం కౌంటర్లు, ఫుడ్ కోర్టులు, అన్నదాన కేంద్రాలకు అనువైన స్థలాలను గుర్తించాలని తెలిపారు. భక్తులకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా భద్రాచలం, పర్ణశాల ప్రాంతాల్లో తాత్కాలిక ఆసుపత్రుల ఏర్పాటుకు అవసరమైన ప్రదేశాలను గుర్తించి, తగిన వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్సుతో కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. తాత్కాలిక వైద్య శిబిరాలు, ఇతర తాత్కాలిక సదుపాయాల ఏర్పాటుకు వాటర్‌ప్రూఫ్ టెంట్లను వినియోగించాలని సూచించారు. ఘాట్లు, పార్కింగ్ ప్రాంతాలు, భక్తుల రాకపోకల మార్గాలు, శానిటరీ కాంప్లెక్స్ వద్ద నిరంతర పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. చెత్త తొలగింపు, మరుగుదొడ్ల శుభ్రత, తాగునీటి సరఫరా నిరంతర పర్యవేక్షణకు ప్రత్యేక సిబ్బందిని నియమించాలన్నారు. పుష్కరాల సమయంలో భక్తులకు అవసరమైన వసతి సదుపాయాలు కల్పించేందుకు గెస్ట్‌హౌస్‌లను గుర్తించాలని, వీఐపీల వసతి, వాహనాల కాన్వాయ్ పార్కింగ్, పరిసరాల అభివృద్ధి, ల్యాండ్‌స్కేపింగ్ పనులపై కూడా దృష్టి సారించాలని సూచించారు. పుష్కరాల సందర్భంగా పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేలా అటవీ ప్రాంతాల్లో పర్యాటక కాటేజీలు, క్యాంపింగ్ సదుపాయాల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. దీనివల్ల పర్యాటకులకు అదనపు సదుపాయాలు కల్పించడంతో పాటు పర్యాటక ఆదాయం పెంపునకు అవకాశం ఉంటుందన్నారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలో చేపట్టాల్సిన పనులకు సంబంధించి సమగ్ర అంచనాలు సిద్ధం చేయాలని, కేవలం ప్రాథమిక అంచనాలతో కాకుండా అవసరమైన అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని వివరణాత్మక ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత కన్సల్టెంట్ ఏడు రోజుల్లో సమగ్ర నివేదిక అందించాలని, తాత్కాలిక సదుపాయాల ఏర్పాట్లకు సంబంధించి రెండు రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

ప్రతిపాదనలను ఉన్నతస్థాయిలో సమర్పించి అవసరమైన ఆమోదాలు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో డి పి ఓ అనూష,సీపీఓ సునీత , , దేవాదాయ శాఖ ఈఓ దామోదరరావు , నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, నీటిపారుదల, గ్రామీణ నీటి సరఫరా శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎన్పీడీసీఎల్ అధికారులు, జిల్లా రవాణా శాఖ అధికారులు, పర్యాటక శాఖ, ఆర్టీసీ, అగ్నిమాపక శాఖ, మత్స్యశాఖ, డీపీఆర్వో, సంబంధిత మండలాల తహసీల్దార్లు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

వైరా పోలీస్ స్టేషన్లో సీపీ ఆకస్మిక తనిఖీ

కేసుల దర్యాప్తులో జాప్యం ఉండొద్దు

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి..

పోలీస్ కమిషనర్ సునీల్ దత్



వైరా, నవంబర్ 12 (మనం న్యూస్): పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులకు సత్వర న్యాయం అందించడంతో పాటు, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన వైరా పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులు, సిబ్బంది పనితీరు, వివిధ కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించారు. పెండింగ్లో ఉన్న కేసులను నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేయాలని, ప్రతి కేసు పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. పోలీస్ స్టేషన్కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని స్పష్టం చేశారు. సీసీటీఎన్ఎస్లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగంపై ప్రత్యేక నిఘా పెట్టాలని, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. రహదారి భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేసి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు.

అనంతరం స్టేషన్కు వచ్చిన ఫిర్యాదుదారులతో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు.

పటిష్టమైన దర్యాప్తు, సాక్ష్యాధారాలతో నిందితులకు శిక్ష పడేలా చేయాలి

- **నేరసమీక్షా సమావేశంలో పోలీస్ కమిషనర్ సునీల్‌దత్**





ఖమ్మం, నవంబర్ 12(మనం బ్యూరో)ః పటిష్టమైన దర్యాప్తు, సాక్ష్యాధారాల సమర్పణతో నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా కృషి చేయాలని, తద్వారా బాధితులకు సత్వర, సముచిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పోలీస్ అధికారులకు ఆదేశించారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో గురువారం జరిగిన నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...కేసుల ట్రయల్ ప్రక్రియలో పోలీస్ అధికారులు ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని, విచారణ సమయంలో తలెత్తే లోపాలు, పొరపాట్లను గుర్తించి సరిదిద్దుకోవాలని సూచించారు.కేసులకు సంబంధించిన ఆధారాలు, సాక్ష్యాధారాలు ఈ-సాక్ష్య యాప్లో నిబంధనల ప్రకారం నమోదు చేసి, దర్యాప్తును త్వరితగతిన పూర్తి చేయాలి. నిర్ణీత గడువులో నాణ్యమైన ఛార్జీట్లు న్యాయస్థానాల్లో దాఖలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి చెప్పారు.

రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు అత్యంత కీలకమైన వైద్యం అందించి ప్రాణాలు రక్షించడంతో పాటు బాధిత కుటుంబంపై చికిత్స ఖర్చుల భారం తగ్గించేందుకు అమలవుతున్న పీఎం రహత్ పథకం ద్వారా ప్రభుత్వం గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందిస్తు విషయాన్ని ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అదేవిదంగా గంజాయి వినియోగదారులను పట్టుకున్న సందర్భాల్లో కేవలం వినియోగదారులకే పరిమితం కాకుండా, వారికి గంజాయి సరఫరా చేసిన వ్యక్తుల వివరాలను లోతుగా విచారించాలని, గంజాయి సరఫరా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులు, సరఫరా నెట్వర్క్, అసలు మూలాలను గుర్తించి, మూలాల నుంచే గంజాయి అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేలా సమగ్ర దర్యాప్తు చేపట్టాలని, నిందితులందరిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి జరిగే అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని,సరిహద్దు చెక్పోస్టుల వద్ద నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పదేపదే నేరాలకు పాల్పడుతున్న నేరస్థులను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి. వారి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సెకండ్హ్యాండ్ వాహనాల విక్రయదారుల వద్ద ఉన్న వాహనాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, యాజమాన్య బదిలీ పత్రాలు, ఇతర ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలి. సరైన పత్రాలు లేని వాహనాల విక్రయాలు జరగకుండా ఎన్ఫోర్స్మెంట్ చర్యలు చేపట్టాలన్నారు. పోలీస్ అధికారులు ఎన్ఫోర్స్మెంట్ చర్యలపై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపడుతూ అమలు తీరును సమీక్షించాలన్నారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రామానుజం, ఏసీపీలు రమణమూర్తి, తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, సాంబరాజు, నరసింహరావు, సర్వర్, సత్యనారాయణ, సిఐ లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికురాలిపైకి దూసుకెళ్లిన లారీ

నుజ్జునుజ్జయిన చెయ్యి



- **గతంలో తాత్కాలిక డ్రైవర్కు లక్షలు ఖర్చు పెట్టిన పంచాయతీ..**
- **ఇప్పుడు ఏం చేస్తుందో మరి...?**

భద్రాచలం, నవంబర్ 12 (మనం న్యూస్): పట్టణంలోని పాత మార్కెట్ సమీపంలో గురువారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో సామ్రాజ్యం అనే గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికురాలు తీవ్రంగా గాయపడ్డారు. విధుల్లో భాగంగా పనిచేస్తున్న ఆమె చేతిపై నుండి లారీ వెళ్లడంతో చెయ్యి ప్రధాన భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. రక్తపు మడుగులో విలవిలలాడిన బాధితురాలిని స్థానికులు తక్షణమే ఆసుపత్రికి తరలించారు.

కుటుంబ పోషణ కోసం పనికి చేరిన సామ్రాజ్యం

బాధితురాలు సామ్రాజ్యం భర్త కూడా భద్రాచలం గ్రామపంచాయతీలోనే పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. ఒక్కరి సంపాదనతో కుటుంబం గడవడం కష్టంగా మారడంతో, ఆర్థిక అవసరాల కోసం సామ్రాజ్యం కూడా కొద్ది నెలల క్రితమే పారిశుధ్య కార్మికురాలిగా పనికి చేరారు. ఆకలి తీర్చుకోవడానికి పనికి చేరిన కొద్ది నెలలకే ఇలా ఘోర ప్రమాదం జరగడంతో ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది.

పారిశుధ్య కార్మికురాలి పట్ల పంచాయతీ స్పందన ఉంటుందా..?

గతంలో కేవలం ఒక్క రోజు పనిచేసిన తాత్కాలిక డ్రైవర్ కోసం లక్షల రూపాయలు ఖర్చు పెట్టిన భద్రాచలం గ్రామపంచాయతీ పాలకులు, అధికారులు, పట్టణ పరిశుభ్రత కోసం శ్రమిస్తున్న సామ్రాజ్యం విషయంలో ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బాధితురాలికి కార్పొరేట్ స్థాయిలో మెరుగైన వైద్యం అందించడంతో పాటు, గ్రామపంచాయతీ నిధుల నుండి తగిన నష్టపరిహారం చెల్లించాలని కార్మిక సంఘాలు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

లేబర్ కార్డు ఉండి ఉంటే రూ.6.30 లక్షల భరోసా!

ప్రమాదానికి గురైన సామ్రాజ్యంకు కార్మిక శాఖ (లేబర్) కార్డు ఉండి ఉంటే, ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం నుండి రూ. 6 లక్షల 30 వేల ఆర్థిక సాయం (బీమా) అందేది. పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ లేబర్ కార్డులు ఇప్పించడంలో అధికారులు నిర్లక్ష్యం వహించడంతో, నేడు ఆ నిరుపేద కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆదాయ వేటలో జిసిసి, ఫారెస్ట్

- **ఖాళీ స్థలాలను వినియోగంలోకి తెస్తే ఆదాయం**
- **కోట్లు విలువ చేసే ప్రభుత్వ స్థలాలకు రక్షణ కరువు**
- **వాణిజ్య సముదాయాల నిర్మాణమే ఏకైక పరిష్కారమంటున్న పట్టణవాసులు**





భద్రాచలం, నవంబర్ 12 (మనం న్యూస్): ప్రభుత్వ శాఖలకు చెందిన విలువైన ఖాళీ స్థలాలను వ్యూహాత్మకంగా వినియోగించుకుంటే కబ్జాదారుల ఆటకట్టించడంతో పాటు, సంస్థలకు శాశ్వత ఆదాయ వనరులను సమకూర్చుకోవచ్చు. భద్రాచలం పట్టణంలో ఆర్టీసీ తన ఖాళీ స్థలంలో వాణిజ్య సముదాయాన్ని (షాపింగ్ కాంప్లెక్స్) నిర్మించి అదనపు ఆదాయాన్ని ఆర్జిస్తున్న తరహాలోనే, స్థానిక గిరిజన సహకార సంస్థ (జిసిసి) అటవీ శాఖలు కూడా అడుగులు వేయాలని స్థానికులు, మేధావులు కోరుతున్నారు.

కబ్జాల కోరల్లో కోట్లాది రూపాయల భూములు....

భద్రాచలం పట్టణ నడిబొడ్డున, ప్రధాన రహదారులకు ఆనుకుని జీసీసీ, అటవీ శాఖ కార్యాలయాలకు చెందిన విశాలమైన ఖాళీ స్థలాలు ఉన్నాయి. పట్టణంలో భూముల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో, ఈ ఖాళీ స్థలాలపై కబ్జాదారుల కన్ను పడింది. ఆయా శాఖల అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ స్థలాలు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. ఎప్పటికప్పుడు రక్షణ చర్యలు చేపట్టకపోతే, భవిష్యత్తులో ప్రభుత్వ అవసరాలకు సెంటు భూమి కూడా మిగిలే పరిస్థితి కనిపించడం లేదు.

అక్రమాలకు అడ్డుకట్ట.. ఆదాయానికి బాట

కేవలం ప్రహరీ గోడలు నిర్మించి వదిలేయడం వల్ల ఆక్రమణలను పూర్తిస్థాయిలో అడ్డుకోవడం సాధ్యం కావడం లేదు. దీనికి బదులుగా ఆర్టీసీ అనుసరించిన వాణిజ్య నమూనాను జీసీసీ, అటవీ శాఖలు అమలు చేస్తే బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని నిపుణులు సూచిస్తున్నారు.

శాశ్వత రక్షణ....

ఖాళీ స్థలాల్లో పక్కా భవనాలు, షాపింగ్ కాంప్లెక్సు నిర్మించడం వల్ల ఆక్రమణదారులకు ఎలాంటి అవకాశం ఉండదు. దుకాణాల అద్దెల రూపంలో ప్రతినెలా లక్షలాది రూపాయల స్థిర ఆదాయం లభిస్తుంది. ఈ నిధులను కార్యాలయాల నిర్వహణకు, అటవీ సంరక్షణకు, గిరిజన సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించుకోవచ్చు.

స్థానికులకు ఉపాధి...

భద్రాచలం నిత్యం భక్తులు, పర్యాటకులతో రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో ఇక్కడ వ్యాపారాలకు మంచి డిమాండ్ ఉంది. కాంప్లెక్స్ నిర్మాణం వల్ల స్థానిక చిరు వ్యాపారులకు, నిరుద్యోగ యువతకు జీవనోపాధి దొరుకుతుంది.

పట్టణ సుందరీకరణ...

పిచ్చి మొక్కలు, చెత్తాచెదారంతో అపరిశుభ్రంగా మారిన ఖాళీ స్థలాల స్థానంలో ఆధునిక భవనాలు రావడం వల్ల పట్టణ రూపురేఖలు కూడా మారుతాయి.

ఉన్నతాధికారులు దృష్టి సారించాలి...

భద్రాచలంలోని జీసీసీ, ఫారెస్ట్ ఖాళీ స్థలాల ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి, ముందుగా ఆ స్థలాలకు హద్దులు నిర్ణయించాలని స్థానికులు కోరుతున్నారు. అనంతరం ఆయా స్థలాల్లో వాణిజ్య సముదాయాల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి, నిధులు మంజూరు చేయించాలని ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు పట్టణ ప్రజలతో పాటు మనం దిన పత్రిక విజ్ఞప్తి చేస్తుంది.



పట్టభద్రుల ఎంఎల్సి అభ్యర్థిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్‌రెడ్డి

- **టిఆర్ఎస్(డి) రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ**
- **నిరుద్యోగుల గొంతుకగా నిలుస్తాః శంకర్ రెడ్డి**

ఖమ్మం, నవంబర్ 12(మనం న్యూస్)ః తెలంగాణ రక్షణ సమితి(డెమోక్రటిక్) నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎంఎల్సి అభ్యర్థిగా డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి పోటీ చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నరాల సత్యనారాయణ పేర్కొన్నారు. ఖమ్మంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బూసి రెడ్డి శంకర్ రెడ్డి తెలుగు రాష్ట్రాల రోటరీ ఇంటర్నేషనల్ సంస్థ గవర్నర్‌గా విశిష్ట సేవలందించారని తెలిపారు. కరోనా సమయంలో వేలాది మందికి రెండు నెలలపాటు నిరంతర అన్నదానం, ఆర్థిక సాయం చేసిన మానవతావాది అని పేర్కొన్నారు. ఎంఎల్సి అంటే పదవి కాదు,బాధ్యతగా తమ పార్టీ భావిస్తోందన్నారు. ఎంఎల్సి అభ్యర్థి బూసిరెడ్డి శంకర్ రెడ్డి మాట్లాడుతూ తనను గెలిపిస్తే నిరుద్యోగుల గొంతుకగా పనిచేస్తానన్నారు. ఉద్యోగుల హక్కులకోసం నిరంతరం పోరాడతామన్నారు. గ్రాడ్యుయేట్ల కోసం ప్రత్యేక కార్యాలయాలు, ప్రతి నియోజకవర్గంలో గ్రాడ్యుయేట్ల ప్రతినిధులకమిటీ, ప్రతి హామీ అమలుపై గ్రాడ్యుయేట్లకు నివేదిక అందిస్తామని అన్నారు. ఉద్యోగం, ఉపాధి, విద్య, ఆర్థికభరోసా తమ పార్టీ ధ్యేయమని పేర్కొన్నారు. తనను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు సాధు శంకర్, కొంపెల్లి ప్రదీప్ కుమార్, సాయం పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

అడ్వకేట్ పై ఎస్ఐ దాడి చేశారంటూ విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టిన లాయర్లు

- లేపాక్షి ఎస్సై తీరుపై హిందూపురం న్యాయవాదుల నిరసన



హిందూపురం, నవంబర్ 12 (మనం న్యూస్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లీగల్ టీం హిందూపురం అధ్యక్షుడు, న్యాయవాది వెంకట్రెడ్డిపై లేపాక్షి ఎస్ఐ నరేంద్ర దాడికి పాల్పడ్డారంటూ న్యాయవాదులు గురువారం తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. పోలీసుల తీరును నిరసిస్తూ హిందూపురం న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. చిలమత్తూరులో జరిగిన జడ్పీటిసి ఎంపిటిసి ఎన్నికల్లో నిబంధనలు ఉల్లంఘించారని, ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులను ప్రశ్నించారని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు,మాజీ ఎంపీపీ పురుషోత్తం రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. అనంతరం ఆయనను రెండు రోజుల క్రితం హిందూపురం కోర్టుకు తీసుకువచ్చే సమయంలో బెయిల్ పత్రాలపై సంతకాలు తీసుకునేందుకు న్యాయవాది వెంకటరెడ్డి అక్కడికి వెళ్లారు.ఈ క్రమంలో లేపాక్షి ఎస్ఐ నరేంద్ర తనను తోసివేయడంతో పాటు, బెయిల్కు సంబంధించిన దరఖాస్తులను లాక్కొని దూరంగా విసిరేశారని న్యాయవాదులు ఆరోపించారు.

ఈ ఘటనను తీవ్రంగా ఖండించిన హిందూపురం న్యాయవాదులు, పోలీసుల వ్యవహారశైలికి నిరసనగా విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ పోలీసు ఉన్నతాధికారులపై విమర్శలు చేశారు. ప్రతిపక్ష నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేస్తున్న నేపథ్యంలో, బాధితులకు చట్టపరమైన సహాయం అందిస్తూ న్యాయవాదులుగా తాము తమ విధులను నిర్వహిస్తున్నామని తెలిపారు.

రాజ్యాంగం కల్పించిన హక్కుల ప్రకారం ప్రతి ఒక్కరికీ న్యాయ సహాయం పొందే విధంగా తమ విధులు నిర్వహిస్తున్నామని తెలిపారు. లేపాక్షి ఎస్ఐ నరేంద్రపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ్ రెడ్డి. సీనియర్ న్యాయవాది,ఇందాద్ జూనియర్ న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.



నాలుగుచోట్ల నామినేషన్ల ప్రక్రియ

మహానంది, నవంబర్12,మనంన్యూస్: స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్లను దాఖలు చేసేందుకు మండలం లో నాలుగు చోట్ల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ మహమ్మద్ దౌల తెలిపారు. గురువారం అందుకు సంబందించిన ప్రక్రియను ప్రారంభించారు. గాజులపల్లి కేంద్రంలో గాజులపల్లి, గోపవరం, గాజులపల్లి ఆర్ ఎస్, తిమ్మాపురం లో తిమ్మాపురం, అబ్బీపురం, మహానంది, తమడపల్లి లో బుక్కాపురం, తమడపల్లి, బొల్లవరం ,అల్లినగరం, సీతారామాపురం లో మసీదు పురం,నందిపల్లె, సీతారామాపురం గ్రామాల అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయవచ్చునన్నారు.ఈ కార్యక్రమంలోడిప్యూటీ ఎంపీడీఓ భార్గవి లత,ఏ ఓ శ్రీనివాసరెడ్డి,పంచాయితీ కార్యదర్శులు,తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల చిన్నారిపై దాడి అమానుషం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ



పరిగి, నవంబర్ 12 (మనం న్యూస్): శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గం పరిగి మండలం ఊటుకూరు గ్రామంలో జామ కాయ కోస్తోందన్న కోపంతో బాలికపై మహిళ విచక్షణారహితంగా రాయితో దాడి చేసిన ఘటనపై రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత గురువారం ఆరా తీశారు. అనంతపురం ప్రభుత్వాసుపత్రికలో చికిత్స పొందుతున్న బాలికకు మెరుగైన వైద్యమందించాలని అక్కడి వైద్యులను ఫోన్ ఆదేశించినట్లు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె తెలిపారు. మంగళవారం సాయంత్రం పరిగి మండలం ఊటుకూరు గ్రామానికి చెందిన చిన్నారి అల్ఫియా తన ఇంటి సమీపంలో ఉన్న జామ చెట్టు నుంచి జామ పండు కోయడానికి ప్రయత్నించింది. అక్కడే ఉన్న మంజమ్మ ఆగ్రహంతో చిన్నారిపై రాయితో దాడి చేసిందని,తీవ్రంగా గాయపడిన బాలికను ఆమె తల్లి, స్థానికులు ఆసుపత్రికి తరలించారన్నారు. ప్రస్తుతం బాలికకు అనంతపురం ప్రభుత్వాసుపత్రికలో చికిత్స అందజేస్తున్నారని తెలియగానే, మంత్రి సవిత అక్కడి వైద్యులతో మాట్లాడారు. బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యమందించాలని ఆదేశించారు. అనంతరం బాలిక తల్లిదండ్రులతోనూ మంత్రి సవిత ఫోన్లో మాట్లాడి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. జామ పండు కోసం చిన్నారిపై రాయితో దాడి చేయడం అమానుషమని ఆవేదన వ్యక్తంచేశారు. దాడి చేసిన మహిళపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. చిన్న చిన్న విషయాలకే విచక్షణ మరిచిపోయి, దాడులకు దిగడం సరికాదన్నారు. ఇటువంటి ఘటనల వల్ల బాధితులు, నిందితులు కూడా తమ విలువైన జీవితాన్ని కోల్పోయే ప్రమాదముందని ప్రశాంతమైన జీవనమే శ్రేయస్కరమని మంత్రి సవిత తెలిపారు.

గ్రామాల్లో గొడవలకు తావులేకుండా పోలీసుల అప్రమత్తత



అనంతపురం, నవంబర్ 12(మనం బ్యూరో): త్వరలో జరుగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో... సున్నిత గ్రామాలు/కాలనీలలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అనంతపురం జిల్లా పోలీసులు అప్రమత్తమయ్యారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు పోలీసులు గ్రామాల్లో విస్తృతంగా ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ప్రజలకు భద్రతపై భరోసా కల్పించేలా విజిబుల్ పోలీసింగ్కు ప్రాధాన్యం ఇస్తున్నారు. సున్నితమైన, సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలతో మాట్లాడుతున్నారు. గ్రామ సభలు నిర్వహించి శాంతిభద్రతల పరిరక్షణ, ఎన్నికల అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు. పాత కక్షలు, రాజకీయ విభేదాలను పక్కనపెట్టి సంయమనం పాటించాలని ప్రజలకు సూచిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం వివాదాలు, ఘర్షణలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు. గ్రామాల్లో ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. ప్రతి గ్రామంలో ప్రశాంతత, భద్రత నెలకొల్పి ప్రజలకు నిర్భయ వాతావరణం కల్పించడమే పోలీసుల ప్రధాన లక్ష్యమని అధికారులు స్పష్టం చేశారు.

19న ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎన్నికలు

యు.కొత్తపల్లి నవంబర్ 12 (మనం న్యూస్): మండల పరిషత్ అధ్యక్షుడు (ఎంపీపీ), ఉపాధ్యక్ష పదవుల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని ఎంపీడీవో లక్ష్మీరెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఎంపీపీ, ఉపాధ్యక్ష ఎన్నికలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 10వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్ ప్రకారం ఎన్నికల ప్రక్రియ జరగనుందని పేర్కొన్నారు.

ఈ నెల 14వ తేదీలోగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రత్యేక సమావేశం నోటీసులు సభ్యులకు జారీ చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 19వ తేదీన ఉదయం 10 గంటలలోపు కోఆప్షన్ సభ్యుడి నామినేషన్ల స్వీకరణ, ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలలోపు నామినేషన్ల పరిశీలన చేపడతారని వివరించారు. మధ్యాహ్నం 12 గంటలకు అర్హులైన అభ్యర్థుల జాబితా ప్రకటించి, ఒంటిగంటలోపు నామినేషన్ల ఉపసంహరణకు అవకాశం కల్పిస్తారని తెలిపారు. మధ్యాహ్నం ఒంటిగంటకు కోఆప్షన్ సభ్యుడి ఎన్నిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహిస్తారని ఎంపీడీవో తెలిపారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం కోరం తప్పనిసరిగా ఉండాలని, సభ్యుల హాజరు ఆధారంగా ఎన్నికల ప్రక్రియ నిర్వహిస్తారని వివరించారు. ఎన్నికలు ప్రశాంతంగా, నిబంధనల ప్రకారం జరిగేలా ఏర్పాట్లు చేపట్టనున్నట్లు తెలిపారు.

జనగణనను సమర్థవంతంగా పూర్తి చేయాలి



కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): జనగణన-2027లో భాగంగా రెండో దశలో నిర్వహించనున్న జనాభా గణన (పాపులేషన్ ఎన్యుమరేషన్) ప్రక్రియను కర్నూలు నగరంలో పకడ్బందీగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు ఆదేశించారు. గురువారం స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనంలో మాస్టర్ ట్రైనర్లకు నిర్వహించే శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. జనవరి 10వ తేదీ నుంచి 24వ తేదీ వరకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్) ప్రక్రియకు అవకాశం ఉంటుందని, జనవరి 25వ తేదీ నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇంటింటి జనాభా గణన నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మార్చి 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు పునఃపరిశీలన ప్రక్రియ కొనసాగుతుందన్నారు.

మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన చిన్నారిలను అభినందించిన జిల్లా ఎస్పీ

- జాతీయ క్రీడల్లో సత్తా చాటిన అనంతపురం నాల్గవ పట్టణ కానిస్టేబుల్ కుమారుడు
- హర్యానాలో జరిగిన 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం.. లాంగ్జంప్లో రజత పతకం
- 'మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించిన మరో చిన్నారి
- చిన్నారుల ప్రతిభకు ప్రోత్సాహం అందించిన జిల్లా ఎస్పీ పి. జగదీష్



అనంతపురం, నవంబర్ 12 : మనం బ్యూరో: అనంతపురం ఫోర్ట్ పోలీస్టేషన్లో పనిచేస్తున్న కానిస్టేబుల్ పి. హిమావంత్రెడ్డి కుమారుడు హర్యానాలోని రోతక్లో నిర్వహించిన ఒలింపిక్ నేషనల్ గేమ్స్ 2026-27లో ప్రతిభ చాటాడు. 200 మీటర్ల పరుగు పందెంలో బంగారు పతకం, లాంగ్జంప్లో రజత పతకం సాధించి జాతీయ స్థాయిలో సత్తా చాటాడు.

అదేవిధంగా హిమావంత్రెడ్డి కుమార్తె బానుజ తిరుపతిలో ఇటీవల నిర్వహించిన 'నాట్యనీరాజనం-2' కార్యక్రమంలో ప్రతిభ కనబరిచి 'మెరిట్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించింది.

ఇద్దరూ తమ ప్రతిభతో అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం విశేషం. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి జిల్లా ఎస్పీ పి. జగదీష్ ని కలిశారు. విద్యార్థుల ప్రతిభను అభినందించిన ఎస్పీ వారికి పతకాలు ధరింపజేసి, భవిష్యత్లో మరిన్ని విజయాలు సాధించాలని ప్రోత్సహించారు.

పోలీసు విధులు నిర్వహిస్తూ పిల్లల ప్రతిభను ప్రోత్సహిస్తున్న హిమావంత్రెడ్డి కుటుంబాన్ని ఎస్పీ అభినందించారు. క్రీడలు, కళలు, విద్య తదితర రంగాల్లో పిల్లలు రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన ఈ చిన్నారులు అంతర్జాతీయ వేదికపై కూడా విజయాలు సాధించి అనంతపురం జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో పోలీసుల ఫ్లాగ్ మార్చ్



హిందూపురం, నవంబరు 12 (మనం న్యూస్): త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ రవిబాబు పర్యవేక్షణలో ప్రతిష్టమైన పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నారు.

ఈ నేపథ్యంలో హిందూపురం రూరల్ సర్కిల్ సీఐ కె.జనార్ధన్ ఆధ్వర్యంలో లేపాక్షి ఎస్ఐ, నరేంద్ర పోలీసు సిబ్బందితో కలిసి లేపాక్షి పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయనిపల్లి, ఉప్పరపల్లి గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమై ఎన్నికల సమయంలో శాంతిభద్రతలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకతపై సి.ఐ.జనార్ధన్ అవగాహన గురువారం కల్పించారు.ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి గొడవలు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కొనసాగించేందుకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సీ ఐ కోరారు.



కౌన్సిల్ హాల్లో ముమ్మరంగా మరమ్మత్తులు

కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): ఈ నెల 23న కర్నూలు నగరపాలక సంస్థ పాలకవర్గం కొలువుదీరనున్న నేపథ్యంలో స్థానిక ఎస్బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నగరపాలక సంస్థ సమావేశ భవనం (కౌన్సిల్ హాల్)లో ఏర్పాట్లను ముమ్మరం చేయాలని కమిషనర్ చల్లా ఓబులేసు అధికారులను ఆదేశించారు. గురువారం కౌన్సిల్ హాల్లో జరుగుతున్న మరమ్మత్తు పనులను ఆయన పరిశీలించి, పనుల పురోగతిపై ఆరా తీశారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. కౌన్సిల్ హాల్లో కుర్చీలు, డోర్లు, పీఓపీ పనులతో పాటు టాయిలెట్లలో ఉన్న మరమ్మత్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పాలకవర్గ సమావేశాల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు.కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, డీఈఈ పవన్ కుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి జలాలను సాగుకు వినియోగించరాదు

- రైతులకు కమిషనర్ చల్లా ఓబులేసు విజ్ఞప్తి
- జలచౌర్యానికి పాల్పడితే మోటార్లు స్వాధీనం
- వేసవిని దృష్టిలో ఉంచుకొని ముందస్తు చర్యలు



కర్నూల్ కార్పొరేషన్ (మనం న్యూస్): కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం సుంకేసుల జలాశయం నుంచి మునగాలపాడు ఎస్.ఎస్. ట్యాంకుకు కేసీ కెనాల్ ద్వారా తరలిస్తున్న నీటిని సాగు అవసరాలకు మళ్లించవద్దని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు రైతులకు విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అక్రమంగా నీటిని మళ్లించి జలచౌర్యానికి పాల్పడితే మోటార్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు చట్టపరమైన ఇతర చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఆయన మునగాలపాడు ఎస్.ఎస్. ట్యాంకు, సుంకేసుల జలాశయాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని నగరంలో తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జలవనరుల శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ నగర ప్రజల అవసరాలకు సరిపడా తాగునీటిని ముందుగానే నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే సుంకేసుల నుంచి మునగాలపాడు ఎస్.ఎస్. ట్యాంకు వరకు రూ.82 కోట్లతో నిర్మిస్తున్న పైప్లైన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో ఎస్ఈ రమణమూర్తి, ఎంఈ మనోహర్ రెడ్డి, ఏఈ జనార్ధన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్ ఏ 1పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి



మహానంది, నవంబర్12,మనంన్యూస్: మహానంది మండలం గాజులపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తున్న ఎస్ ఏ1 పరీక్షలను డి ఈ ఓ జనార్దన్ రెడ్డి పరిశీలించారు. గురువారం ఆకస్మికంగా తనికిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరంలో నిర్వహించే ఎస్ ఏ 1 పరీక్షలు భవిష్యత్తులో జరిగే పబ్లిక్ పరీక్షల వలె అత్యంత పారదర్శకంగా,పగడ్బందీగా నిర్వహించాలని తెలిపారు.అనంతరం విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పబ్లిక్ పరీక్షలో ఉన్నతమైన మార్కులు సాధించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో చర్చించారు.

సెయింట్ జోసెఫ్ స్కూల్ వ్యవహారంపై విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లాలి

- పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి..
- ఎంఈఓపై చర్యలు తీసుకోవాలి
- బీజేవైఎం నేత హేమేష్ డిమాండ్



గూడూరు, నవంబర్ 12 (మనం న్యూస్): గూడూరు మండలం కె. నాగలాపురం గ్రామంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాల వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని బీజేవైఎం నాయకుడు హేమేష్ డిమాండ్ చేశారు. ఈ సమస్యను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లాలని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కోరారు.

ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పాఠశాల యాజమాన్యంపై పలు ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తూ పేద విద్యార్థుల తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నారని హేమేష్ ఆరోపించారు.

కూటమి ప్రభుత్వంలో గూడూరులో అభివృద్ధి పనులకు వేగం



గూడూరు, నవంబర్ 12 (మనం న్యూస్): కూటమి ప్రభుత్వంలో గూడూరు నగర పంచాయతీ పరిధిలో అభివృద్ధి పనులు వేగవంతం అవుతున్నాయని బీజేపీ నాయకులు గజేంద్ర గోపాల్, నూతన చైర్ పర్సన్ డమాం సునీత భర్త డమాం సురేష్ తెలిపారు. గురువారం గూడూరు పట్టణంలో చేపడుతున్న తాగునీటి పైపులైన్ పనులను వారు పరిశీలించారు. నగర పంచాయతీ చైర్పర్సన్గా డమాం సునీత ఎంపికైన నేపథ్యంలో, ప్రమాణ స్వీకారం జరగకముందే ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించినట్లు వారు పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు తాగునీటి సమస్య పరిష్కారానికి పైపులైన్ ఏర్పాటు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ, పట్టణ అభివృద్ధికి కృషి చేస్తామని వారు పేర్కొన్నారు. తాగునీటి సరఫరా మెరుగుపడేలా సంబంధిత పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆకాంక్షించారు.

బంతి గతంలోలా ఎక్కువగా స్వింగ్ కావడం లేదు

- బౌలర్లు నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి
- అబుదాబీ టీ10లో డాట్ బాల్స్ కూడా కీలకమేనని అభిప్రాయం
- ట్రెంట్ బౌల్ట్

హైదరాబాద్, నవంబర్ 12(మనంన్యూస్): ఆధునిక వైట్బాల్ క్రికెట్లో బ్యాటర్ల దూకుడు పెరుగుతున్న నేపథ్యంలో ఫాస్ట్ బౌలర్లు తమ బౌలింగ్ శైలిని ఎప్పటికప్పుడు మార్చుకోవాల్సిన అవసరం ఉందని న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలింగ్ దిగ్గజం ట్రెంట్ బౌల్ట్ అభిప్రాయపడ్డాడు. గతంలో మాదిరిగా బంతి ఎక్కువగా స్వింగ్ కాకపోవడం వల్ల ఫాస్ట్ బౌలర్లకు సవాళ్లు పెరిగాయని ఆయన పేర్కొన్నాడు. జాయెద్ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న 2026 అబుదాబీ టీ10 టోర్నీలో ఎమిరేట్స్ ఈగల్స్ తరపున ఆడుతున్న బౌల్ట్, ఫాస్ట్ బౌలింగ్లో వచ్చిన మార్పులు, కొత్త బంతితో బౌలింగ్ చేసే నిపుణుడిగా తన ప్రయాణం నుంచి డెత్ ఓవర్లలో సమర్థవంతమైన బౌలర్గా మారిన తీరు, అలాగే టీ10 వంటి స్వల్ప ఫార్మాట్లో ఒకటి రెండు డాట్ బాల్స్ కూడా ఎంత కీలకమో వివరించాడు. ఎమిరేట్స్ ఈగల్స్ విజయంలో కీలక పాత్ర పోషించిన అనంతరం బౌల్ట్ మాట్లాడుతూ, 'బంతి గతంలో మాదిరిగా ఇప్పుడు అంతగా స్వింగ్ కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా భారీ స్కోర్లు నమోదవుతున్నాయి. పదేళ్ల క్రితం ఇలాంటి స్కోర్లు నమోదవుతాయని మనం ఊహించామా? కచ్చితంగా లేదు. అయితే భవిష్యత్తులో ఈ ఆట ఎటువైపు వెళ్తుందో చెప్పలేం' అని పేర్కొన్నాడు. కొత్త బంతితో అద్భుతంగా స్వింగ్ రాబడుతూ ప్రపంచంలోని అత్యుత్తమ బ్యాటర్లను ఇబ్బంది పెట్టిన 37 ఏళ్ల బౌల్ట్, సంప్రదాయ స్వింగ్ బౌలింగ్కు ప్రస్తుతం లభిస్తున్న అవకాశాలు తగ్గాయని అంగీకరించాడు. 'ప్రస్తుత వైట్బాల్ క్రికెట్లో బంతి స్వింగ్ అయ్యే సమయం చాలా తక్కువగా ఉంటోంది. క్రికెట్ను నిరంతరం ఆడుతున్నప్పుడు బౌలర్లు కొత్త మార్గాలను అన్వేషించాలి. తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలి. కాలానికి అనుగుణంగా మారుతూ మెరుగైన ఆటగాళ్లుగా ఎదగాలి. ప్రతి ప్రయత్నం విజయవంతం కాకపోవచ్చు. అయినప్పటికీ డెత్ ఓవర్లలో కొత్త తరహా బంతులను ప్రయోగిస్తూ బ్యాటర్ కంటే ఒక అడుగు ముందుండేందుకు ప్రయత్నిస్తాను' అని వివరించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్లో భారీ స్కోర్లు, అసాధారణ వ్యక్తిగత బ్యాటింగ్ ప్రదర్శనలు పెరుగుతున్న తరుణంలో బౌలర్లు తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకోవడానికి కొత్త మార్గాలను అనుసరించాల్సిన అవసరం



ఉందని బౌల్ట్ అభిప్రాయపడ్డాడు. అయితే, తనకు మొదట గుర్తింపు తెచ్చిన స్వింగ్ బౌలింగ్పై తనకున్న ప్రేమ ఏమాత్రం తగ్గలేదని స్పష్టం చేశాడు. 'స్వింగ్ బౌలింగ్పైనే నాకు మొదటి నుంచి ప్రత్యేకమైన ఇష్టం. బంతిని రెండు వైపులా అద్భుతంగా స్వింగ్ చేయగల బౌలర్లను నేను ఎప్పుడూ ఆదర్శంగా భావిస్తాను. బంతి స్వింగ్ అయ్యే అవకాశం వచ్చినప్పుడు దాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవడానికి ప్రయత్నిస్తాను. నా నైపుణ్యాలను మరోసారి ప్రదర్శించే అవకాశాలు ఇంకా వస్తాయని ఆశిస్తున్నాను' అని చెప్పాడు. అబుదాబీ టీ10 వంటి ఫార్మాట్లో బౌలర్ల విజయాన్ని కేవలం వికెట్ల ఆధారంగానే అంచనా వేయలేమని బౌల్ట్ పేర్కొన్నాడు. ఒక్కో జట్టుకు కేవలం 60 బంతులే లభించే ఈ ఫార్మాట్లో ఒకటి రెండు డాట్ బాల్స్ కూడా మ్యాచ్ గమనాన్ని మార్చగలవని తెలిపాడు. '60 బంతుల ఆటలో ఒకటి రెండు డాట్ బాల్స్ కూడా చాలా కీలక పాత్ర పోషిస్తాయి' అని బౌల్ట్ అన్నాడు. మైదానంలో ఉత్సాహభరితమైన సంబరాలకు పేరుగాంచిన బౌల్ట్, బ్యాటర్ను నియంత్రించిన తర్వాత అతిగా సంబరాలు చేసుకోకపోవడానికి గల కారణాన్ని కూడా వివరించాడు.

'ఎక్కువగా సంబరాలు చేసుకోకూడదని ప్రయత్నిస్తాను. ఎందుకంటే నేను ఒకటి లేదా రెండు సిక్సర్లు మాత్రమే దూరంలో ఉన్నానని నాకు తెలుసు. ఆ తర్వాత మ్యాచ్ పరిస్థితి పూర్తిగా మారిపోవచ్చు' అని సరదాగా వ్యాఖ్యానించాడు. ప్రపంచవ్యాప్తంగా అనేక ఫ్రాంచైజీ టోర్నీల్లో ఆడిన అనుభవం ఉన్న బౌల్ట్, ఫ్రాంచైజీ క్రికెట్లోని అన్ని పరిస్థితులను ఇప్పుడు పూర్తిగా అర్థం చేసుకున్నారా అని ప్రశ్నించగా వినయంగా స్పందించాడు. 'అస్సలు కాదు. కొన్ని రోజులు నాకు అనుకూలంగా సాగాయి. మరికొన్ని రోజులు ఆశించిన ఫలితాలు రాలేదు. చాలా కాలంగా ఈ ఆటలో కొనసాగుతున్నందుకు అదృష్టంగా భావిస్తున్నాను. క్రికెట్ నాకు ఎన్నో మధురమైన అనుభవాలను ఇచ్చింది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాలకు వెళ్లి నాకు ఇష్టమైన ఆట ఆడే అవకాశాన్ని కల్పించింది' అని తెలిపాడు. వివిధ ఫ్రాంచైజీ టోర్నీల్లో పరిచయమున్న ఆటగాళ్లతో మళ్లీ తలపడటంలోని ఆనందాన్ని కూడా బౌల్ట్ పంచుకున్నాడు. ఇటీవల వెస్టిండీస్ విధ్వంసకర బ్యాటర్, ఐపీఎల్ ఫ్రాంచైజీ ముంబై ఇండియన్స్కు కొత్తగా నియమితులైన ప్రధాన కోచ్ కీరన్ పొలార్డ్ తలపడిన విషయాన్ని ప్రస్తావించాడు. 2026 సీజన్లో బౌల్ట్ కూడా ముంబై ఇండియన్స్ జట్టులో భాగంగా ఉన్నాడు. 'వారిలో ఒకరు నా కోచ్ కూడా కావచ్చు (కీరన్ పొలార్డ్). ఆయన నా కోచ్ అవుతారని ఆశిస్తున్నాను. ఆయనకు గుర్తుండిపోయేలా ఒక సందర్భాన్ని గుర్తుచేయాలనుకున్నాను' అంటూ బౌల్ట్ నవ్వుతూ చెప్పాడు. 'నేను కచ్చితంగా ఆయన వికెట్ తీయాలని కోరుకున్నాను. అయితే టీ10 ఫార్మాట్లో ఏదైనా జరగవచ్చు. భయం లేకుండా ఆడే బ్యాటర్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. వారు ఎవరైనా సరే బౌలర్లపై ఆధిపత్యం సాధించాలనే లక్ష్యంతోనే బరిలోకి దిగుతారు' అని వివరించాడు. బ్యాటర్ల ఆధిపత్యం పెరుగుతున్నప్పటికీ, నాణ్యమైన కొత్త బంతి బౌలింగ్కు క్రికెట్లో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుందని బౌల్ట్ విశ్వసిస్తున్నాడు. ప్రస్తుత క్రికెట్లో అత్యుత్తమ స్వింగ్ బౌలర్ ఎవరని అడగ్గా, తన స్వదేశానికి చెందిన మాట్ హెన్రీ పేరును ప్రస్తావించాడు. 'నేను ఇప్పటికీ న్యూజిలాండ్కు చెందిన మాట్ హెన్రీనే అత్యుత్తమంగా భావిస్తాను. ఎలాంటి పిచ్లైనా బంతిని రెండు వైపులా స్వింగ్ చేయగల సామర్థ్యం ఆయనకు ఉంది. కొత్త బంతిని అందిస్తే ఆయన బౌలింగ్ చూడాలని నాకు ఉంటుంది' అని పేర్కొన్నాడు. కొత్త ఫార్మాట్లు, బ్యాటర్లలో వస్తున్న మార్పులకు అనుగుణంగా తన ఆటను మార్చుకుంటున్నప్పటికీ క్రికెట్ తనకున్న ఆసక్తి ఏమాత్రం తగ్గలేదని బౌల్ట్ తెలిపాడు. 'ముఖంపై చిరునవ్వుతో ఆడటమే నా ఆటను ఆస్వాదించే విధానం' అని చెప్పాడు. ఎమిరేట్స్ ఈగల్స్ విజయం సాధించిన అనంతరం బౌల్ట్ సంతోషం వ్యక్తం చేశాడు. 'ఈరోజు మ్యాచ్లో మేము విజయం సాధించడం ఆనందంగా ఉంది. ఎమిరేట్స్ ఈగల్స్ తరపున మరో కీలక మ్యాచ్లో గెలుపు సాధించగలిగాం' అని పేర్కొన్నాడు. ఆరు ఫ్రాంచైజీలు పాల్గొంటున్న అబుదాబీ టీ10 పదో సీజన్ జాయెద్ క్రికెట్ స్టేడియంలో నవంబర్ 20 వరకు కొనసాగనుంది.

ఏఐతో పదేళ్లలో క్యాన్సర్‌కు అంతం

ఆంథ్రోపిక్ సీఈవో అమోడెయ్

వాషింగ్టన్, నవంబర్ 12 : కృత్రిమ మేధ వైద్య రంగంలో అద్భుతాలు సృష్టిస్తుందని, అందులో భాగంగా క్యాన్సర్, అల్జీమర్స్, హృద్రోగం, మానసిక సమస్యలు వంటివి మరో పదేళ్లలో అంతరించిపోతాయని ఆంథ్రోపిక్ సంస్థ సీఈవో డారియో అమోడెయ్ ఆశాభావం వ్యక్తంజేశారు. ''కృత్రిమ మేధ జీవశాస్త్ర పరిశోధనల్ని, ఔషధ ఆవిష్కరణల్ని, వైద్యరంగ విజయాలను ఊహించనంత స్థాయిలో వేగవంతం చేస్తుంది. మరో దశాబ్దం లోగా క్యాన్సర్, అల్జీమర్స్, హృద్రోగం, మానసిక సమస్యలు అంతరించి గతకాల జ్ఞాపకాలుగా మిగిలిపోతాయి. అదే జరిగితే ఎలా ఉంటుందో ఊహించండి. శతాబ్దాలుగా మానవాళిని పీడించిన సమస్యలకు మనం పరిష్కారం చూపినట్టవుతుంది'' అని అమోడెయ్ అన్నారు.




ఇది కేవలం అమోడెయ్ ఒక్కరి అభిప్రాయమే కాదు. కృత్రిమ మేధ రంగంలో దిగ్గజాలుగా పేరు గడించిన ఎలాన్ మస్క్, డెమిస్ హస్సాబిస్లదీ ఇదే అభిప్రాయం. పదేళ్లలో జరిగే ఔషధ పరిశోధనలు కృత్రిమ మేధ సాయంతో కొన్ని వారాల్లో పూర్తి చేయవచ్చు. ఇది పదేళ్లలో అన్ని వ్యాధులకూ పరిష్కారం చూపుతుందని హస్సాబిస్ చెబుతున్నారు. 20 కోట్ల ప్రొటీన్ల నిర్మాణాలను నిర్ధారించిన ఆల్ఫాఫోల్ వంటి కృత్రిమమేధ ఆవిష్కరణలు వివిధ రకాల ప్రొటీన్ల నిర్మాణాలను, అవి పనిచేసే విధానాన్ని, వ్యాధి దశలో వాటిలో కలిగే పరివర్తనలను విడమర్చి చెబుతున్నాయి. సాధారణ పద్ధతుల్లో ప్రొటీన్ నిర్మాణాన్ని నిర్ధారించేందుకు కొన్ని నెలల నుంచి కొన్ని సంవత్సరాల వరకూ పడుతుంది. అలాంటిది ఆల్ఫాఫోల్ కొన్ని నిమిషాల్లో ప్రొటీన్ 3డీ ఆకృతుల్ని మన ముందుంచుతోంది. ఆల్ఫాఫోల్ అనేది ఒక గొప్ప శాస్త్రీయ విజయమని హస్సాబిస్ వ్యాఖ్యానిస్తున్నారు. అందుకే కృత్రిమ మేధ మరో పదేళ్లలో క్యాన్సర్ వంటి వ్యాధులకు పరిష్కారం చూపుతుందని అమోడెయ్ చెబుతున్నారు. అయితే ఔషధ ఉత్పత్తి సంస్థలు ఈ వాదనను తిరస్కరిస్తున్నాయి. వ్యాధులు పదేళ్లలో అంతమవుతాయనడం అత్యుత్సాహమేనంటున్నాయి.

కాప్ శిఖరాగ్ర సదస్సుకు కీలక దేశాధినేతల గైర్హాజరు

అంటల్యా, నవంబర్ 12 : ఐక్యరాజ్యసమితి వాతావరణ సదస్సు 'కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్ - 31' (కాప్-31)లో భాగంగా పర్యావరణ మార్పులపై ప్రపంచ దేశాల అధినేతలు బుధవారం చర్చలు ప్రారంభించారు. నేపాల్, భూటాన్లలో హిమనీనదాల విస్ఫోటం కారణంగా సంభవించిన తీవ్ర వరదలు, శీతల ప్రాంతమైన యూరప్లో విపరీతంగా పెరిగిపోయిన వేసవి ఎండలు, ఎల్నినో ప్రభావం వంటి వాతావరణ మార్పుల నేపథ్యంలో భూతాపాన్ని నియంత్రించేందుకు మరో ఒప్పందం కుదుర్చుకునే దిశగా నేతలు చర్చలు జరుపుతున్నారు. అయితే ప్రపంచంలో అత్యధికంగా వాతావరణ కాలుష్యానికి కారణమైన అమెరికా, చైనా, భారత్ల అధినేతలు కాప్-31 శిఖరాగ్ర సదస్సుకు గైర్హాజరయ్యారు. సదస్సుకు హాజరైన 70 మందికి పైగా దేశాధినేతలు, ప్రభుత్వ అధికారులు, ఐక్యరాజ్యసమితి అధికారులు వాతావరణ మార్పు నియంత్రణకు కఠిన చర్యలు అవసరమని చెబుతున్నారు. పెరిగిపోతున్న కాలుష్య నేపథ్యంలో భూతాపం పారిశ్రామికీకరణకు పూర్వంనాటి పరిస్థితితో పోలిస్తే 1.5 డిగ్రీలు దాటిపోనుందని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఈ సదస్సు ప్రాధాన్యత సంతరించుకుంది.

ఏఐలో ఎన్‌విడియా ఎందుకంత పవర్‌ఫుల్..?

వాషింగ్టన్, నవంబర్ 12 : కృత్రిమ మేధా డేటా సెంటర్లకు అవసరమైన అత్యంత శక్తిమంతమైన చిప్లను అందించడంలో ఎన్విడియా ప్రపంచంలో అగ్రగామిగా ఉంది. ఈ రంగంలో ఏకంగా 80శాతానికి పైగా మార్కెట్ వాటాను కలిగిఉంది. తొలుత ఈ సంస్థ వీడియో గేమ్స్ కోసం గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల జీపీయూలను తయారు చేసేది. ఇప్పుడు ఏఐ కోసం అత్యాధునిక జీపీయూలను తయారు చేస్తోంది. డేటా సెంటర్లు మొదలుకొని ఏఐ మోడల్స్కు శిక్షణ ఇవ్వడం వరకు ఎన్విడియా చిప్లపై ఆధారం. ఆ సంస్థ చిప్స్ను రూపొందించకుంటే మొత్తం ఏఐ పరిశ్రమే ప్రమాదంలో పడుతుంది. అసలు ఏఐ ప్రపంచంలో ఎన్విడియా ఎందుకంత శక్తిమంతంగా మారింది?దీనిపై చైనా ఎందుకు కన్నేసింది? ఎన్విడియా పతనమైతే ఏఐ పరిశ్రమపై ఎలాంటి ప్రభావం పడుతోందన్న ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.



హర్మూజ్ కాదు.. ఈ సముద్ర మార్గమే అత్యంత ప్రాణాంతకం!

టొప్రోన్, నవంబర్ 12 : అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలోని నౌకలను ఇరాన్ లక్ష్యంగా చేసుకుంటోంది. ఈ దాడుల్లో విధి నిర్వహణలో ఉన్న మర్చెంట్నేవీ నావికులు చనిపోతున్నారు. అయితే.. ఈ ఏడాది ఓ సముద్ర మార్గం హర్మూజ్ను మించి ప్రమాదకరంగా మారింది. అదే నల్ల సముద్రం. ఉక్రెయిన్- రష్యా యుద్ధం తీవ్రమైన వేళ.. ఈ ఏడాది హర్మూజ్లో జరిగిన దాడుల కన్నా.. నల్ల సముద్రంలో జరిగిన దాడుల వల్లే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయినట్లు ఓ అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొంది.

సముద్ర భద్రతా సంస్థ 'ఆంబ్రే'గణాంకాల ప్రకారం.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు నల్ల సముద్రంలో 300కుపైగా దాడులు జరిగాయి. 30 మందికిపైగా నావికులు మృతి చెందారు. మరో 20 మందికి పైగా గల్లంతయ్యారు. అదే హర్మూజ్ సహా పశ్చిమాసియా ప్రాంతంలో నౌకలపై జరిగిన 130 దాడుల్లో.. 25 మంది ప్రాణాలు కోల్పోయారు.



ఇకపై కటకటాలే

మా సిబ్బందిపై దాడులు.. సహించం
ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులపై కటకటాలే
ఉద్యోగులు తప్పుజేస్తే? ఫిర్యాదుజేయండి
వారిని కాపాడుకోవడం ప్రజల బాధ్యత
ఆత్మహత్య చేసుకున్న డ్రైవర్ శంకర్ గౌడ్ కుమారుడికి ఉద్యోగం
నియామక పత్రం అందజేసిన మంత్రి పొన్నం

హైదరాబాద్, మనం ప్రతినిధి : తెలంగాణలో ఇకనుంచి ఆర్టీసీ ఉద్యోగులపై భౌతిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఉద్యోగులు ఎక్కడైనా తప్పుగా ప్రవర్తిస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలే తప్ప దాడులకు దిగవద్దని ప్రజలకు సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ఆర్టీసీ బాధ్యత అయితే, ఉద్యోగులను కాపాడుకోవడం ప్రజల బాధ్యత అని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల పెరిగిన రద్దీకి అనుగుణంగా అదనపు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని, కొత్త బస్సుల కొనుగోలు, బస్టాండ్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఇదిలాఉంటే, నర్సంపేట ఆర్టీసీ డిపోలో డ్రైవర్గా పనిచేసి ఆత్మహత్య చేసుకున్న శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకుంది. ఆయన కుమారుడు హేమంత్ గౌడ్కు ఆర్టీసీలో ఉద్యోగ నియామక పత్రాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీఎండీ సజ్జనార్తో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శంకర్ గౌడ్ కుటుంబానికి ప్రభుత్వం, ఆర్టీసీఇప్పటికే పరిహారం అందించాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ ఉద్యోగులు తమ ఒక రోజు వేతనం ద్వారా సుమారు రూ.కోటి సాయం చేసి ఆ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట ప్రకారం ఇప్పుడు ఆయన కుమారుడికి ఉద్యోగం కల్పించామని చెప్పారు.

ఏపీ ఆర్థికాభివృద్ధి మండలితో ఎస్.ఎల్.ఎన్. కాఫీ రూ.2,500 కోట్ల భారీ ఒప్పందం

- సీ.ఐ.ఐ భాగస్వామ్య సదస్సులో సీఎం నారా చంద్రబాబునాయుడు సమక్షంలో కుదిరిన ఒప్పందం

అమరావతి,నవంబర్, 12,(మనం న్యూస్): విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఎస్.ఎల్.ఎన్. కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆర్థికాభివృద్ధి మండలి (ఏపీఈడీబీ)తో రూ.2,500 కోట్ల భారీ పెట్టుబడులకు సంబంధించి ముఖ్యమైన అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదుర్చుకుంది. రూ.2,500 కోట్ల ఈ పెట్టుబడితో రాష్ట్రంలో కాఫీ ప్రాసెసింగ్, ఇన్స్టంట్ కాఫీ తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, ఎస్.ఎల్.ఎన్. కాఫీ చైర్మన్ ఎస్.ఎల్.ఎన్. సతప్పన్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.ఎల్.ఎన్. విశ్వనాథన్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి సాహిబ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



వివరాల్లోకి వెళితే ఈ పెట్టుబడులను 2035 లోపు మొత్తం మూడు దశల్లో చేపట్టాలని ప్రతిపాదించారు. మొదటి దశలో రూ.690 కోట్లు, రెండో దశలో రూ.815 కోట్లు, మూడో దశలో రూ.995 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా కాఫీ ప్రాసెసింగ్, ఇన్స్టంట్ కాఫీ తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేయడంతోపాటు విలువ ఆధారిత ఆహార ఉత్పత్తులు, కాఫీ ప్రాసెసింగ్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్ స్థానాన్ని మరింత బలోపేతం చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 'ప్రాజెక్ట్ హరిజన్'లో భాగంగా ఏపీలో గుర్తించిన వ్యూహాత్మక ప్రాంతంలో సమీకృత తయారీ కేంద్రాన్ని అభివృద్ధి చేయనున్నారు. ఇందులో అత్యాధునిక కాఫీ ప్రాసెసింగ్, ఫ్రీజ్ డ్రైడ్, స్ప్రే డ్రైడ్ కాఫీ తయారీ, కాఫీ ఎక్స్ట్రాక్షన్, ప్యాకేజింగ్, పరిశోధన, అభివృద్ధి, నూతన ఆవిష్కరణలకు సంబంధించిన విభాగాలను ఏర్పాటు చేయాలనే ప్రణాళికలను రూపొందించారు. కేవలం తయారీ రంగానికే పరిమితం కాకుండా, కాఫీ పరిశ్రమకు సంబంధించిన సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయడం కూడా ఈ ప్రాజెక్టు లక్ష్యంగా ఉంది.

ఇందులో భాగంగా రైతులకు సహకారం అందించడం, కాఫీ క్యూరింగ్ మౌలిక సదుపాయాలను కల్పించడం, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం, కాఫీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ను ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను చేపట్టనున్నారు. తద్వారా కాఫీ పరిశ్రమలో ఉత్పత్తి సామర్థ్యంతోపాటు పరిజ్ఞానం, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం కల్పించే వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ ఒప్పందం సందర్భంగా ఎస్.ఎల్.ఎన్. కాఫీ చైర్మన్ ఎస్.ఎల్.ఎన్. సతప్పన్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం తమ సంస్థ అభివృద్ధి ప్రయాణంలో ఒక కీలకమైన మైలురాయి అని పేర్కొన్నారు. ఏపీ పట్ల తమకున్న దీర్ఘకాలిక నిబద్ధతకు ఈ ఎంఓయూ నిదర్శనమని తెలిపారు. తమ సంస్థ పెట్టనున్న సుమారు రూ.2,500 కోట్ల పెట్టుబడి కేవలం తయారీ సామర్థ్యాన్ని విస్తరించడానికే పరిమితం కాదని, అత్యాధునిక ప్రాసెసింగ్, సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, నూతన ఆవిష్కరణలు, మానవ వనరుల అభివృద్ధితో కూడిన భవిష్యత్తు అవసరాలకు అనుగుణమైన కాఫీ పరిశ్రమ వ్యవస్థను నిర్మించడమే తమ లక్ష్యమని చెప్పారు. ఈ ప్రణాళికను కార్యరూపంలోకి తీసుకురావడానికి ఏపీ రాష్ట్ర ప్రభుత్వం, ఏపీఈడీబీతో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నామని అన్నారు.

ఎస్.ఎల్.ఎన్. కాఫీ ముఖ్య కార్యనిర్వహణ అధికారి సాహిబ్ సింగ్ మాట్లాడుతూ, కాఫీ వినియోగం, విలువ ఆధారిత కాఫీ ఉత్పత్తుల మార్కెట్లో ప్రస్తుతం వస్తున్న మార్పులకు అనుగుణంగా సమీకృత తయారీ సామర్థ్యాలను అభివృద్ధి చేసుకోవడం కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తు మార్కెట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 'ప్రాజెక్ట్ హరిజన్'ను రూపొందించినట్లు వెల్లడించారు. సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యత, పరిశోధన, సుస్థిరతకు ప్రాధాన్యమిస్తూ కాఫీ పరిశ్రమలోని వివిధ విభాగాలను అనుసంధానిస్తూ తయారీ, పరిశోధనల కోసం ఒక వేదికను ఏర్పాటు చేయడమే తమ ఆశయమని స్పష్టం చేశారు.

నెల్లూరు సిటీలో ఎమ్మెల్సీ పనితీరు పట్ల జగన్ ఫిదా



తాడేపల్లి,నవంబర్ 10 (మనం న్యూస్): వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డితో తాడేపల్లిలో నెల్లూరు సిటీ ఇన్చార్జి,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నెల్లూరులో ఇటీవల జరిగిన మున్సిపల్ ఎలక్షన్స్ గురించి చర్చించటం జరిగింది సిటీలో చంద్రశేఖర్ రెడ్డి చేసిన పోరాటపటిమ పట్ల అలాగే 36 వార్డులలో అభ్యర్థులను నిలబెట్టడం పట్ల జగన్మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల లోని ముఖ్య విషయాలను జగన్ మోహన్ రెడ్డికి వివరించారు.

నగర నియోజకవర్గ పరిధిలో అధికార పార్టీ చేసిన అక్రమాలు, బెదిరింపులతో పాటు ఎన్నికల అంశాలను జగన్ మోహన్ రెడ్డికి వివరించారు.అధికార పార్టీ ఎన్ని చేసినా అధికార పక్షానికి గట్టి పోటీ ఇచ్చిన అభ్యర్థుల పోరాట పటిమ, నగర నాయకులు, కార్యకర్తల పనితీరుని జగన్మోహన్ రెడ్డి అభినందించారు.

ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న పరిణామాలను జగన్మోహన్ రెడ్డికి వివరించారు. మొత్తం మీద ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి పనితీరు పట్ల జగన్ ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు

- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు
- ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు
- పిఎం రహత్ స్కీమ్ గురించి ప్రజల్లో అవగాహన
- అధికారులకు దిశానిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ నరసింహ



సూర్యాపేట నవంబర్ 12 (మనం ప్రతినిధి) పోలీసు అధికారుల నెలవారీ సమీక్షలో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ నరసింహ, సూర్యాపేట డివిజన్ పరిధి పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేసుల దర్యాప్తులో నాణ్యత, పెండింగ్ కేసుల పరిష్కారం, ఎన్డీడబ్ల్యూ ఎగ్జిక్యూషన్, రోడ్డు ప్రమాదాల నివారణ, ప్రజా భద్రత, సైబర్ నేరాల నియంత్రణ, ప్రజల్లో అవగాహన కార్యక్రమాల నిర్వహణపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన తీవ్రమైన, అతి తీవ్రమైన, మిస్సింగ్, ఎన్డీడబ్ల్యూ కేసుల దర్యాప్తు పురోగతిని ఎస్పీ సమీక్షించారు. ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నిర్ణీత గడువులోగా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. దీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న మిస్సింగ్ కేసుల ఛేదన, నాన్ బెయిలబుల్ వారెంట్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా గ్రేవ్ కేసుల్లో శాస్త్రీయ ఆధారాలను సేకరించి, నిందితులకు న్యాయస్థానంలో శిక్ష పడేలా సమర్థవంతంగా దర్యాప్తు చేపట్టాలన్నారు. నేరస్తులకు న్యాయస్థానంలో శిక్ష పడినప్పుడే పోలీసులపై ప్రజల్లో మరింత విశ్వాసం పెరుగుతుందని నేరాలు తగ్గుతాయని పేర్కొన్నారు. దర్యాప్తు సమయంలో ఇన్వెస్టిగేషన్ సపోర్ట్ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. అందుబాటులో ఉన్న అత్యాధునిక సాంకేతికత, రాష్ట్ర పోలీసు శాఖ అందించిన టూల్స్ సద్వినియోగం చేసుకుని కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేస్తూ, నిందితులను శిక్షలు పడేలా పని చేయాలని ఆదేశించారు.

పిఎం రహత్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రోడ్డు ప్రమాద బాధితులకు తక్షణ నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రహత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అని ఎస్పీ కోరారు. ఈ పథకం కింద సూర్యాపేట జిల్లాలో 38 ఆసుపత్రులను గుర్తించారు, ప్రమాద బాధితులకు ఉచిత అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

అదేవిధంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, అతివేగం, నిర్లక్ష్యపు డ్రైవింగ్కు దూరంగా ఉండాలని, హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ అధికారులకు సూచించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాద సూచిక బోర్డులు, సీసీ కెమెరాల ఏర్పాటు చేయించాలని అన్నారు. ప్రధాన రహదారులకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. నేరాల నియంత్రణ, నిందితుల గుర్తింపు, కేసుల ఛేదనలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సీసీ కెమెరాల ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రతి గ్రామంలోని ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలతో పాటు ప్రార్థనా స్థలాలు, పరిశ్రమలు, ధాబాలు, పెట్రోల్ బంకులు తదితర ముఖ్యమైన ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు.

పోలీసు వాహనాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పోలీస్ అధికారులకు కేటాయించిన పోలీసు వాహనాలను తనిఖీ చేసిన నిర్వహణ, పనితీరును పరిశీలించారు. ప్రతి వాహనానికి క్రమం తప్పకుండా సర్వీసింగ్ చేయించి, అత్యవసర సమయాల్లో తక్షణమే వినియోగించుకునేలా సిద్ధంగా ఉంచాలని డ్రైవర్లను ఆదేశించారు. విధి నిర్వహణకు అవసరమైన కమ్యూనికేషన్ సెట్, ఎమర్జెన్సీ కిట్లు వాహనాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు.

ఈ సమీక్షా సమావేశంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, సత్యయ్య ప్రసన్న కుమార్, సైబర్ సెక్యూరిటీ సెల్ డిఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, సైబర్ సెక్యూరిటీ ఇన్స్పెక్టర్ శివ కుమార్, డిసీఆర్బీ ఇన్స్పెక్టర్ మగ్దుం అలి, జిల్లా ఇన్స్పెక్టర్లు నాగేశ్వరరావు, వెంకటయ్య, ఉపేందర్ రావు, రాజశేఖర్, ఎస్ఐ లు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ నూతన చైర్మన్ ప్రమాణ స్వీకారం



- చిల్లేపల్లి పిఎసిఎస్ నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ

నేరేడుచర్ల, నవంబర్ 12 మనం న్యూస్: నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) నూతన పాలకవర్గం గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. చిల్లేపల్లి పిఎసిఎస్ సీఈవో బుడిగ నాగరాజు నూతన పాలకవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించారు.. సంఘం చైర్మన్గా కట్టా రామారావుతో పాటు 12 మంది పాలకవర్గ సభ్యులు కేతిరెడ్డి నర్సిరెడ్డి,వనం రామకోటయ్య,అనంతుల రేణుక,గజగంటి ప్రవీణ్, కారింగుల సుజాత,దోరేపల్లి లింగమ్మ,ఘంటా రాఘవరెడ్డి, దిండిగాల కిరణ్,మాలోతు సైదా,నన్నేపంగు ఏడుకొండలు, బండ్ల నాగేశ్వరరావు,పల్లె లింగయ్య ప్రమాణ స్వీకారం చేశారు.అనంతరం చైర్మన్ కట్టా రామారావు మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన సొసైటీ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తూ,సహకార సంఘం ద్వారా రైతులకు అవసరమైన సేవలు, సదుపాయాలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తానని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పాలకవర్గ సభ్యులందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని పేర్కొన్నారు. సంఘం అభివృద్ధితో పాటు రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ అందరి సహకారంతో పనిచేస్తానని హామీ ఇచ్చారు.తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి పలువురు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకట్ రెడ్డి,వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి,పీఏసీఎస్ సీఈఓ నాగరాజు,కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, నూతన పాలకవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్స్టేషన్ను ప్రారంభించిన ఎమ్మెల్యే



కోదాడ, నవంబర్ 12(మనం న్యూస్): మండల పరిదిలోని కూచిపూడి గ్రామంలో రూ.2.80 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్స్టేషన్ను ఎమ్మెల్యే నలమాద పద్మావతి రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నూతన విద్యుత్ సబ్స్టేషన్ అందుబాటులోకి రావడంతో కూచిపూడి, కాపుగల్లు, యతిరాజాపురం తండా పరిధిలోని ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని తెలిపారు. ముఖ్యంగా చాలాకాలంగా ఎదురవుతున్న లో ఓల్టేజ్ సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు గృహ, వ్యవసాయ విద్యుత్ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఈ సబ్స్టేషన్ పరిధిలో మొత్తం 1,140 గృహ విద్యుత్ కనెక్షన్లు, 1,184 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయని తెలిపారు. రైతులకు సాగు అవసరాలకు, ప్రజలకు గృహ అవసరాలకు నిరంతరాయంగా మెరుగైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇగ్నో యూనివర్సిటీ టర్మ్ ఎండ్ పరీక్షలు నవంబర్ 25 నుండి ప్రారంభం



హైదరాబాద్, నవంబర్ 12(మనంన్యూస్): ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) దేశ వ్యాప్తంగా డిసెంబర్, 2026 టర్మ్ ఎండ్ పరీక్షలను నవంబర్ 25, 2026 నుండి , 14 జనవరి 2027 తేదీ వరకు నిర్వహిస్తారని వరంగల్ లాల్ బహదూర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డి.హెచ్. రావు మరియు ఇగ్నో అధ్యయన కేంద్రం కో-ఆర్డినేటర్ యస్.వి. రమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మరియు పీజి విద్యార్థులతో పాటుగా డిప్లొమా, పీజి డిప్లొమా మరియు సర్టిఫికెట్ ప్రోగ్రాములకు సంబంధించిన ఈ పరీక్షలు వరంగల్ లోని ఎల్.బి. కళాశాల పరీక్ష కేంద్రంలో నిర్వహించబడుతాయని ఇగ్నో హైదరాబాద్ ప్రాంతీయ కేంద్రం రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాజు బోల్లా సంయుక్తంగా పేర్కొన్నారు. ఈ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు తమ హాల్ టిక్కెట్లను ఇగ్నో సమర్థ్ పోర్టల్ లింక్ జ్జిఇటు//జీజ్ఞౌంటఛ్ఛుట్టజి.ఛ్ఛిం జీ/జీఛ్ఛీ.ఇజి ఇ/టజ్ఛీ/జ్ఞౌజీ నుండి డౌన్లోడ్ చేసుకోవాలని వారు సూచించారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు నిర్ణీత సమయం కన్నా ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, పరీక్షా కేంద్రంలోకి ఏవిధమైన మొబైల్ ఫోన్స్ మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను తీసురావద్దని, విద్యార్థులు తప్పనిసరిగా ఇగ్నో వర్సిటీ పేర్కొన్న నిబంధనలను విధిగా పాటించాలని పేర్కొన్నారు. ఇతర పూర్తి వివరాలకు అభ్యర్థులు ఠీఠీఠీ.జీజ్ఞౌంఛ్ఛి.జీఁ లేదా 98493 81085 ఫోన్ నెంబర్ లో సంప్రదించగలరని తెలిపారు.

భూముల రీ సర్వేలో వేగం పెంచాలి



- రైతుల సమక్షంలో సర్వే పూర్తి చేసి సంతకాలు తీసుకోవాలి
- కలెక్టర్ గరిమ అగ్రవాల్

సిరిసిల్ల, నవంబర్ 12 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేసి, మొదటి విడతలో ఎంపిక చేసిన 70 గ్రామాల్లో ఈ నెల 30లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే తేదీలు, గ్రామాలు, సర్వే నంబర్ల వివరాలను రైతులకు ముందస్తుగా తెలియజేయాలని సూచించారు. రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి, అనంతరం వారి సంతకాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ప్రతిరోజూ 60 నుంచి 100 ఎకరాల వరకు సర్వే పూర్తి చేస్తూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. రైతులు కూడా రీ సర్వేకు సహకరించాలని కలెక్టర్ కోరారు.

ప్రమాద బాధిత కుటుంబానికి అండగా ఏకశిల ఛైర్మన్



హనుమకొండ, నవంబర్ 12 (మనం న్యూస్): ప్రమాద బాధిత కుటుంబానికి ఏకశిలా విద్యాసంస్థల ఛైర్మన్ అండ - రూ.25,000 ఆర్థిక సహాయం, పెద్ద కుమార్తె చదువుల పూర్తి బాధ్యత స్వీకరణ

నాగారం గ్రామానికి చెందిన మాచర్ల భిక్షపతి (40) ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న ఏకశిలా విద్యాసంస్థల వ్యవస్థాపకులు, ఛైర్మన్ డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి మానవతా దృక్పథంతో స్పందించి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు.

ప్రమాదం కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆ కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఛైర్మన్ తిరుప రెడ్డి తక్షణ సహాయంగా రూ.25,000/- (ఇరవై ఐదు వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందించారు. అంతేకాకుండా, ఆ కుటుంబంలోని పెద్ద కుమార్తె చదువుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, ఆమె విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు అయ్యే ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని భరోసా ఇచ్చారు.

కష్టాల్లో ఉన్న ఒక కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడమే కాకుండా, ఆ కుటుంబంలోని చిన్నారి భవిష్యత్తుకు విద్య ద్వారా భరోసా కల్పించడం ఎంతో గొప్ప విషయం. ఆపద సమయంలో ఆ కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు, పిల్లల చదువు మధ్యలో ఆగిపోకుండా చూడాలనే ఛైర్మన్ గారి నిర్ణయం విద్య పట్ల, సమాజం పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనం. ఆర్థిక సహాయం ఒక కుటుంబానికి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తుంది.

కానీ ఒక చిన్నారి చదువు బాధ్యత తీసుకోవడం ఆమె జీవితానికి, భవిష్యత్తుకు గొప్ప భరోసా కల్పిస్తుంది. ఈ ఉదాత్తమైన ఆలోచనతో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన డాక్టర్ గౌరు తిరుపతి రెడ్డి గారి సహృదయతను గ్రామస్థులు, స్థానికులు అభినందించారు. సమాజంలో ఆపదలో ఉన్నవారికి తోడుగా నిలవడం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్క చిన్నారి విద్యకు దూరం కాకుండా సహకరించడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఈ కార్యక్రమంలో ఏకశిలా విద్యాసంస్థల డైరెక్టర్ శ్రీమతి గౌరు సువిజ రెడ్డి, నాగారం మాజీ సర్పంచ్ శ్రీ చింతల పాండురంగం, శ్రీ పి. సాంబయ్యతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎస్టీల సమస్యల పరిష్కారానికి కమిషన్ కోర్టును ఆశ్రయించాలి

- మైనింగ్ కార్యకలాపాలపై సమగ్ర సర్వే చేసి నివేదిక ఇవ్వాలి
- జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్



నల్గొండ ,నవంబర్ 12 (మనం ప్రతినిధి): షెడ్యూల్ తెగల ప్రజలకు భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ అంతర్జాల పోర్టల్ ద్వారా కమిషన్ కోర్టును ఆశ్రయించాలని జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ సభ్యుడు జాతోతు హుస్సేన్ నాయక్ అన్నారు. కమిషన్ కోర్టు ప్రజల హక్కుల సాధనకు ఒక ఆయుధమని, తెల్ల కాగితంపై తమ సమస్యలను రాసి అంతర్జాలంలో దరఖాస్తు చేసుకుంటే వెంటనే డైరీ సంఖ్య కేటాయించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గురువారం ఆయన నల్గొండ జిల్లా, దేవరకొండ మండలంలోని వెంకట్ తండా, బొల్లిగుట్ట తండా, కాచారం గ్రామాల్లో షెడ్యూల్ తెగల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు పర్యటించారు. ఆయా గ్రామాలు, తండాలలో ప్రజలతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులు, రహదారుల సమస్యలు, విద్యుత్, భూముల పట్టాలు, తదితర సమస్యలను ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయిలో షెడ్యూల్ తెగల ప్రజల సమస్యలపై అధ్యయనం చేసి పరిష్కారానికి కృషి చేస్తున్నామని, క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల సమస్యలను స్వయంగా తెలుసుకుంటున్నామని తెలిపారు. మైనింగ్ సమస్యలపై మైనింగ్, పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్య, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో సమగ్ర సర్వే నిర్వహించి నివేదిక అందించాలని ఆదేశించారు. వెంకటేశ్వర వెంగమాంబ మైనింగ్ కార్యకలాపాలపై ప్రజలు వ్యక్తం చేస్తున్న అభ్యంతరాల నేపథ్యంలో సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరపాలని ఆదేశించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజల అభిప్రాయాలను సేకరించాలని, మైనింగ్ వల్ల కలుగుతున్న ప్రభావాలను పరిశీలించాలని, ఫొటోలు, వీడియోలతో సహా నివేదికలు సిద్ధం చేసి ఐదు రోజుల్లో సమర్పించాలని సూచించారు. పోలీస్, ఫారెస్ట్, మైనింగ్, వైద్య శాఖల అధికారులు తమ పరిధిలోని అంశాలపై సమగ్ర నివేదికను 15 రోజుల్లో అందించాలని ఆదేశించారు. మైనింగ్ లీజుల పునరుద్ధరణ సమయంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారా, గ్రామస్థులకు సమాచారం ఇచ్చారా, ప్రజా విచారణకు సంబంధించిన లేఖలు, ప్రజలు పాల్గొన్న వీడియోలు, ఇతర ఆధారాలను సమర్పించాలని మైనింగ్ యజమానులను ప్రశ్నించారు. మైనింగ్లో స్థానిక గ్రామస్థులకు ఉపాధి కల్పిస్తున్నారా, వారికి ఏమైనా ప్రయోజనాలు అందిస్తున్నారా, గ్రామానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నారా అనే అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించే ప్రాంతాల్లో స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యాలపై ఉందని స్పష్టం చేశారు. గ్రామాల్లో పెండింగ్లో ఉన్న రహదారి పనులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు చేపట్టి పూర్తి చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలను రద్దు చేసి, కొత్త టెండర్లు పిలిచి పనులు ప్రారంభించాలని సూచించారు.

గ్రామాల్లో చర్చి నిర్మాణాలకు గ్రామ కార్యదర్శి అనుమతులు లేకుండా పనులు చేపట్టిన అంశంపై కూడా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన గ్రామ కార్యదర్శిని బదిలీ చేయాలని హెచ్చరించారు. బొల్లిగుట్ట తండాలో మైనింగ్ సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరగా వెంటనే సంబంధిత మైనింగ్ అధికారులకు సూచనలు చేశారు. అర్హులైన వారికి భూముల పట్టాలు మంజూరు చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేయగా, తహసీల్దార్లు ఆదేశించి అవసరమైన వారికి పట్టాలు అందేలా చూడాలని సూచించారు. విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి వారం రోజుల్లోగా విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని డీఈకి ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా భూముల సర్వే నిర్వహించి అర్హత కలిగిన పట్టాదారులు తమ భూముల్లో ఇళ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందుకు సంబంధించిన సర్వేను సోమవారం వరకు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాచారం గ్రామంలో మైనింగ్కు సంబంధించిన సమస్యలపై గత 32 రోజులుగా సమ్మె చేస్తున్న కార్మికులతో ఆయన మాట్లాడారు. సమ్మె విరమించాలని కోరుతూ, ప్రభుత్వ పరంగా వారికి రావాల్సిన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. షెడ్యూల్ తెగల ప్రజలు తమ హక్కుల విషయంలో అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి సమస్య ఎదురైనా భయపడకుండా జాతీయ షెడ్యూల్ తెగల కమిషన్ను ఆశ్రయించాలని ఆయన పిలుపునిచ్చారు. అంతర్జాలంలో ఫిర్యాదు చేస్తే వెంటనే డైరీ సంఖ్య వస్తుందని, దాని ఆధారంగా సమస్య పరిష్కారానికి కమిషన్ చర్యలు చేపడుతుందని తెలిపారు. గ్రామాల్లో పర్యటించిన సందర్భంగా ప్రజలు వెల్లడించిన ప్రతి సమస్యను సంబంధిత శాఖల అధికారులు తీవ్రంగా పరిగణించి, నిర్ణీత గడువులో నివేదికలు సమర్పించడంతో పాటు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాతోతు హుస్సేన్ నాయక్ స్పష్టం చేశారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, కమిషన్ డైరెక్టర్ కళ్యాణ్ రెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు రాంబాబు, డీటీడీఓ కమలాకర్ రెడ్డి, ఆర్డీవో వనజరాని, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శేఖర్ రెడ్డి, డీఎంహెచ్ఓ రాహుల్, ఎంపీడీవో పార్వతి, సర్పంచులు భీముడు, బుజ్జి, హరిలాల్, శ్యామలయ్య, అధికారులు, ప్రజలు ఉన్నారు.


అసభ్యకర వ్యాఖ్యలు చేస్తే సహించం



- వైసీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఆరె శ్యామల
- నార్సింగి పోలీస్ స్టేషన్లో వైసీపీ నేతల ఫిర్యాదు

హైదరాబాద్, నవంబర్ 12(మనంప్రతినిధి): వైఎస్ఆర్ కాంగ్రెస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై సోషల్ మీడియా వేదికగా అసభ్యకర, జుగుప్సాకరమైన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర అధికారప్రతినిధి ఆరె శ్యామల ఫైర్ అయ్యారు. గురువారం ఆరె శ్యామల నార్సింగి పోలీస్ స్టేషన్లో సీఐని కలిసి సోషల్ మీడియాలోని అసభ్యకర పోస్టులపై వివరించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. అనంతరం ఆమె మాట్లాడు తూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కు చెందిన జనసేనకు చెందిన కొందరు మద్దతుదారులు పరిధులు దాటి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, అలాంటి వారిని చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించేలా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పార్టీ నాయకత్వం ఇచ్చిన హెచ్చరికలు, ఆదేశాలకు కట్టుబడి వైసీపీ నాయకులు, సోషల్ మీడియా విభాగానికి చెందిన శ్రేణులు సంపూర్ణ సంయమనం పాటించారన్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారంలో ఉన్నామనే ఉద్దేశంతో కొందరు జనసేన పార్టీ మద్దతుదారులు మాత్రం జగన్ కుటుంబమే లక్ష్యంగా అసభ్యకరమైన పోస్టులు పెడుతూ, ఆన్ లైన్ లైవ్ చర్చల్లో తీవ్ర విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికే, వైసీపీ న్యాయ విభాగం సోషల్ మీడియాలో జరుగుతున్న వ్యక్తిగత దాడులు మరియు సైబర్ వేధింపులపై దృష్టి సారించామని వెల్లడించారు. జనసేన నేతలు 300 వందల మందికి పైగా ఎక్స్(ట్విట్టర్) వేదికగా మా పార్టీ అధినేత మరియు వారి కుటుంబ సభ్యుల పై అనుచిత వ్యాఖ్యలు చేశారు. జనసేన పార్టీ వ్యక్తులు జగన్ కుటుంబ సభ్యులపై మాట్లాడిన తీరు ఆక్షేపనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఇవ్వాల్సిన కనీసం గౌరవం కూడా కరువైందన్నారు. ఇలాంటి వారిపై ఏం చర్యలు ఉండవా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ అంటూ ప్రశ్నించారు. ఆధారాలతో సహా పిర్యాదు చేస్తున్నాం నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం



- రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్

సిరిసిల్ల, నవంబర్ 12 (మనం ప్రతినిధి): సిరిసిల్ల జిల్లాలోని కోనరావుపేట మండలం సుద్దాల గ్రామంలోని కావేరి జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ గురువారం ప్రారంభించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర అందేలా, కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రైతులు పత్తిలో తేమ శాతం, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.

మల్కపేటలో భూముల రీ సర్వే పరిశీలన

కోనరావుపేట మండలం మల్కపేట గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే పారదర్శకంగా, ఖచ్చితత్వంతో నిర్వహించాలని, రైతులకు ముందస్తు సమాచారం అందించి వారి సమక్షంలోనే సర్వే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రోజువారీ లక్ష్యాలకు అనుగుణంగా ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.

బియ్యం ధరలపై అధికారుల నిఘా..

అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు!
ప్రతి కిరాణా దుకాణం ముందు ధరల పట్టిక తప్పనిసరి
వినియోగదారులకు బిల్లు ఇవ్వాల్సిందే: తహసీల్దార్ ఎస్డీ సర్వర్



కన్నాయిగూడెం, నవంబరు 12 (మనం న్యూస్): మండలంలో బియ్యం వ్యాపారులు నిర్ణీత ధరలకే బియ్యం విక్రయించాలని, వినియోగదారుల నుంచి అధిక ధరలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని కన్నాయిగూడెం తహసీల్దార్ ఎస్డీ సర్వర్ హెచ్చరించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆదేశాల మేరకు మండలంలోని హోల్సేల్, రిటైల్ బియ్యం వ్యాపారులకు ఈ మేరకు సూచనలు జారీ చేశారు. ప్రతి హోల్సేల్, రిటైల్ కిరాణా దుకాణం యజమాని తమ దుకాణం ముందు వివిధ రకాల బియ్యం ధరల పట్టికను ప్రజలకు స్పష్టంగా కనిపించేలా తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించడంతో పాటు, ప్రతి కొనుగోలుదారుడికి తప్పనిసరిగా విక్రయ బిల్లు అందించాలని స్పష్టం చేశారు. బీపీటీ, కేఎన్ఎం రూ. 62, రూ. 64, రూ. 66, ఆర్ఎన్ఆర్ తెలంగాణ సోనా రూ. 70, రూ. 72, రూ. 74, హెచ్ఎంటీ జై శ్రీరాం రూ. 75, రూ. 77, రూ. 79 ధరల కంటే అధికంగా విక్రయించడం, కృత్రిమ కొరత సృష్టించడం, బ్లాక్ మార్కెట్కు బియ్యం తరలించడం, అక్రమంగా నిల్వ ఉంచడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యాపారులపై తనిఖీలు నిర్వహించి చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వ్యాపారులు అధిక ధరలకు బియ్యం విక్రయించినా, బిల్లు ఇవ్వకుండా నిరాకరించినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు న్యాయమైన ధరలకు బియ్యం అందించడమే లక్ష్యంగా అధికారులు పర్యవేక్షణ చేపడతారని తహసీల్దార్ ఎస్డీ సర్వర్ తెలిపారు.


వి.బి.జి.రామ్ జి పనుల్లో వేగం పెంచాలి

- నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలి
- నిర్ణీత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



ములుగు, నవంబర్ 12, మనం ప్రతినిధి: వి.బి.జి. రామ్ జి పథకం కింద చేపట్టిన పనులను వేగవంతం చేసి, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లోని మినీ సమావేశం హాల్ లో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావుతో కలిసి జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలతో వి.బి.జి. రామ్ జి పనుల పురోగతిపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా ఉపాధి హామీ పనుల పురోగతి, ఇంకుడు గుంతలు, బోరుబావుల రీఛార్జ్ పాయింట్లు, ఊట చెరువులు, పంట కుంటల నిర్మాణం తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపునకు దోహదపడే పనులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఇంకుడు గుంతలు, బోరుబావుల రీఛార్జ్ నిర్మాణాలు, ఊట చెరువులు, పంట కుంటల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని, ప్రతి ఎంపీడీఓ తమ పరిధిలోని గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పనుల అమలులో జాప్యానికి తావులేకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఉపాధి హామీ పనుల అమలులో అధికారులు ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం వహించకుండా ప్రత్యేక దృష్టి సారించి, నిర్దేశించిన లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన బిఆర్ఎస్



ఏటూర్ నాగారం, నవంబర్ 12,మనం ప్రతినిధి: సోషల్ మీడియా వారియర్ మాసిపెద్ది దేవేందర్పై పెట్టిన కేసును ఖండిస్తూ ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్బాబు ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. పంచోతుకులపల్లిలోని దేవేందర్ ఇంటికి వెళ్లి తల్లిదండ్రులు, భార్యను కలిసి ధైర్యం చెప్పారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యకర్తలు, వారి కుటుంబాలు కష్టాల్లో ఉన్నప్పుడు అండగా నిలవడం పార్టీ బాధ్యత అని లక్ష్మణ్బాబు అన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్రావుతో పాటు బీఆర్ఎస్ పార్టీ మొత్తం దేవేందర్ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. రాజకీయ కక్షతో కేసులు పెట్టి ప్రశ్నించే గొంతులను అణచివేయలేరని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తాటి కృష్ణయ్య, కాకులమర్రి ప్రదీప్రావు, కొమరం ధనలక్ష్మి, బాడిషా నాగరమేష్, ఎండీ వలీబాబా, చెన్న విజయ్, మాసిపెద్ది పుష్ప, సత్యనారాయణరావు, కాసిం, భూక్య నిరోష, అమర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

- శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలి

ములుగు, నవంబర్ 12, మనం ప్రతినిధి: వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ కేకన్ సుధీర్ రామ్నాథ్ గురువారం సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు, కేసుల వివరాలు, నిర్వహణ, సిబ్బంది విధుల తీరును పరిశీలించారు. సబ్ డివిజన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించాలని సూచించారు.

ఈ తనిఖీలో డీఎస్పీ నలువాల రవీందర్, పస్రా సీఐ దయాకర్, ములుగు సీఐ దారం సురేష్, ఎస్సైలు వెంకటేష్, ఎస్సైలు చల్ల రాజు, కృష్ణప్రసాద్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా గ్రంథాలయ సంస్థ చైర్మన్ జన్మదిన వేడుకలు



ములుగు, నవంబర్ 12,మనం ప్రతినిధి: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ములుగు జిల్లా ఆత్మ కమిటీ డైరెక్టర్ జక్కుల రేవంత్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు రవిచందర్ హాజరై కాంగ్రెస్ పార్టీ నాయకుల మధ్య కేక్ కట్ చేశారు.
అనంతరం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సిబ్బంది ఏర్పాటు చేసిన వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి చింతనిప్పుల భిక్షపతి, డీసీసీ ఉపాధ్యక్షుడు పల్లె జైపాల్రెడ్డి, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొని రవిచందర్కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

సింగపురం ఇందిరకు టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుభాకాంక్షలు

- శాలువాతో సత్కరించి జన్మదిన అభినందనలు తెలిపిన రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు



జనగామ నవంబర్ 12 (మనం ప్రతినిధి): స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సింగపురం ఇందిర జన్మదినం సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరను శాలువాతో సత్కరించి జన్మదిన అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమెతో ఆత్మీయంగా మాట్లాడి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మహేష్ కుమార్ గౌడ్, సింగపురం ఇందిర రాజకీయ ప్రస్థానం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని అభిలషించారు. ఈ వేడుకల్లో ఇందిర తనయుడు ఇమాన్యుల్ రాజు కూడా పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేస్తా

మంగపేట మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తూడి భగవాన్రెడ్డి



మంగపేట, నవంబర్ 12, మనం ప్రతినిధి: మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా తనను నియమించిన నాయకత్వానికి తూడి భగవాన్రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, రాష్ట్ర పంచాయతీరాజ్ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చెట్టిపెల్లి వెంకటేశ్వర్లుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యత తనకు మరింత ప్రోత్సాహాన్నిచ్చిందన్నారు.
మంత్రి సీతక్క అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తానని భగవాన్రెడ్డి తెలిపారు.



అన్ డిఫైనేబుల్ గర్ల్ పుస్తకావిష్కరణ

- సివిల్స్ విద్యార్థిని కోల సింధును అభినందించిన కేటీఆర్

హైదరాబాద్, మనం ప్రతినిధి : సివిల్స్ విద్యార్థిని కోల సింధు రచించిన అన్ డిఫైనేబుల్ గర్ల్ పుస్తకాన్ని హైదరాబాద్ తన నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ మేరకు హైదరాబాద్లో కేటీఆర్ వద్దకు తీసుకువెళ్లి ఆమె రచించిన పుస్తకాన్ని ఆయన చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా కోల సింధు రచించిన పుస్తకాన్ని అభినందిస్తూ, ఆమె రచనా ప్రతిభను కేటీఆర్ కొనియాడారు. చిన్న వయసులోనే రచనా రంగంలో ప్రతిభను చాటుతూ.. సివిల్స్ లక్ష్యంతో ముందుకు సాగుతున్న కోల సింధు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, లత కోడలు, కోల మహేష్ - లక్ష్మీ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుమై మంత్రిదృష్టికి తీసుకుపోతాం

ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు



ఏటూర్ నాగారం, నవంబర్ 12, మనం ప్రతినిధి: ఏటూరునాగారం నూతన జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు సాధన సమితి ఆధ్వర్యంలో బుధవారం నేడు ఏటూరునాగారంలో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించడం జరిగింది.ప్రజాభిప్రాయం - ఐక్యత ఉద్యమమే మన బలం...' అనే ప్రధాన నినాదంతో జరిగిన ఈ సమావేశానికి స్థానిక ప్రజలు, వివిధ కుల సంఘాల నాయకులు పెద్దఎత్తున హాజరయ్యారు.ఈ సమావేశంలో ములుగు జిల్లా ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ఏటూరునాగారంలో కోర్టు ఏర్పాటు ప్రజల చిరకాల కోరిక అని, దీని సాధన కోసం పార్టీలకు అతీతంగా అందరూ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు.

వాజేడు, వెంకటాపురం కన్నాయిగూడెం మంగపేట, తాడ్వాయి ఏటూర్ నాగారం 6 మండలాలకు సెంటర్ పాయింట్ ఏటూర్ నాగారం మండలం ఉంటుంది కాబట్టి ఏటూర్ నాగరంలో కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు

అదేవిధంగా ములుగు జిల్లా కేంద్రానికి కేసుల విషయమై ప్రజలు పోవాలంటే వాజేడు మండలం టేకులగూడెం గ్రామం నుండి దరిదాపు 150 కిలోమీటర్లు వస్తుందని అదేవిధంగా వెంకటాపురం మండలం నుండి ఆలువాక జంక్షనుండి 150 కిలోమీటర్లు వస్తుందని మంగపేట మండలం నుండి అక్కెనపల్లి మల్లారం నుండి 140 కిలోమీటర్లు వస్తుందని కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం నుండి ములుగు కోర్టు 150 కిలోమీటర్ల దూరం ఉండటం వల్ల పోవడానికి రావడానికి ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని అదేవిధంగా ప్రభుత్వము మంత్రివర్యులు సీతక్క ఆలోచించి మంచి నిర్ణయం తీసుకుంటుందని అన్నారు.అదేవిధంగా డీలిమిటేషన్ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా మండలాలు మారే పరిస్థితి ఉందని దానిని ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటరనీ, రెవెన్యూ డివిజన్ ఏర్పాటలో భాగంగా సదరు కోర్టుల నిర్మాణం జరుగుతుందనేది తెలియజేసినారని అన్నారు. స్థానిక ప్రజలకు త్వరితగతిన న్యాయం అందాలంటే ఇక్కడ కోర్టు ఏర్పాటు ఎంతో అనివార్యమని, దీనికై ప్రజాప్రతినిధులుగా తాము పూర్తి మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు మరియు కోర్టు సాధన సమితి సభ్యులు పాల్గొన్నారు

వినూత్న ఆలోచనలకు నిపుణుల మార్గదర్శకత్వం

ములుగులో విజయవంతంగా ముగిసిన ఇన్నోవేషన్ పంచాయతీ
జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి



ములుగు, నవంబర్ 12(మనం ప్రతినిధి): గ్రామీణ ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తమ వినూత్న ఆలోచనలను వ్యాపార అవకాశాలుగా తీర్చిదిద్దుకునేందుకు ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి సూచించారు.

గురువారం ములుగు జిల్లాలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ (ఖీఐఇ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్నోవేషన్ పంచాయతీ కార్యక్రమానికి జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సిద్ధార్థ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆవిష్కర్తలు, యువత, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల మహిళలు తమ సృజనాత్మక ఆలోచనలకు ఆచరణ రూపం కల్పించేందుకు తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన ఆవిష్కర్తలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 40 మందికి నిపుణులు ముఖాముఖి మార్గదర్శకత్వం అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాలను కలుపుతూ తొమ్మిది విడతల్లో నిర్వహించిన ఇన్నోవేషన్ పంచాయతీ ద్వారా 800కు పైగా ముఖాముఖి సంప్రదింపులు నిర్వహించడంతో పాటు 70 మందికి పైగా స్థానిక మెంటార్లను గుర్తించి అనుసంధానం చేశారు. ములుగులో నిర్వహించిన తొమ్మిదో విడతతో ఈ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది.

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ హెడ్ ఆఫ్ ఇన్నోవేషన్స్ సోహెల్ ఖాన్, గ్రాస్రూట్ ఇన్నోవేషన్స్ విభాగం లీడ్ రమేష్ గౌడ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, ఈ-డిస్ట్రిక్ట్ మేనేజర్ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాజధానిలో రియల్ హోరు.. అమ్మకాల జోరు

హైదరాబాద్లో 10 నెలల్లో రూ.44,305 కోట్ల ప్రాపర్టీ రిజిస్ట్రేషన్లు

హైదరాబాద్, మనం ప్రతినిధి : హైదరాబాద్ నివాస గృహాల (రెసిడెన్షియల్) మార్కెట్ 2026 జనవరి నుంచి అక్టోబర్ కాలంలో స్థిరమైన పనితీరును కనబరిచింది. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ 'నైట్ ఫ్రాంక్ ఇండియా' విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం.. ఈ పది నెలల కాలంలో నగరంలో మొత్తం 61,033 నివాస ప్రాపర్టీల రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. వీటి మొత్తం విలువ రూ.44,305 కోట్లుగా నమోదైంది. గతేడాది ఇదే కాలంతో పోలిస్తే రిజిస్ట్రేషన్ల పరిమాణంలో 1 శాతం స్వల్ప తగ్గుదల కనిపించినప్పటికీ, మొత్తం లావాదేవీల విలువలో మాత్రం 3 శాతం పెరుగుదల నమోదు కావడం విశేషం. మార్కెట్లో ఖరీదైన, ప్రీమియం ప్రాపర్టీల కొనుగోళ్లు పెరగడమే ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది.


రూ. కోటి దాటిన ఇళ్లకే క్రేజ్..

బడ్జెట్ విభాగాల వారీగా పరిశీలిస్తే, 2026 జనవరి-అక్టోబర్ కాలంలో రూ.50 లక్షల లోపు ధర ఉన్న ఇళ్లే రిజిస్ట్రేషన్లలో అత్యధిక వాటా (సుమారు 55 శాతం) దక్కించుకున్నాయి. రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి లోపు ఉన్న ఇళ్లు 25 శాతం వాటాను, రూ.1 కోటికి పైబడిన ఇళ్లు 20 శాతం వాటాను నమోదు చేశాయి. అయితే, మొత్తం లావాదేవీల విలువలో మాత్రం రూ.1 కోటికి పైబడిన లగ్జరీ ఇళ్లే ఆధిపత్యం చెలాయించాయి. 2026 పది నెలల కాలంలో నమోదైన మొత్తం విలువలో ఈ ప్రీమియం విభాగం వాటా ఏకంగా 51 శాతంగా (గతేడాది 50 శాతం) ఉంది. ఈ కేటగిరీ రిజిస్ట్రేషన్లు 12,246 నుంచి 12,322కి పెరగగా, వీటి మొత్తం విలువ రూ.21,475 కోట్ల నుంచి 6 శాతం వృద్ధితో రూ.22,680 కోట్లకు చేరింది. మరోవైపు, రూ.50 లక్షల లోపు ఇళ్ల రిజిస్ట్రేషన్లు 34,062 నుంచి 2 శాతం తగ్గి 33,420కి చేరాయి. వీటి లావాదేవీల విలువ మాత్రం రూ.10,710 కోట్ల నుంచి స్వల్పంగా పెరిగి రూ.10,751 కోట్లుగా నమోదైంది. రూ.50 లక్షల నుంచి రూ.1 కోటి మధ్య ఉన్న విభాగంలో రిజిస్ట్రేషన్లు 15,391 నుంచి 15,289కి (1 శాతం తగ్గుదల), లావాదేవీల విలువ రూ.10,862 కోట్ల నుంచి రూ.10,768 కోట్లకు తగ్గాయి. అక్టోబర్ నెలలో ప్రీమియం విభాగం మరింత బలంగా కనిపించింది. అక్టోబర్లో నమోదైన మొత్తం విలువలో రూ.1 కోటి పైబడిన ఇళ్ల వాటా ఏకంగా 59 శాతంగా నమోదైంది.

విశాలమైన ఇళ్లకే ప్రాధాన్యం..

కొనుగోలుదారులు పెద్ద విస్తీర్ణం కలిగిన విశాలమైన ఇళ్ల వైపు మొగ్గు చూపుతున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అక్టోబర్ 2026లో నమోదైన ప్రాపర్టీలలో 1,000 నుంచి 2,000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ఇళ్లు 65 శాతం వాటాను ఆక్రమించాయి. 2,000 నుంచి 3,000 చదరపు అడుగుల ఇళ్ల వాటా 13 శాతం నుంచి 14 శాతానికి, 3,000 చదరపు అడుగుల కంటే పెద్ద ఇళ్ల వాటా 3 శాతం నుంచి 5 శాతానికి పెరిగింది. మొత్తంగా చూస్తే, 2,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న ఇళ్ల వాటా 16 శాతం నుంచి 19 శాతానికి చేరుకుంది. 500 నుంచి 1,000 చదరపు అడుగుల ఇళ్లు 13 శాతం, 500 చదరపు అడుగుల లోపు చిన్న ఇళ్లు 3 శాతం వాటాను పొందాయి.

జిల్లాల వారీగా చూస్తే రంగారెడ్డి జిల్లా హైదరాబాద్ మార్కెట్లో పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. అక్టోబర్ 2026లో నమోదైన



మొత్తం రిజిస్ట్రేషన్లలో రంగారెడ్డి జిల్లా వాటా 52 శాతంగా ఉండగా, గతేడాది ఇదే నెలలో ఇది 47 శాతంగా ఉంది. మేడ్చల్-మల్కాజిగిరి వాటా 39 శాతం నుంచి 29 శాతానికి తగ్గింది. హైదరాబాద్ జిల్లా వాటా 14 శాతం నుంచి 18 శాతానికి పెరగగా, సంగారెడ్డి జిల్లా 1 శాతం వాటాను నమోదు చేసింది.

అక్టోబర్ నెలలో భారీ విలువైన లగ్జరీ ప్రాపర్టీ లావాదేవీలు ప్రముఖంగా నిలిచాయి. ముఖ్యంగా కోకాపేట్, జూబ్లీహిల్స్, పుప్పాలగూడ ప్రాంతాల్లో 3,000 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణం ఉన్న యూనిట్లలో భారీ డీల్స్ జరిగాయి. వీటి విలువ ఒక్కొక్కటి రూ.6.93 కోట్ల నుంచి రూ.13.12 కోట్ల వరకు ఉంది. రంగారెడ్డి జిల్లా కోకాపేట్లో అత్యధికంగా ఒక రెసిడెన్షియల్ ప్రాపర్టీ రూ.13.12 కోట్లకు రిజిస్టర్ కాగా, హైదరాబాద్ జిల్లా జూబ్లీహిల్స్లో మరో ప్రాపర్టీ రూ.13.06 కోట్లకు నమోదైంది. అలాగే కోకాపేట్లో రూ.10.57 కోట్లు, పుప్పాలగూడలో రూ.8.10 కోట్లు, మళ్లీ కోకాపేట్లో రూ.6.93 కోట్ల విలువైన ప్రాపర్టీలు రిజిస్టర్ అయ్యాయి. అత్యధిక విలువైన టాప్-5 లావాదేవీలలో నాలుగు రంగారెడ్డి జిల్లాలోనే కావడం గమనార్హం.

ఫైనల్‌కు దూసుకెళ్లిన భారత్..

అండర్-19 ఆసియా కప్ వన్డే టోర్నీలో భారత్ ఫైనల్కు దూసుకెళ్లింది. శనివారం టైటిల్ పోరులో పాక్తో టీమ్ఇండియా అమీతుమీ తేల్చుకోనుంది. గురువారం అఫ్గానిస్థాన్తో జరిగిన సెమీ ఫైనల్లో భారత్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. అఫ్గాన్ నిర్దేశించిన 228 పరుగుల టార్గెట్ని భారత్ 36.5 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ లక్ష్య రాజేష్ రాయచందాని (93; 90 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్) త్రుటిలో సెంచరీ మిస్ చేసుకున్నాడు. గత మ్యాచ్లో యూఏఈపై భారీ శతకం బాదిన వీరేంద్ర సెహ్వాగ్ తనయుడు ఆర్యవీర్ సెహ్వాగ్ (51; 57 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్సు) ఫామ్ను కొనసాగిస్తూ హాఫ్ సెంచరీ సాధించాడు. వీకే వినీత్ (57₹; 62 బంతుల్లో) కూడా అర్ధ శతకం సాధించాడు. తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గాన్ 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. మిడిల్ ఆర్డర్ బ్యాటర్లు నోమన్ సలార్జాయ్ (51), షా ఫైజల్ (51) రహీమీ అర్ధశతకాలతో రాణించారు. సోహైల్ ఖాన్ (36₹), సుభాన్ జఖైల్ (31) పరుగులు చేశారు. భారత బౌలర్లలో ఇషాన్ సూద్ (3/43) అద్భుత ప్రదర్శన చేశాడు. ఆర్యన్ సవ్సానీ రెండు వికెట్లు.. కావ్య పటేల్, యశ్వర్ధన్ చౌహాన్, అర్జున్ రాజ్పుత్ తలా ఓ వికెట్ పడగొట్టారు. మరో సెమీ ఫైనల్లో బంగ్లాదేశ్ను ఓడించి పాక్ ఫైనల్కు చేరింది. లీగ్ దశలో పాకిస్థాన్తో జరిగిన మ్యాచ్లో భారత్ ఓడింది. ఆ ఓటమికి తుది పోరులో టీమ్ఇండియా ప్రతీకారం తీర్చుకుని టైటిల్ సాధించాలని భారత క్రికెట్ అభిమానులు కోరుకుంటున్నారు.





‘హార్దిక్-అర్ష్‌దీప్ ట్రేడ్.. అందరూ హ్యాపీగా ఉన్నారు’

హార్దిక్ పాండ్య, అర్ష్‌దీప్ సింగ్ ట్రేప్ పంజాబ్ కింగ్స్ సహ యజమాని నెస్ వాడియా స్పందించారు. ఐపీఎల్ 2027కు ముందు అర్ష్‌దీప్ను ట్రేడ్ చేయాలని తమ ఫ్రాంచైజీ తీసుకున్న నిర్ణయం కఠినమైనది అయినప్పటికీ ఇరుపక్షాలకూ ప్రయోజనకరమైనదని తెలిపారు. ఈ డీల్తో అందరూ సంతోషంగా ఉన్నారని నెస్ వాడియా పేర్కొన్నారు. బీసీసీఐ ఆమోదం లభించడానికి ముందు పంజాబ్, ముంబయి జట్ల మధ్య ఈ ట్రేడ్ గురించి సుమారు నెల రోజుల పాటు చర్చలు జరిగాయని ఆయన వెల్లడించారు. ఇది ఉమ్మడి నిర్ణయమని, ఈ ట్రేప్ ఇరు ఫ్రాంచైజీలు ఆసక్తి చూపించాయని వాడియా వివరించారు. హార్దిక్ పాండ్యను పంజాబ్ కు ట్రేడ్ చేసిన ముంబయి.. ఆ జట్టు నుంచి అర్ష్‌దీప్ను తీసుకున్న సంగతి తెలిసిందే.

''ఈ ఒప్పందంతో అందరూ సంతోషంగా ఉన్నారని నేను భావిస్తున్నా. ముంబయి జట్టు హ్యాపీగా ఉంది. మేము, మా కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సంతోషంగా ఉన్నాం. రికీ పాంటింగ్, హార్దిక్ గతంలో కలిసి పనిచేశారు. ఇది రెండు ఫ్రాంచైజీలకు కూడా లాభదాయకమైన ఒప్పందం. అర్ష్‌దీప్ సింగ్ అద్భుతమైన బౌలర్. లీగ్లో అత్యంత విజయవంతమైన జట్లలో ఒకటి అతడిని కోరుకుంది. ముంబయి తరపున అర్ష్‌దీప్ రాణిస్తాడనే నమ్మకం ఉంది. ఎనిమిదేళ్ల తర్వాత అతడు పంజాబ్ జట్టును వీడుతుంటే నాకు బాధగా ఉంది. అయితే, ఒక వ్యక్తి జీవితంలో మరింత ఉన్నతమైన దశ వైపు అడుగులు వేస్తుంటే సంతోషపడాలి కదా'' అని నెస్ వాడియా పేర్కొన్నారు.




‘రియాలిటీ’ నుంచి మరో అందమైన మెలోడీ

యువతను ఆకట్టుకుంటోన్న కెమిస్ట్రీ!

యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న తాజా చిత్రం ‘రియాలిటీ’ నుంచి మరో అందమైన మెలోడీ ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమా నుంచి రెండో సింగిల్గా విడుదలైన ‘రుత్తు’ పాట యువతను ఆకట్టుకునేలా ప్రేమభరితమైన విజువల్స్, మధురమైన సంగీతంతో అలరిస్తోంది. కిరణ్ అబ్బవరం, దేవికా భట్ జంట మధ్య కనిపిస్తున్న కెమిస్ట్రీ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఈ సాంగ్కు ప్రముఖ గాయకుడు కపిల్ కపిలన్ తన మధురమైన గాత్రాన్ని అందించగా, పూర్ణాచారి సాహిత్యాన్ని రచించారు. సంగీత దర్శకుడు భీమ్స్ సిసిరోలియో మరోసారి తనదైన సంగీతంతో పాటకు ప్రత్యేకమైన అందాన్ని తీసుకొచ్చారు. ఇక ఈ సినిమాతో కిరణ్ అబ్బవరం దర్శకుడిగా కూడా పరిచయం అవుతుండటం విశేషం. దేవికా భట్ హీరోయిన్గా నటిస్తుండగా, శరత్ కుమార్, సాయికుమార్, రమేష్ ఇందిర, రోహిణి, అన్నపూర్ణమ్మ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. జాయ్ ఫిలమ్స్ బ్యానర్ సుధాకర్ చాగంటి నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది క్రిస్మస్ స్పెషల్గా డిసెంబర్ 25న విడుదల కాబోతున్నది. కాగా.. ఇప్పటికే విడుదలైన ‘భజ గోవిందం’ పాటకు మంచి స్పందన రాగా, తాజాగా వచ్చిన ‘రుత్తు’తో మ్యూజికల్ ప్రమోషన్స్ మరింత జోరందుకున్నాయి.

చార్లీ చాప్లిన్ గెటప్‌లో సుధాకర్..



మనర్తి విఘ్నేష్ నిర్మాతగా శ్రీ విఘ్నేశ్వర ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న తొలి చిత్రం ‘డైరెక్టెడ్ బై చార్లీ చాప్లిన్’. సుఖ మీడియా అనుసంధానంతో, బన్సారీ ఫిలమ్స్ సౌజన్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో తనదైన నటనతో వైవిధ్యమైన నటుడిగా గుర్తింపు తెచ్చుకున్న ‘లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్’ఫేమ్ సుధాకర్ కోమాకుల ఒక కీలకమైన, ఛాలెంజింగ్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ సినిమాలో కొంత భాగం ఆయన ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులకు సుపరిచితమైన దిగ్గజ హాస్యనటుడు చార్లీ చాప్లిన్ పాత్రలో కనిపించబోతున్నారు. ఈ పాత్ర ఈ చిత్రానికి ప్రత్యేక ఆకర్షణగా, హైలైట్గా నిలవనుండగా.. తాజాగా ఇందుకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ ప్రత్యేకమైన పాత్ర కోసం సుధాకర్ కోమాకుల ఎంతో హోంవర్క్ చేయడంతో పాటు, చార్లీ చాప్లిన్ హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మ్యానరిజమ్స్ను ప్రత్యేకంగా అధ్యయనం చేసినట్లు తెలుస్తోంది. ‘ఖిఐ యుగంధర్’ చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రాఘవేంద్ర కటారి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఒక సరికొత్త కథాంశంతో, విభిన్నమైన పాత్రలతో రూపొందనున్న ఈ చిత్రం త్వరలోనే సెట్స్కైకి వెళ్లనుంది. వచ్చే ఏడాది మే నెలలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చిత్ర బృందం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. త్వరలోనే పూజా కార్యక్రమాలతో ఈ చిత్రాన్ని ప్రారంభించి, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలను అధికారికంగా ప్రకటించనున్నారు.



యూత్ ఒలింపిక్స్‌లో భారత్‌కు తొలి స్వర్ణం

యూత్ ఒలింపిక్స్ లో భారత బాక్సర్ అంబేకర్ చరిత్ర సృష్టించాడు. మణిపూర్కు చెందిన ఈ బాక్సర్ 50 కేజీల విభాగం ఫైనల్లో 3-2 తేడాతో క్రిస్టియన్ జుబాని (ఐర్లాండ్)పై గెలుపొంది స్వర్ణ పతకం కైవసం చేసుకున్నాడు. దీంతో యూత్ ఒలింపిక్స్ గోల్ మెడల్ సాధించిన తొలి భారత బాక్సర్గా అంబేకర్ ఘనత సాధించాడు. ఈ టోర్నీలో బాక్సింగ్లో భారత్కు ఇది మూడో పతకం. 2010లో శివ థాపా 54 కేజీల విభాగంలో రజతం సాధించగా.. అదే ఎడిషన్ లో వికాస్ క్రిషన్ 60 కేజీల ఈవెంట్లో కాంస్యం సొంతం చేసుకున్నాడు.

నా మొదటి తెలుగు సినిమా.. చాలా ఆనందంగా ఉంది.. – దివ్యభారతి

జబర్దస్త్ ఫేమ్ సుడిగాలి సుధీర్ హీరోగా నటించిన తాజా చిత్రం ఎ..అ.ఖీ. దివ్యభారతి హీరోయిన్ గా నటించిన ఈ మూవీకి వేదవ్యాస్ దర్శకుడు. మహతేజ క్రియేషన్స్ అండ్ జైష్ణవ్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ మూవీ ప్రముఖ నిర్మాణ సంస్థ ఏషియన్ సినిమాస్ సమర్పణలో నవంబరు 12న థియేట్రికల్ విడుదలకు వచ్చింది. ఈ సందర్భంగా.. ఆడియన్స్తో కలిసి మూవీని ఎంజాయ్ చేసిన హీరోయిన్ దివ్య భారతి తన ఆనందాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ మేరకు ‘నా మొదటి తెలుగు సినిమా.. ప్రేక్షకుల మధ్య ‘ఫస్ట్ డే, ఫస్ట్ షో’ చూడటం నాకు ఎంతో ప్రత్యేకమైన అనుభవం. ప్రేక్షకుల నుంచి లభించే ఈ ప్రేమ నిజంగా అద్భుతమైనది. వారు సినిమాను ఆస్వాదిస్తుంటే చూడటం, ఆపై కృతజ్ఞతా భావంతో వారిని సాగనంపడం ఈ అనుభూతిని మాటల్లో వర్ణించలేను. ఇది నేను ఎప్పటికీ గుర్తుంచుకునే క్షణం. గోట్ మూవీ వెనుక ఎంతో మంది కఠిన శ్రమ, ఎంతో ప్రేమ ఉన్నాయి. మీరందరూ తప్పకుండా థియేటర్లలో ‘ఎఅఖీ’ సినిమాను చూసి, మా బృందానికి మీ ప్రేమను, మద్దతును అందించాలని కోరుకుంటున్నాను. అందరం కలిసి సినిమాను సంబరంగా జరుపుకుందాం’ అంటూ వీడియో షేర్ చేసింది హీరోయిన్.



రిలీజ్‌కు సిద్ధమైన యాక్షన్ థ్రిల్లర్



యువతతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే సరికొత్త కథాంశంతో తెరకెక్కిన చిత్రం ‘డేంజర్ బాయ్స్’ (చాప్టర్ క్లోజ్). వికాస్, రాధాభగవతి, అశ్వని హాసన్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ప్రతిభావంతుడైన దర్శకుడు అభిజిత్ తీర్థహళ్లి రచన, దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ మేకర్స్ సరికొత్త పోస్టర్ను విడుదల చేశారు. నవంబర్ 27వ తేదీన ఈ చిత్రాన్ని థియేటర్లలో అత్యంత ఘనంగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. విడుదలైన పోస్టర్లో ప్రధాన పాత్రధారులు రాత్రివేళ దట్టమైన అటవీ ప్రాంతంలో చేతిలో కాగడాలు, లాంతరు పట్టుకుని ఓ మిస్టరీని ఛేదించేందుకు వెతుకుతున్నట్లుగా కనిపించి.. సినిమాపై ఆసక్తిని పెంచేస్తున్నారు. ఉత్కంఠభరితమైన ఈ లుక్ సినిమాలోని థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ను కళ్లకు కడుతోంది.

ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ.. ‘కుటుంబ భావోద్వేగాలతో నిండిన ఒక విలక్షణమైన యాక్షన్ థ్రిల్లర్గా దర్శకుడు అభిజిత్ తీర్థహళ్లి ఈ చిత్రాన్ని అద్భుతంగా మలిచారు. ఇందులో ప్రతి సన్నివేశం ప్రేక్షకులకు వంద శాతం వినోదాన్ని పంచుతుంది. ముఖ్యంగా హీరో పాత్ర చిత్రణ తెరపై మునుపెన్నడూ చూడని రీతిలో సరికొత్తగా సాగుతుంది. నేటి తరం ప్రేక్షకులు కోరుకునే ఆసక్తికర కథనం, సస్పెన్స్, ఫ్యామిలీ ఎమోషన్స్ ఇందులో సమపాళ్లలో ఉన్నాయి. ఇంతటి మంచి కంటెంట్ ఉన్న సినిమాను తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నందుకు ఎంతో సంతోషంగా, గర్వంగా ఉంది. నవంబర్ 27న థియేటర్లలో విడుదలవుతున్న మా ‘డేంజర్ బాయ్స్’ చిత్రాన్ని తెలుగు ప్రేక్షకులు ఆదరించి పెద్ద విజయం చేస్తారని ఆశిస్తున్నాం‘ అని అన్నారు.



నిర్మాతలను డిమాండ్ చేస్తున్న నిధి..

ఆగిపోయిన తంత్ర-2 షూటింగ్!

యంగ్ బ్యూటీ నిధి అగర్వాల్ మరోసారి వార్తల్లో నిలిచింది. 2024లో విడుదలైన హారర్ థ్రిల్లర్ ‘తంత్ర’కు సీక్వెల్ గా తెరకెక్కుతున్న ‘తంత్ర 2’ తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. దర్శకుడు శ్రీనివాస్ గోపిశెట్టి తెరకెక్కిస్తున్న ఈ చిత్రాన్ని వరాహ ఫిలమ్స్ బ్యానర్ పై సునీత్ పడోల్కర్ నిర్మిస్తున్నారు. నిధి అగర్వాల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ సినిమా కొన్ని నెలల క్రితమే పూజా కార్యక్రమాలతో ప్రారంభమై, అనంతరం రెగ్యులర్ షూటింగ్ కూడా మొదలైంది. అయితే తాజా సమాచారం ప్రకారం, నిధి అగర్వాల్ షూటింగ్కు సంబంధించి పలు డిమాండ్లు చేస్తున్నారని, కొన్ని షెడ్యూల్స్ను రద్దు చేసుకోవడంతో చిత్రీకరణ ప్రణాళికలు దెబ్బతిన్నాయని సినీ వర్గాల్లో కథనాలు వెలువడ్డాయి. ఆమె వ్యవహారశైలిపై చిత్రబృందం అసంతృప్తిగా ఉన్నట్లు కూడా ప్రచారం జరుగుతోంది. దీంతో ప్రస్తుతం ‘తంత్ర 2’ షూటింగ్ నిలిచిపోయిందని, ఈ ప్రాజెక్టులో నిధి కొనసాగుతారా? లేదా నిర్మాతలు మరో హీరోయిన్ను ఎంపిక చేస్తారా? అనే ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలపై నిధి అగర్వాల్ నుంచి కానీ, చిత్ర నిర్మాతల నుంచి కానీ ఇప్పటివరకు అధికారిక వివరణ వెలువడలేదు. మొత్తానికి ‘తంత్ర 2’ చుట్టూ నెలకొన్న ఈ వివాదం టాలీవుడ్లో హాట్ టాపిక్గా మారింది.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No:19, IDA Balanagar, Medchal-Malkajgiri Dist, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.